# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 143 | హైదరాబాద్ | ఆదివారం 23-11-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

2047 నాటికి భారత్ నంబర్ వన్ : చంద్రబాబు

## మిస్ యూనివర్స్ 2025పై వివాదం

విజేతను ముందే ఫిక్స్ చేశారన్న జడ్జి!



11లో

- మిస్ యూనివర్స్ 2025 పోటీపై రిగ్గింగ్ ఆరోపణలు
- విజేతను ముందే నిర్ణయించారన్న జడ్జి ఒమర్ హర్ఫౌచ్
- యజమాని, విజేత తండ్రి మధ్య వ్యాపార ఒప్పందాలే కారణమని ఆరోపణ
- జడ్జి ఆరోపణలను ఖండించిన మిస్ యూనివర్స్ యాజమాన్యం
- ఒమర్‌ను తామే తొలగించామని స్పష్టం చేసిన సంస్థ

## జీ20 వేదికగా ప్రధాని మోదీ 4 కీలక ప్రతిపాదనలు



11లో



11లో

తెలంగాణ ప్రజలు ఎంత అమాయకంగా కనిపిస్తారో

# అంతటి చైతన్యవంతులు

- అందెశ్రీ సంతాప సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కవులు, కళాకారులు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్న ముఖ్యమంత్రి
- తెలంగాణ ప్రజలు అహంకారాన్ని, అధిపత్యాన్ని సహించలేరని వ్యాఖ్య




# విశాఖలో స్థలాల కోసం అన్వేషణ

విశాఖపట్టణం, నవంబర్ 22

'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో దూసుకుపోతున్న కూటమి ప్రభుత్వం.. విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ. 13.21 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. ఈ మేరకు వివిధ కంపెనీలతో 613 ఎంవోయూలు కుదుర్చుకుంది. అందులో విశాఖ కేంద్రంగా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు రూ. లక్ష కోట్ల విలువగల 99 ఒప్పందాలు ఉన్నాయి. పెట్టుబడులు పెట్టడానికి ముందుకువచ్చిన కంపెనీలు.. పరిశ్రమల ఏర్పాటు చేసేందుకు భూములు సిద్ధం చేసి, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది.తమది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానమంటూ దూసుకెళ్తోంది కూటమి ప్రభుత్వం. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇటీవల విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆ మేరకు పెట్టుబడులు రాబట్టడంలో విజయం సాధించింది. ఈ సదస్సులో రూ. 13.21 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. మొత్తం 613 ఎంవోయూలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఇందులో విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు కానున్న సంస్థలకు సంబంధించి 99 ఒప్పందాలు ఉన్నాయి. వీటి ద్వారా రూ. 98,917 కోట్లు పెట్టుబడులు రానున్నాయి. అయితే కేవలం అవగాహన ఒప్పందాలతోనే సరిపెట్టకుండా.. వీలైనంత త్వరగా కార్యరూపం దాల్చేలా చర్యలు ప్రారంభించింది.విశాఖలో ఏర్పాటయ్యే పరిశ్రమలకు సంబంధించి కుదిరిన ఎంవోయూలను అమలు చేసేలా ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఈ మేరకు ఇప్పటికే కార్యాచరణ రూపొందించామని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ) సూచనల మేరకు.. ఆయా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూ కేటాయింపులు, విద్యుత్తు కనెక్షన్, నీటి సదుపాయాల కల్పన, ఇతర మౌలిక వసతుల ఏర్పాటుకు తర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ మేరకు గురువారం జరిగిన మీడియా సమావేశంలో కలెక్టర్ వెల్లడించారు.పరిశ్రమల ఏర్పాటు కోసం 500 నుంచి 600 ఎకరాల భూములు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వీటికి అదనంగా 1200 ఎకరాలను విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ ( వీఎంఆర్‌డీఏ) ద్వారా సమీకరించేందుకు ప్రణాళిక చేస్తున్నామని వెల్లడించారు. మరోవైపు, విశాఖ సీఐఐ సదస్సులో కుదిరిన ఒప్పందాల్లో.. అధిక శాతం ఐటీ, టూరిజం, డేటా సెంటర్లకు సంబంధించిన పెట్టుబడులు ఉన్నాయని కలెక్టర్ చెప్పారు. ఇందులో 7 ఐటీ సంస్థలకు ఇప్పటికే భూమి పూజ కార్యక్రమాలు పూర్తి అయినట్లు వెల్లడించారు. కాగా, ఈ మొత్తం పెట్టుబడులు పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చితే.. 2,58,089 మందికి ఉద్యోగాలు లభించే అవకాశం కలుగుతుందని ఆయన చెప్పారు.మరోవైపు, విశాఖ సీఐఐ సదస్సుకు 60 దేశాల నుంచి 4,975 మంది ప్రతినిధులు వచ్చారు. వీరిలో అంతర్జాతీయ ప్రతినిధులు 640 మంది ఉండగా, దేశీయ ప్రతినిధులు 1135 మంది ఉన్నారు. 185 మంది దౌత్యవేత్తలతో పాటు ఎంవోయూల భాగస్వాములు 1,575 మంది సదస్సుకు హాజరయ్యారు. రెండ్రోజుల సదస్సులో 41 సెషన్లు నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 24 ద్వైపాక్షిక సమావేశాల్లో, 16 వ్యాపార సమావేశాల్లో పాల్గొన్నారు.

=================

# మోడీని ప్రత్యర్థులు గెలిపిస్తున్నారు!

2019 ఎన్నికల తర్వాత ఆమ్ ఆద్మీ పార్టీ నేత అరవింద్ కేజ్రీవాల్ ఓ ఇంటర్వ్యూలో చెప్పిన మాట ఇది. కేజ్రీవాల్ మోడీ అభిమాని కాదు. కానీ ఎన్నికల ఫలితాలను చూసి ఆయనకు అలా చెప్పాలని అనిపించింది. ఇప్పటికి ఆరేళ్లు గడిచాయి. ఎన్నో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. పార్లమెంట్ ఎన్నికలూ జరిగాయి. కానీ అరవింద్ కేజ్రీవాల్ చెప్పింది మాత్రం తప్పు కాలేదు. ఇప్పటికీ మోదీని ఎవరూ ఓడించలేకపోతున్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సాధారణ రాజకీయ పరిజ్ఞానం ఉన్న వారికి బీజేపీ, నితీష్ కూటమి గెలుస్తుందన్న నమ్మకం లేదు. ఎందుకంటే అక్కడ 20 ఏళ్లలో మధ్యలో కొద్ది రోజులు తప్ప అంతా నితీష్ కుమారే సీఎంగా ఉన్నారు. అంతకు ముందు ఎప్పుడో ఏడేళ్ల పాటు సీఎంగా చేసిన లాలూ ప్రసాద్ యాదవ్ జంగిల్ రాజ్ ను గుర్తు చేసి.. ఆయనను ఇరవై ఏళ్లుగా ఓడిస్తున్నారు. కానీ ఇరవై ఏళ్ల పాటు బీహార్ .. దేశంతో పాటు ముందుకు పోలేదని అక్కడి ప్రజలు వలస బాటలో ఉండి.. ఇతర రాష్ట్రాల్లో దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్నారని మాత్రం గుర్తించడం లేదు. ఇరవై ఏళ్లలో చాలా రాష్ట్రాలు ముందుకెళ్లాయి. కానీ బీహార్ ప్రజలు మాత్రం ఆయా రాష్ట్రాల్లో కూలీ పనులు చేసుకోవడానికే ఉయోగపడుతున్నారు. ఎందుకు బీహార్ మారడం లేదని ప్రజలు ప్రశ్నిస్తారని ..నితీష్ కుమార్ ను తరిమేస్తారని అనుకున్నారు. కానీ జరిగింది వేరు. తిరుగులేని మెజార్టీతో బీజేపీ, జేడీయూ కూటమి అధికారంలోకి వచ్చింది. ఈ ఫలితాలను చూసి అందరూ మరోసారి మోడీ జయహో అంటున్నారు. ఆయనను ఓడించే లీడర్ లేడని.. ఆయనకే విసుగు వచ్చి రిటైర్మెంట్ తీసుకుంటేనే ఇతరులకు అవకాశం వస్తుందని విశ్లేషిస్తున్నారు. జరుగుతున్న రాజకీయాలను.. వస్తున్న ఫలితాలను చూస్తే.. కేజ్రీవాల్ అభిప్రాయంతో విభేధించేవారు దాదాపుగా ఉండరు.నరేంద్రమోడీ ఎలా గెలుస్తున్నారు? ఇది చాలా మందికి అర్థం కాని విషయం. ఖచ్చితంగా ఓడిపోతారనుకున్న చోట్ల గెలుస్తున్నారు. గెలుస్తారని అనుకున్న చోట్ల ఇంకా బీభత్సంగా గెలుస్తున్నారు. అలాగని ఆయనకు గెలుపులే కాదు కొన్ని పరాజయాలూ ఉన్నాయి. అవి ఆయన ఇమేజ్ ను ఏ మాత్రం తగ్గించడం లేదు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారతీయ జనతా పార్టీకి తిరుగులేకుండా పోయింది. ఒకప్పుడు కొన్ని ప్రాంతాలకే పరిమితమైన పార్టీ ఇప్పుడు అంతటా విస్తరించింది. బెంగాల్ లాంటిచోట్ల కూడా పాతుకుపోయిందంటే.. ఇక తెలంగాణ ఓ లెక్క లేదు. 2014 మే 26న నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి అన్నీ తిరుగులేని విజయాలే వచ్చాయి. 2022 గుజరాత్‌లో 156 సీట్లతో 'ఎవర్-విన్నింగ్' రికార్డ్, 2024 మహారాష్ట్రలో 132 సీట్లతో 88% స్ట్రైక్ రేట్ మోడీ హయాంలో బీజేపీ అసెంబ్లీల్లో రికార్డుల సృష్టించింది. 2017లో జఖలో 312 సీట్లు సాధించింది. 2018లో ఓఖ, రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లో మెజారిటీలు. 2019లో కాంగ్రెస్‌ను దాటి ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా మారింది. గుజరాత్‌లో 3 ముఖ్యమంత్రులు మారినా 156 సీట్లు వచ్చాయి. మరోసారి గుజరాత్ లో ఎన్నికలు జరిగినా బీజేపీనే గెలుస్తుంది. మరో పార్టీ గెలిచే అవకాశం లేదు. ఎందుకంటే అక్కడ ప్రత్యర్థి ఎదగడం లేదు. ఒక్క గుజరాత్ కాదు.. చాలా రాష్ట్రాల్లో బీజేపీని మళ్లీ మళ్లీ గెలిపిస్తున్నారు కానీ.. ప్రత్యామ్నయంగా ఉన్న పార్టీలకు అసలు చాన్స్ రావడం లేదు. అలాంటి రిస్క్ తీసుకోవాలని ప్రజలు అనుకోవడం లేదు.

బీజేపీ, మోడీ ఇలా ఎందుకు గెలుస్తున్నారంటే.. దానికి ప్రధాన కారణం?మోదీకి ధీటైన నేత లేకపోవడం మాత్రమే కాదు?విపక్షాల్లో సరైన ఐక్యత లేకపోవడం కూడా. కేజ్రీవాల్ చెప్పినట్లుగా ఆయన వ్యతిరేకులు కూడా ఆయనను గెలిపించేందుకు ప్రయత్నిస్తూ ఉంటారు. సాయం చేస్తూ ఉంటారు. కాకపోతే నేరుగా కాదు.. వారి చేతకాని తనం, అనైక్యత వల్ల. 2014లో బీజేపీ ఒంటరిగా 282 సీట్లు, 2019లో 303 సీట్లు, 2024లో కూటమితో 293 సీట్లు గెలుచుకోగలిగినప్పుడు కాంగ్రెస్-నేతృత్వంలోని యూపీఏ 2014లో 44 సీట్లకు, 2019లో 52 సీట్లకు పరిమితమైంది. 2024లో ఎఔఆఎం కూటమి 234 సీట్లు సాధించినా, ఒక్క రాష్ట్రంలో కూడా బీజేపీని పూర్తిగా తుడిచిపెట్టలేకపోయింది. అసెంబ్లీ పరంగా కూడా అంతే. ఉత్తరప్రదేశ్‌లో 2017లో 312 సీట్లు, గుజరాత్‌లో 2022లో 156 సీట్లు, మహారాష్ట్రలో 2024లో 132 సీట్లు ఈ రికార్డులు సృష్టించినప్పుడు విపక్షాలు విడివిడిగా పోటీ చేశాయి. కలసి పోటీ చేసినా వారి మధ్య ఐక్యత లేదు. , ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ-కాంగ్రెస్ కూటమి 2022లో కూడా బీజేపీని ఆపలేకపోయింది. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో రీజనల్ పార్టీలు బలంగా ఉన్నా, జాతీయ స్థాయిలో ఒకే నినాదం, ఒకే నాయకత్వం లేకపోవడం బీజేపీకి లాభించింది. అందుకే "బీజేపీ గెలవడం కంటే విపక్షాలు ఓడిపోతున్నాయి" అని ఎక్కువగా అభిప్రాయం వినిపిస్తోంది. బీజేపీ యంత్రాంగం, ఆర్‌ఎస్‌ఎస్ నెట్‌వర్క్, కార్పొరేట్ ఫండింగ్, మీడియా డామినెన్స్, ఏజెన్సీల వినియోగం ? ఇవన్నీ కూడా విపక్షాలను బలహీనపరుస్తున్నాయి. అలాగే విపక్షాలు తమ ఇంటర్నల్ గొడవలు, నాయకత్వ సంక్షోభం, స్థానిక-జాతీయ వ్యూహాల మధ్య అంతరం తొలగించుకోలేకపోవడంతో.. మోదీ పని సులువు అవుతోంది.విపక్షాల బలహీనత ఎక్కువే. కానీ మోదీ పాలనా విజయాలను తక్కువ చేయలేం. దేశానికి రాచపుండులా పట్టి పీడిస్తున్న సమస్యలకు ఆయన సులువుగా పరిష్కారం చూపించారు. స్వాతంత్ర్యం వచ్చిన 77 ఏళ్లలో ఎవరూ తాకలేని, తాకితే రాజకీయంగా నష్టోతామని అధికారంలో ఉన్న పార్టీలు భయపడిన అతి సున్నితమైన సమస్యలను నరేంద్ర మోదీ ప్రభుత్వం ధైర్యంగా ఎదుర్కొని శాశ్వతంగా పరిష్కరించింది. ఈ నిర్ణయాలు కేవలం చట్టపరమైన మార్పులు మాత్రమే కాదు ? దేశ ఐక్యత, భావోద్వేగాలు, జాతీయ గర్వాన్ని తాకిన చారిత్రాత్మక విజయాలు. 2019 ఆగస్టు 5న పార్లమెంట్ రెండు సభల్లోనూ ఆర్టికల్ 370, 35ం రద్దు చేసి జమ్మూ-కాశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చారు. 1949లో "తాత్కాలిక నిబంధన"గా పెట్టిన ఈ ఆర్టికల్‌కు ఏడు దశాబ్దాల తర్వాత శాశ్వత ముగింపు పలికారు. ఫలితంగా కశ్మీర్ మారిపోయింది. 492 ఏళ్ల రామజన్మభూమి ? బాబ్రీ మసీదు వివాదానికి మోదీ హయాంలోపరిష్కారం లభించింది. దేశవ్యాప్తంగా ఒక్క గొడవ లేకుండా శాంతియుతంగా పరిష్కారం జరగడం చరిత్రలోనే అరుదైన ఘట్టం. ఆలయం కూడా నిర్మితమయింది. ఇప్పుడు అయోధ్య రోజుకు 2-3 లక్షల భక్తులతో నిండిపోతోంది ? హిందూ-ముస్లిం సామరస్యానికి చిహ్నంగా మారింది. ఈశాన్య రాష్ట్రాల్లో 2014 వరకు 30కి పైగా సాయుధ సంస్థలు యాక్టివ్‌గా ఉండేవి. మోదీ ప్రభుత్వం 11 ఏళ్లలో 12 పెద్ద శాంతి ఒప్పందాలు కుదుర్చుకుంది . దాదాపు 10,000 మంది మిలిటెంట్లు ఆయుధాలు వదిలిపెట్టారు. 1947 విభజన తర్వాత పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ నుంచి వచ్చిన హిందూ, సిక్కు, జైన్, బౌద్ధ, పార్సీ శరణార్థులకు 2024 మార్చి 11 నుంచి సీఏఏ కింద పౌరసత్వం మంజూరు ప్రారంభమైంది. ఇప్పటివరకు 14,000 మందికి పౌరసత్వం ఇచ్చారు. దశాబ్దాలుగా శిబిరాల్లో బతుకుతున్న వారికి గౌరవప్రదమైన జీవితం లభిస్తోంది. ఈ సమస్యలను ఎవరైనా పరిష్కరించగలరని ఎవరూ ఊహించలేదు.

# పిలిచి పదవి ఇస్తామన్నా వద్దంటున్నారా

విజయవాడ, నవంబర్ 22,

తెలుగుదేశం పార్టీలో సీనియర్ నేతగా ఉన్న దేవినేని ఉమామహేశ్వరరావును రాజ్యసభకు పంపడంపై పార్టీలో చర్చ జరుగుతుంది. మరో ఆరు నెలలో రాజ్యసభ స్థానాలు ఆంధ్రప్రదేశ్ లో ఖాళీ అవుతున్నాయి. ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాలను దక్కించుకుంటే ఆరేళ్ల పాటు పదవికి ఢోకా ఉండదు. అనేక మంది సీనియర్ నేతలు రాజ్యసభ రేసులో ఉన్నారు. అయితే దేవినేని ఉమామహేశ్వరరావుకు పెద్ద వయసు మించిపోలేదు. ఆయనను రాజ్యసభ కు పంపే కంటే ఎమ్మెల్సీ ఇవ్వడం మంచిదన్న అభిప్రాయం కూడా ఆయన అనుచరుల నుంచి వ్యక్తమవుతుంది. కానీ పార్టీ అగ్రనాయకత్వం ఆలోచనలు ఎలా ఉన్నాయన్న దానిపై ఇంకా క్లారిటీ మాత్రం రాలేదు రాజ్యసభ స్థానానికి వెళ్లారంటే ఇక ప్రత్యక్ష రాజకీయాలతో పాటు రాష్ట్ర రాజకీయాలకు కూడా దూరమయినట్లే భావించాల్సి ఉంటుంది. ప్రజలతో నేరుగా సంబంధం లేని పోస్టు కావడంతో దానిపై దేవినేని ఉమ లాంటి వ్యక్తులు అంతగా ఆసక్తి చూపరు. దేవినేని ఉమామహేశ్వరరావు రాజకీయమంతా టీడీపీలోనే కొనసాగుతుంది. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1999 లో ఆయన నందిగామ నుంచి రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 2004లోనూ ఆయన నందిగామ నుంచి ఎన్నికయ్యారు. తర్వాత నందిగామ నియోజకవర్గం రిజర్వ్‌డ్ కావడంతో పార్టీ అధినాయకత్వం సూచన మేరకు మైలవరానికి షిఫ్ట్ అయ్యారు. 2009, 2014 ఎన్నికల్లో దేవినేని ఉమ మైలవరం నుంచి ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో మాత్రం తొలిసారి ఓటమి పాలయ్యారు దేవినేని ఉమ వ్యవహారంలో అధినాయకత్వం ఆలోచన ఎలా ఉందన్నది ఎవరికీ అర్థం కావడం లేదు. ఉమ ఇక్కడుంటే మళ్లీ కృష్ణా జిల్లా రాజకీయాల్లో



గ్రూపు తగాదాలు ఎక్కువవుతాయన్న వాదనలను కూడా పార్టీ నాయకత్వం పరిగణనలోకి తీసుకునే అవకాశముంది. అదే సమయంలో దేవినేని ఉమను రాజ్యసభకు పంపాలంటే సామాజికవర్గం కూడా కొంత అడ్డంకి గా మారుతుంది. ఈ నేపథ్యంలో దేవినేని ఉమకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చిఇక్కడే కొనసాగిస్తారా? లేక వచ్చే ఎన్నికల్లో నందిగామ జనరల్ నియోజకవర్గం అయితే అక్కడి నుంచి పోటీ చేయవచ్చని సర్ది చెబుతారా? అన్నది ఇంకా తేలలేదు. రాజ్యసభ పదవి మాత్రం తనకు వద్దంటే వద్దని మాత్రం దేవినేని ఉమ చెబుతున్నట్లు తెలిసింది. పదవి ఇస్తామని ఎవరూ చెప్పకపోయినా.. తనకు పిలిచి పదవి రాజ్యసభ ఇస్తామన్నావద్దని చెబుతానని దేవినేని సన్నిహితుల వద్ద వ్యాఖ్యానిస్తున్నారట.

# వన్ టైమ్ ఎంపీగానే గోరంట్ల

అనంతపురం, నవంబర్ 22,



మాజీ పార్లమెంటు సభ్యుడు గోరంట్ల మాధవ్ కు ఈసారి కూడా వైసీపీలో టిక్కెట్ దొరకడం కష్టమే. ఆయన అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పార్టీ అధికారంలోకి వస్తే రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ వంటి నామినేటెడ్ పోస్టు ఇస్తారేమో కానీ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం మాత్రం ఇక దొరకదన్నది పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. ఆయన వరసగా అనేక వివాదాలలో కూరుకున్నందున, పార్టీకి ఇబ్బందికరంగా మారినందున ఆయనకు ఎక్కడా అసెంబ్లీ, పార్లమెంటు టిక్కెట్ ఇచ్చే అవకాశం లేదని తెలిసింది. గోరంట్ల మాధవ్ కు కూడా ఇటీవల కాలంలో చూచాయగా ఈ విషయాన్ని పార్టీ నాయకత్వం చెప్పినట్లు పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. పోలీస్ శాఖలో సర్కిల్ ఇన్స్ పెక్టర్ గా, పోలీస్ అధికారుల సంఘం నేతగా ఉండి, ఉద్యోగానికి స్వచ్ఛంద పదవీ విరమణ చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. జగన్ హిందూపురంలో బీసీలకు టిక్కెట్ ఇవ్వాలనుకుంటున్న జగన్ కు గోరంట్ల మంచి ఛాయిస్ గా కనిపించారు. దీంతో ఆయనకు ఈ ఎన్నికల్లో హిందూపురం పార్లమెంటు టిక్కెట్ దక్కింది. అన్నీ కలిసొచ్చి విజయం సాధించారు. గెలిచిన తర్వాత అనేక వివాదాల్లో చిక్కుకున్నారు. పార్లమెంటు సభ్యుడిగా మంచి పేరు తెచ్చుకున్నా వ్యక్తిగత విషయాలతో ఆయన ఇబ్బంది పడ్డారు. పార్టీని కూడా ఇబ్బందుల్లోకి నెట్టారు. సామాజికవర్గం కోటాలో తనకు సీటు దక్కుతుందని ఇన్నాళ్లు భావించిన గోరంట్ల మాధవ్ కు మాత్రం ఇక ఆశ నెరవేరనట్లేనని అనుకోవాలి... వైసీపీకి నమ్మకమైన నేతగా గోరంట్ల మాధవ్ ఉన్నప్పటికీ ఆయన పత్తికొండ, రాప్తాడు నియోజకవర్గాలపై కన్నేశారు. కానీ అక్కడ అప్పటికే వైసీపీకి చెందిన బలమైన నేతలున్న కారణంగా వచ్చే ఎన్నికల్లోనూ ఎక్కడా గోరంట్ల మాధవ్ కు సీటు దక్కే అవకాశాలు లేవు. తమ నియోజకవర్గాల్లో వేలు పెడుతున్నారంటూ అక్కడి నేతలు గోరంట్ల మాధవ్ పై వైసీపీ నాయకత్వానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో వైసీపీ కి చెందిన ముఖ్య నాయకుడు ద్వారా జగన్ గోరంట్లకు సమాచారం పంపారని, ఆ నియోజకవర్గాల్లో వేలు పెట్టవద్దని సూచించినట్లు తెలిసింది. వైసీపీ అధికారంలోకి వస్తే నామినేట్ పదవి మాత్రం ఖచ్చితంగా దక్కుతుంది. అందుకే గోరంట్ల మాధవ్ ఇటీవల కాలంలో సైలెంట్ గా ఉన్నారు.

# రగులుతున్న అమరావతి

విజయవాడ, నవంబర్ 22,

రాజధాని అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతులు ఒక కమిటీగా ఏర్పడి ఈ మధ్యనే గుంటూరులో ఒక సమావేశం నిర్వహించారు. వారి మాటల్లో రాజధాని కోసం భూములు ఇచ్చి అధికారులతో మాటలు పడాల్సిన కర్మ పట్టిందే అన్న బాధ ఎక్కువగా కనిపించింది. చంద్రబాబుపై నమ్మకంతో 29 గ్రామాల ప్రజలు భూములు ఇస్తే తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై ప్రభుత్వం నత్త నడకన పనిచేస్తోంది అనేది వారి ప్రధాన ఆరోపణ. ముఖ్యంగా సిఆర్డిఏ అధికారులు కలవడానికి నానా అగుచాట్లు పడవలసి వస్తుందని అధికారులు ఏమాత్రం విలువ ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు. నిజానికి 2019-24 మధ్య కాలంలో అమరావతిని పూర్తిగా పక్కన పెట్టేసిన జగన్ ప్రభుత్వంపై మొట్టమొదట ఉద్యమాలు చేసింది తామే అని దాని ఫలితంగా 2024 ఎన్నికల్లో కూటమి పెద్ద విజయం సాధించింది అనీ అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులు కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. అమరావతి రైతులు వినిపిస్తున్న ప్రధాన సమస్యలు ఇవి

1) గ్రామ కంఠం సమస్య-గెజిట్ నోటిఫికేషన్ ఆలస్యం

ప్రధానంగా అమరావతి రైతులు ఎదుర్కొంటున్న సమస్య అసలు రాజధాని బౌండరీస్ ఎక్కడని. ఇంతవరకు అమరావతి గెజిట్ నోటిఫికేషన్ రాకపోవడంతో రాజధాని ఎల్లలపై సందిగ్దత అలాగే కొనసాగుతుంది. అదిగాక గ్రామ కంఠాల సమస్య అలాగే నిలిచిపోయింది. నిజానికి ప్రభుత్వం, అధికారులు దృష్టి పెడితే పది పదిహేను రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించవచ్చు. కానీ కూటమి వచ్చి ఏడాదిన్నర గడిచినా ఇప్పటికి సమస్య అలాగే ఉంది.

2) మహిళల్ని, చిన్న రైతులని అవమానిస్తున్నారు

అఖీఅం అధికారులు మహిళలు, చిన్నకారు రైతులతో మాట్లాడే విధానం అసలు బాలేదని రాజధాని కోసం భూములు ఇచ్చి ఉద్యమాలు చేసిన తమతో వారి వ్యవహార శైలి ఏమాత్రం బాగుండడం లేదనేది వారి ఆరోపణ. ముఖ్యమంత్రి చంద్రబాబుపై తమకు వ్యతిరేకత లేదని కానీ కింద ఉన్న నాయకులు అధికారులు తమ సమస్యలు పట్టించుకోవడంలేదని విమర్శిస్తున్నారు.

3) భూములు ఇవ్వని పొలాల్లో ఇచ్చిన వారికి ప్లాట్లు

అమరావతికి 29 గ్రామాల ప్రజలు భూములు ఇవ్వగా ఆయా గ్రామాల్లో ఇంకా కొన్ని పొలాల భూ సమీకరణ జరగాల్సి ఉంది. భూములు ఇచ్చిన రైతులకు ఇంకా రిటర్నబుల్ ఫ్లాట్స్ ఇచ్చే విషయంలో పనులు నత్త నడకన సాగుతున్నాయి. అంతేకాకుండా ఇంకా భూములు ఇవ్వని 1250 ఎకరాల్లో రోడ్లు వేయడం కోసం నోటిఫికేషన్ ఇచ్చారు. దానితో అక్కడ రైతులు కూడా ఆందోళన చేస్తున్నారు. ఈ వ్యవహారం అంతా గజిబిజిగా తయారైంది.

4) ఇప్పటికీ అమరావతి రైతులపై కేసులు అలానే ఉన్నాయి అలానే ఉన్నాయి

2019-24 మధ్య కాలంలో జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు రాజధానుల బిల్లుకు వ్యతిరేకంగా పోరాటం చేసిన అమరావతి రైతుల ఏంఅ నాయకులపై నమోదు చేసిన కేసులు ఇప్పటికే అలాగే ఉన్నాయి. వీలైనంత త్వరగా తొలగించాలని రైతులు ఆందోళన చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచిపోయినా ఎన్నికల్లో ఇచ్చిన ఆ హామీ అలాగే ఉండిపోయింది.ప్రభుత్వం వచ్చిన కొత్తలో మున్సిపల్ మంత్రి నారాయణ కలిసి అమరావతి జేఏసీ 14 సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు.

అయితే వాటిలో నెరవేరింది మాత్రం కేవలం ఒక్కటే. అది రైతులు ఇచ్చిన భూములకు ఏడాది పొడవునా ఇచ్చే కౌలు. అలాగే అమరావతిలో ఉన్న అసైండ్ భూములకు సంబంధించి ఇచ్చే నష్ట పరిహారంపై ఇప్పట్లో ఏమి తేల్చలేదని స్పష్టత రైతులకు ఇచ్చేసింది ప్రభుత్వం. మిగిలిన 12 సమస్యలపై ప్రభుత్వం గానీ సిఆర్డిఏ అధికారులు కానీ ఏమి తేల్చకుండా ఉండడం వల్ల రైతుల నుంచి జేఏసీ నాయకులు పలు విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. ఈ నెలాఖరున మరోసారి సమావేశమై తమ తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని అమరావతి రైతుల ఏంఅ చెబుతోంది.

# ధర్మపురి ని కమ్మేసిన పొగమంచు... ఇక్కట్లపాలైన వాహనదారులు

జగిత్యాల నవంబర్ 22,

ఓవైపు చలి, మరోవైపు పొగ మంచు ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రాన్ని పొగ మంచు కమ్మేసింది. దట్టమైన పొగమంచుతో స్థానికులు ఇక్కట్ల పాలయ్యారు. గోదావరినది తీరంలో ఉన్న ధర్మపురి క్షేత్రాన్ని పొగమంచు కమ్మేయడం మరో ఊటి, అరకు లోయను తలిపించింది. పొగమంచుతో తెల్లవారుజామున పారిశుధ్య కార్మికులు?మార్నింగ్ వాకర్స్, ఇంటింటికి తిరిగి పాలుపోసేవారు ఇబ్బంది ఎదుర్కొన్నారు. వాహనదారులు దారి కనిపించని పరిస్థితిలో ఇక్కట్ల పాలయ్యారు. హెడ్ లైట్ వేసుకుని వాహనదారులు వెళ్ళాలని పోలీసులు సూచించారు.

===========================

# గూగుల్ డేటా సెంటర్ కోసం అడుగులు

## 60 శాతం సేకరణ పూర్తి

విశాఖపట్టణం, నవంబర్ 22, (న్యూస్ పల్స్)

విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటులో ప్రభుత్వం చాలా వేగంగా చర్యలు తీసుకుంటోంది. ఒప్పందం జరిగిన నెల రోజులు కాక ముందే భూసేకరణ పూర్తి చేస్తోంది. డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని భావించే భీమిలి నియోజకవర్గంలోని ఆనందపురం మండలం పరిధిలో రైతులతో చర్చిస్తోంది. అన్నదాత డిమాండ్ మేరకు పరిహారం పెంచింది. అందుకే దాదాపు 60శాతానికిపైగా రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. మిగిలిన వారిని కూడా ఒప్పించేందుకు ప్రజాప్రతినిధులు ఆ ప్రాంతంలో పర్యటిస్తున్నారు. ఇప్పటికే భూములు ఇచ్చిన రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనుంది ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటును ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అందుకే ఎలాంటి అడ్డంకులు లేకుండా గూగుల్ డేటా సెంటర్‌ను వీలైనంత త్వరగా గ్రౌండింగ్ చేసేందుకు వేగంగా చర్యలు చేపడుతోంది. అన్నింటి కంటే ముఖ్యమైన భూసేకరణ ముమ్మరంగా చేస్తోంది. తర్లువాడలో మూడు వందల ఎకరాలకుపైగా గూగుల్ సంస్థకు ఇవ్వబోతోంది. ఈ ప్రక్రియను సాఫీగా సాగేందుకు రైతులు డిమాండ్‌ల పరిష్కారానికి చర్యలు చేపట్టింది. వారు చెప్పినట్టుగా పరిహారం పెంచుతోంది. వారు చెప్పిన ఇతర విషయాలను కూడా పరిగణలోకి తీసుకుంటామని చెబుతోంది. ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల నుంచి ప్రభుత్వం భూములు సేకరిస్తోంది. తర్వాత ఏపీఐఐసీ నుంచి గూగుల్‌కు భూములు కేటాయిస్తారు. ఇప్పటి వరకు సేకరణ గుర్తించిన భూముల్లో 204 ఎకరాల వరకు డీపట్టా, రికార్డుల్లోకి చేరని శివాయ్ జమేదార్ భూములు ఉన్నాయి. ఇందులో డీ పట్టా భూములకు ఇరవై లక్షల పరిహారం అందజేస్తారు. రికార్డుల్లో లేని భూములకు పది లక్షల పరిహారం ఇస్తారు. వీటితోపాటు పట్టాలు ఉన్న రైతులకు ఇరవై సెంట్ల భూమిని, మూడు సెంట్ల ఇంటి స్థలాన్ని కూడా అదే ప్రాంతంలో కేటాయించేందుకు ప్రభుత్వం ఓకే చెప్పింది. ఇంటి కోసం ఇచ్చే స్థలాన్ని ఐదు సెంట్లు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఆలోచన చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే భూములు ఇచ్చేందుకు అంగీకరించి పత్రాలు అందజేసిన రైతులకు శనివారం నుంచి జమ చేయనుంది ప్రభుత్వం. మిగతా రైతులను ఒప్పించేందుకు గురువారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధికారులతో కలిసి తర్లువాలో పర్యటించారు.




రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఇంకా వారి డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. గతంలో ప్రభుత్వానికి ఇచ్చిన భూములకు పరిహారం పెంచాలని కూడా స్థానిక రైతులు డిమాండ్ చేశారు. వాటి గురించి కూడా ఆలోచిస్తామని గంటా మాట ఇచ్చారు. ఈ సందర్భంగా కొందరు దళారులు వచ్చి తమ భూములను భారీ రేటుకు కొంటామని చెబుతున్నారని అన్నారు. గతంలో కూడా చాలా మంది తమకు తెలియకుండానే తమ భూములు కాజేశారని వాపోయారు. వాటికి సంబంధించిన కేసులు నడుస్తున్నాయని గుర్తు చేశారు. ఇలాంటి మాయమాటలు నమ్మి మోసపోవద్దని, ఏదైనా అనుమానం ఉంటే అధికారులతో మాట్లాడాలని గంటా చెప్పారు. మాయగాళ్ల సమాచారం పోలీసులకు ఇవ్వాలని, వారి పని ప్రభుత్వం చూసుకుంటుందని తెలిపారు.

ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఏపీ ప్రభుత్వం దాదాపు 300 ఎకరాలకు పైగా భూమి కేటాయిస్తామని చెప్పడంతో పాటు డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించి చట్టం మార్చి కొన్ని రకాల మినహాయింపులు కూడా ఇచ్చారు. దీంతో ఏపీ వైపు గూగుల్ డేటా సెంటర్ వచ్చింది. దేశంలోనే ఇది చర్చకు దారి తీసింది. టిడిపి కూటమి పాలన పట్ల ప్రజల సంతృప్తి చెందేలా ఉండడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మింగుడు పడని అంశంగా మారింది. ఈ తరుణంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన భూ సేకరణకు అనేక రూపాల్లో అవాంతరాలు ఎదురయ్యాయి. అయితే ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా తీసుకోవడంతో.. రైతుల డిమాండ్లను సైతం పరిగణలోకి తీసుకున్నారు. పరిహారం విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవడంతో రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చేందుకు ముందుకు రావడం విశేషం.భీమిలి నియోజకవర్గం పరిధిలోని ఆనందపురం మండలం తర్లువాడలో దాదాపు 300 ఎకరాలకు పైగా భూమిని గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం కేటాయించింది. అయితే ఆశించిన స్థాయిలో పరిహారం ఇవ్వడం లేదని.. పునరావాస చర్యలు చేపట్టడం లేదని రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో కలుగజేసుకుంది. రైతుల్లో ఒక రకమైన అపోహలు సృష్టించేలా చేసింది. అయితే స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు నిర్వాసితుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం సైతం భూమి కోల్పోయిన రైతుల విషయంలో కొన్ని రకాల పరిహారాలను పెంచింది. వారికి అన్ని విధాల అండగా ఉంటామని చెప్పడంతో దాదాపు 60 శాతం మంది రైతులు స్వచ్ఛందంగా భూములు ఇవ్వడం విశేషం. మిగతావారు సైతం భూములు ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు.ఎకరా భూమి ఇచ్చిన వారికి.. 80 సెంట్లు సంబంధించిన పరిహారం? మిగతా 20 సెంట్లు కు సంబంధించి వేరేచోట భూమి కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. భూమి కోల్పోయిన ప్రతి రైతుకు మూడు సెంట్లు ఇంటి స్థలం చొప్పున వేరే చోట భూమి కేటాయించింది ప్రభుత్వం. పైగా భూముల విలువను పెంచుతూ.. ప్రతి ఎకరాకు 20 లక్షల వరకు పరిహారం పెంచుతూ నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం. అయితే ఇప్పటివరకు అడ్డంకులు సృష్టించిన వైసీపీ చోటా నాయకులు సైతం ఈ పరిహారం పెంచడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛందంగా భూములు వదులుకునేందుకు సిద్ధపడుతున్నారు. వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేసి గూగుల్ డేటా సెంటర్కు ఆ భూమిని అప్పగిస్తే.. కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంది సదరు సంస్థ.గూగుల్ డేటా సెంటర్ విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కొంచెం అతిగా వ్యవహరించింది. దాని ద్వారా ఎటువంటి ఉద్యోగాలు రావని.. రాష్ట్రానికి కూడా ఆదాయం రాదని ప్రచారం చేయడం ప్రారంభించారు. అయితే ఆలస్యంగా స్పందించారు అధినేత జగన్మోహన్ రెడ్డి. పార్టీ శ్రేణులకు భిన్నంగా మాట్లాడారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో ఎంతో అభివృద్ధి ఉంటుందని.. అనుబంధ సంస్థలు పెద్ద ఎత్తున తరలివస్తాయని చెప్పుకొచ్చారు. అప్పటినుంచి వైసిపి నేతలు సైలెంట్ గా ఉండగా.. ఏకంగా వైసీపీకి చెందిన ఎంపీపీ కుటుంబం సైతం పెద్ద ఎత్తున ఆస్తులు వదులుకోవడం విశేషం.

-----------------

# లోకల్ బాడీస్.. బాయ్ కాట్... వైసీపీ వ్యూహం...

విజయవాడ, నవంబర్ 22,


వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో నిలబడుతుందా? అసలు నిలబడగలదా? కూటమి దూకుడును తట్టుకోగలదా? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. 2021లో స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా జరిగాయో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి స్పష్టంగా తెలుసు. ఒకవైపు వలంటీర్ల ఒత్తిడి, మరోవైపు వ్యవస్థల మద్దతు, కనీసం టిడిపి నేతలకు నామినేషన్ వేసే ఛాన్స్ కూడా ఇవ్వలేదు. జిల్లా పరిషత్తులు ఏకంగా ఏకగ్రీవం అయ్యాయి. ఎంపీటీసీ స్థానాల్లో పోటీ లేకుండా పోయింది. పోలింగ్ బూత్ లకు వెళ్లి మరి ఓట్లు వేసుకున్న చరిత్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీది. అటువంటి పార్టీ ఇప్పుడు ప్రతిపక్షంలోకి మారింది. అధికారపక్షంగా తాము చేసిన వ్యవహారం తెలియంది కాదు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దాదాపు పాల్గొనక పోవచ్చు.2019లో గెలిచింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. తరువాత అన్ని రకాల ఎన్నికల్లోనూ ఆ పార్టీదే హవా. అంతకుముందు 2006, 2013లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ప్రత్యర్థులకు అప్పట్లో అవకాశం ఉండేది. 2006లో టిడిపి గణనీయమైన స్థానిక సంస్థలను సొంతం చేసుకుంది. 2013లో సైతం సత్తా చాటింది. కానీ 2021 లో మాత్రం తెలుగుదేశం పార్టీ కనీసం నామినేషన్లు కూడా వేయలేకపోయింది. అంతలా సాగింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హవా. తొలుత సర్పంచ్ ఎన్నికలు జరిగాయి. 80% వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంది. భయపెట్టి మరి పంచాయితీలను కైవసం చేసుకున్న సందర్భం వచ్చింది. అదే దూకుడుతో మున్సిపల్ ఎన్నికల్లో కూడా తన ప్రభావం చూపింది. కనీసం రాజకీయ ప్రత్యర్థులు నామినేషన్లు వేయకుండా చేసింది. నగరాలతో పాటు



పట్టణాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వశం అయ్యాయి. చివరకు మండల పరిషత్తులతోపాటు జిల్లా పరిషత్తులు సైతం ఏకపక్షంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సొంతం చేసుకుంది. అయితే ఇంతలా చేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 2024 ఎన్నికల్లో అతి దారుణంగా ఓడిపోయింది.అయితే పులివెందుల జడ్పిటిసి ఉప ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ కూడా దక్కలేదు. దానికి వైసీపీ చెబుతున్న కారణం అధికార పార్టీ అంతులేని అధికార దుర్వినియోగం. మరి అంతకుముందు వైసీపీ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల గురించి ప్రస్తావిస్తే మాత్రం.. అదంతా ప్రజాస్వామ్య యుతంగా జరిగినట్లు చెబుతోంది. నువ్వు నేర్పిన విద్య నీరజాక్ష అన్నట్టు.. కచ్చితంగా అప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో తప్పు చేసి ఉంటే.. పులివెందుల ఉప ఎన్నికల్లో సైతం టిడిపి కూటమి ప్రభుత్వం తప్పు చేసినట్టే. అధికార పార్టీ తన ప్రభావం చూపినట్టే. దానిని పసిగడితే మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తుంది. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# నక్సల్స్ కొంప ముంచిన అద్దె భవనం

విజయవాడ, నవంబర్ 22,



విజయవాడనగరంలో పట్టుబడ్డారు 27 మంది మావోయిస్టులు. ఇంటెలిజెన్స్ సమాచారంతోనే వారిని పట్టుకున్నట్లు ప్రచారం నడుస్తోంది. కానీ మావోయిస్టులు చేసిన చిన్న తప్పిదం వల్లే వారు పట్టు పడడం విశేషం. చత్తీస్గడ్ దండకారణ్యంలో భద్రతా బలగాలు దాడులతో పాటు తనిఖీలు ముమ్మరం చేశాయి. ఒడిస్సా సరిహద్దు ప్రాంతాల్లో సైతం పోలీసుల గాలింపులు అధికంగా ఉంది. ఇటువంటి తరుణంలో ఏపీలో తలదాచుకునేందుకు వచ్చిన మావోయిస్టులకు ఇటీవల ఎదురు దెబ్బ తగిలింది. అల్లూరి సీతారామరాజు జిల్లా సరిహద్దు ప్రాంతంలో జరిగిన ఎన్కౌంటర్లో 13 మంది మావోయిస్టులు చనిపోయారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో వరుసగా రెండు రోజులపాటు జరిగిన ఎన్కౌంటర్లో మావోయిస్టు అగ్రనేతలు సైతం చనిపోయారు. అదే సమయంలో విజయవాడ నగరంతో పాటు కాకినాడలో పెద్ద ఎత్తున మావోయిస్టులు పట్టు పడడం విశేషం.విజయవాడ ఆటోనగర్( ప్రాంతంలో మావోయిస్టులు పట్టుబడడం మాత్రం సంచలనం రేగింది. ఆ ప్రాంతంలో ఆటో కార్మికులు అధికం. రవాణా రంగానికి సంబంధించిన లావాదేవీలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఈ క్రమంలో ఆటోనగర్ శివారు ప్రాంతంలోని ఒక భవనంలో ఏకంగా 27 మంది మావోయిస్టులు తలదాచుకున్నారు. అయితే వీరు పట్టు పడడం వెనుక వీరి వైఫల్యం ఉంది. ఆ భారీ భవనంలో కింది వర్షన్ వ్యాపార అవసరాలకు అద్దెకు ఇచ్చారు సదరు యజమాని. పై పోర్షన్ అంతా ఓపెన్ హాల్. గత కొద్ది నెలలుగా ఆ హాల్ ఖాళీగా ఉంది. ఈ క్రమంలో అక్కడ హాల్ ను అద్దెకు తీసుకున్నారు కొంతమంది. ఏకంగా లక్ష రూపాయలకు అద్దెకు తీసుకోవడం ఆ ప్రాంతంలో చర్చకు దారి తీసింది. కొద్ది నెలలుగా ఖాళీగా ఉన్న ఆ భవనం ఏకంగా లక్షలు అద్దెకు వెళ్లడంతో స్థానికులు చర్చించుకోవడం ప్రారంభించారు. ఆ నోటా ఈ నోటా విన్న పోలీసులు దీనిపై దృష్టి పెట్టారు.అయితే మావోయిస్టులు అంత ఈజీగా ఎలా ఆలోచించారో తెలియడం లేదు. ఎందుకంటే ఒకే భవనంలో అంతమంది అద్దెకు దిగితే కచ్చితంగా అనుమానం వస్తుంది. ఆపై ఒకే భవనంలో 27 మంది దిగితే అసాంఘిక కార్యకలాపాల విషయంలో అనుమానం వస్తుంది. ఆపై లక్ష రూపాయల అద్దెకు దిగడం అంటే దీని వెనుక ఏదో ఒకటి ఉందన్న అనుమానం వెంటాడుతుంది. పోలీసులు సైతం ఆ అనుమానంతోనే కూపీ లా గారు. మావోయిస్టులు అన్న విషయాన్ని తెలుసుకున్నారు. ఆ భవనాన్ని చుట్టుముట్టి చాలా తేలిగ్గా 27 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకోగలిగారు.

==============================

# ఢిల్లీ పేలుళ్ల వెనుక పాక్ కుట్ర...

న్యూఢిల్లీ, నవంబర్ 22,

నవంబర్ 10, 2025న దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద కారుబాబు పేలింది. ఈ ఘటనలో 12 మంది మరణించారు. 20 మంది వరకు గాయపడ్డారు. విచారణ తర్వాత ఇది సాధారణ పేలుడు కాదని, ఆత్మాహుతి దాడి అని నిర్ధారణ అయింది. దీంతో భారత్ ఈ కుట్ర వెనుక ఎవరు ఉన్నారనే కూపీ లాగుతోంది. ఈ క్రమంలో పాకిస్తాన్ హస్తం బయటపడింది. జైస్ ఎ మహ్మద్ సంస్థతో పేలుడు కుట్రదారులకు లింకులు ఉన్నట్లు గుర్తించింది. 2021?22 సంవత్సరాల్లో షాహిన్ షాహిద్ టర్కీకి వెళ్లి జైష్ ఎ మహ్మద్ నాయకులతో సంబంధాలు పెంచుకొని ఆఫ్గానిస్తాన్, పాకిస్తాన్ మార్గాలుగా భారత్‌కు దాడులు సిద్ధం చేసుకున్నారు. ఇది టర్కీ సాయంతో పాకిస్తాన్ కుట్రగా తెలుస్తోంది.ఒకవైపు దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలో సంబురాల్లో ఉన్న పాకిస్తాన్.. తన కుట్రను బయటపెడుతోంది. తాజాగా పాక్ ఆక్రమిత కశ్మీర్ పీపుల్?? డెమోక్రాటిక్ పార్టీ (పీవోకే) ప్రధానులు చౌరదీ అన్వర్ ఉల్ హఖ్ దాడులు తమ పనే అని ప్రకటించాడు. 'మేము కశ్మీర్ లో ఎక్కడైనా దాడులు చేస్తూనే ఉంటాం' అని ప్రకటించాడు. గతంలోనే 2025 ఏప్రిల్ 22న పహల్గాం ప్రాంతంలో 26 యాత్రికులు చనిపోవటంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. భారత ప్రభుత్వం ఈ దాడులకు సంబంధించి కఠిన చర్యలు తీసుకునే స్పష్టమైన సంకల్పంతో ఉంది. ఉగ్రవాదులకు మద్దతు ఇచ్చే దేశాలపై కూడా కఠిన పాలన చేపడతామని ప్రకటించింది. తద్వారా ఆపరేషన్ సిందూర్ 2.0 ప్రారంభం అయ్యే అవకాశం ఉన్న ప్రచారాలు జోరుగా ఉన్నాయి.పాక్ రక్షణ మంత్రి క్వాజా ఆసిఫ్ యుద్ధానికి సిద్ధంగా ఉండాలంటూ పిలుపునిస్తూ వర్ధిల్లుతున్న ఉద్రిక్తతల మధ్య, దేశ భద్రతా శాఖలు అప్రమత్తంగా వ్యవహరించుకుంటున్నాయి. ఆపరేషన్ సిందూర్ 2.0 ఎప్పుడైనా ప్రారంభం కావచ్చని పాకిస్తాన్‌కు అర్థమైంది. ప్రస్తుతం ఆపరేషన్ సిందూర్ హోల్డ్‌లో మాత్రమే ఉంది. 2.0 ప్రారంభిస్తే పాకిస్తాన్ భూమిపై లేకుండా పోతుంది.

# మిలినీయం సిటీగా గుర్గావ్

న్యూఢిల్లీ,, నవంబర్ 22

భారత్ లో మిలీనియం సిటీగా గుర్గాం మారుతోంది. కార్పొరేట్ క్యాపిటల్‌గా మారింది. సైబర్ సిటీ, ఉద్యోగ్ విహార్‌లో 500+ ఫార్చ్యూన్ 500 కంపెనీలు, ఎ ఫర్మ్‌లు, స్టార్టప్‌లు ఫ్లిప్‌కార్ట్, పేటీఎం వంటివి ఉన్నాయి. 2025లో ఉద్యోగాలు 20% పెరిగాయి. ఎకానమిక్ బూస్ట్. హౌసింగ్ బూస్ట్ ను పెంచింది. అందుకే గుర్గాం భారతదేశంలో బిలియనీర్లకు ప్రధాన హాట్‌స్పాట్‌గా మారింది. ఇక్కడి లగ్జరీ రియల్ ఎస్టేట్ బూమ్, ఎ-స్టార్టప్ హబ్ స్థితి, ఢిల్లీకి సమీపత వల్ల హై-నెట్‌వర్త్ ఇండివిజువల్స్, బిలియనీర్లు ఇక్కడే స్థిరపడుతున్నారు.గోల్ఫ్ కోర్స్ రోడ్, ఆఒఈ కామెలియాస్, సెక్టార్ 44, ఆఒఈ సైబర్ సిటీ వంటి ప్రాంతాలు 'ఉత్తర భారతదేశం బిలియనీర్ల రో'గా పేరుపొందాయి ? ముంబై అల్టామౌంట్ రోడ్ లేదా న్యూయార్క్ బిలియనీర్ల రోతో పోల్చుతున్నారు. ఉమో మ్యాపింగ్, రియల్-టైమ్ వాటర్ మానిటరింగ్ వంటి టెక్ ఇనిషియేటివ్‌లు సస్టైనబుల్ డెవలప్‌మెంట్‌ను ప్రోత్సహిస్తున్నాయి. ద్వార్కా ఎక్స్‌ప్రెస్‌వే పూర్తి, రాపిడ్ మెట్రో విస్తరణలు, ఢిల్లీ-జైపూర్ హైవేలు ట్రాఫిక్‌ను 30% తగ్గించాయి. సెక్టార్ 90 వంటి ఏరియాలు, సస్టైనబుల్ డిజైన్‌తో గ్రీన్ స్పేసెస్, సైక్లింగ్ ట్రాక్‌లు మారుతున్నాయి.గురుగ్రామ్, వేగవంతమైన అర్బనైజేషన్‌తో భవిష్యత్ రియల్ ఎస్టేట్ హబ్‌గా మారుతోంది. దానికి తగ్గ మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. ఢిల్లీ నుంచి అతి దగ్గర కావడంతో.. ఎక్కడ మంది అక్కడ స్థిరపడేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. రాబోయే రోజుల్లో ముంబైతో పోటీ పడే అవకాశం ఉంది.

# గ్లోబల్ సిటీగా హైదరాబాద్

హైదరాబాద్, నవంబర్ 22,

ప్రపంచంలోని అత్యుత్తమ నగరాల జాబితా 2025-26 ప్రకారం, లండన్ ఈసారి కూడా ప్రపంచంలోని అత్యుత్తమ నగరాల జాబితాలో అగ్రస్థానంలో ఉంది. ఈ జాబితాలో




న్యూయార్క్ రెండో స్థానంలో ఉంది. వాస్తవానికి, ప్రతి సంవత్సరం ప్రపంచంలోని అత్యుత్తమ నగరాల జాబితాను తయారు చేస్తారు, ఇందులో నివసించడానికి, తిరగడానికి, పని చేయడానికి ఏ నగరం ఉత్తమమో చూస్తారు. ఈ నివేదికను రెజోనెన్స్ కన్సల్టెన్సీ ఉ ఇప్సోస్ తయారు చేసింది. ఇందులో 10 లక్షలకుపైగా జనాభా కలిగిన 270 కంటే ఎక్కువ నగరాలను మూల్యాంకనం చేస్తారు. దీని తరువాత, ప్లేస్ పవర్ స్కోర్ ఆధారంగా, ప్రపంచంలోని అత్యుత్తమ నగరం ఏంటో తెలుస్తుంది. ఒక నగరాన్ని మంచిది లేదా అత్యుత్తమమైనదిగా ప్రకటించడానికి, దానిని అనేక విధాలుగా పరీక్షిస్తారు. ఈ పాయింట్లలో నగర జీవనశైలి, భద్రత, ఉపాధి అవకాశాలు, విద్య, సంస్కృతి, ఆర్థిక బలం, పర్యావరణం వంటివి ఉన్నాయి. ఈ అన్ని అంశాలను కలిపి ఏ నగరం ఇతరులకన్నా ముందుందో నిర్ణయిస్తారు.ఈ పాయింట్లలో, నగరాన్ని జీవించే సామర్థ్యం ఆధారంగా కూడా చూస్తారు. ఈ పారామీటర్‌లో, నగరం రోజువారీ సౌకర్యాలు, పరిశుభ్రత, ట్రాఫిక్, ఆరోగ్య సేవలు, జీవనశైలి ఖర్చు, మౌలిక సదుపాయాలను కూడా చూస్తారు. ఏదైనా నగరం ఈ అన్ని విషయాల్లో మెరుగ్గా ఉంటే, దాని జీవనయోగ్యత స్కోరు కూడా ఎక్కువగా ఉంటుంది. దీనితోపాటు, జీవించే సామర్థ్యం, ఒక నగరంలో సౌకర్యాలు ఉండటం మాత్రమే సరిపోదు. అక్కడ వాతావరణం ఎలా ఉందో కూడా ముఖ్యం. ఈ విభాగంలో సంస్కృతి, వినోదం, సామాజిక వాతావరణం, నైట్‌లైఫ్, ప్రజల సంతృప్తిని చూస్తారు. ఏ నగరాల్లోనైతే శక్తి , సంస్కృతి ఎక్కువగా ఉంటాయో, అవి ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉంటాయి.ఏదైనా నగరం అసలు బలం దాని ఆర్థిక పరిస్థితి ద్వారా గుర్తిస్తారు. ఉపాధి అవకాశాలు, విద్య స్థాయి, స్టార్టప్‌లు, సంస్కృతి, సాంకేతికత, ఆదాయ మార్గాలు అన్నీ దాని శ్రేయస్సులో భాగం. ఆర్థిక అవకాశాలు ఎక్కువగా ఉన్న నగరాలు ప్రపంచవ్యాప్తంగా మరింత ఆకర్షణీయంగా పరిగణిస్తారు.ఇటీవల విడుదలైన ఈ నివేదికలో లండన్ వరుసగా 11 సార్లు ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా నిలిచింది. దీని తరువాత న్యూయార్క్, పారిస్, టోక్యో, మాడ్రిడ్, సింగపూర్, రోమ్, దుబాయ్ వంటి నగరాలు టాప్ 10లో ఉన్నాయి. భారతదేశం నుంచి కేవలం నాలుగు నగరాలు మాత్రమే ఈ నివేదికలో చేరాయి. ఈ భారతీయ నగరాల్లో బెంగళూరు, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ ఉన్నాయి. వీటిలో హైదరాబాద్ 82వ స్థానంలో ఉంటే బెంగళూరు 29వ స్థానంలో ఉంది. ముంబై 40వ ర్యాంకు, ఢిల్లీ 54వ ర్యాంకు సాధించాయి.

# బీజేపీ ట్రాప్ లో రేవంత్

హైదరాబాద్, నవంబర్ 22,



బీజేపీ వేసిన ట్రాప్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పడిపోయినట్లే కనిపిస్తుంది. ఇప్పుడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ను అరెస్ట్ చేస్తే ఒక రకమైన ఇబ్బంది. చేయకుంటే మరొకరకమైన విమర్శలు. ఇలా ఇప్పటి వరకూ నెపాన్ని బీజేపీపైనే నెడుతూ వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ ఒక రకంగా ఝలక్ ఇచ్చినట్లే కనపడుతుంది. స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న సమయంలో కేటీఆర్ ను అరెస్ట్ చేస్తే సింపతీ వర్క్ అవుట్ అయి కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా ఇబ్బందులు తలెత్తే అవకాశముంది. అరెస్ట్ విషయంలో ఏ మాత్రం నాన్చుడు ధోరణితో వ్యవహరించినా బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని బీజేపీ నేతలు విమర్శలు చేసేన్నా ఎన్నికలకు వెళ్లే అవకాశముంది... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విచారణకు గవర్నర్ ఆమోదం తెలిపారు. ఫార్ములా ఈ కారు రేసు కేసులో ఇప్పటికే అవినీతి నిరోధక శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. పలుమార్లు కేటీఆర్ ను విచారించారు. ఫార్ములా ఈ కారు రేసు వ్యవహారంలో 54 కోట్ల రూపాయలు చేతులు మారాయన్న ఆరోపణలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏసీబీ విచారణకు ఆదేశించింది. అయితే ప్రజాప్రతినిధి కావడంతో కేటీఆర్ విచారణకు అనుమతివ్వాలని అవినీతి నిరోధక శాఖ గవర్నర్ ను కోరింది. నేడు గవర్నర్ కేటీఆర్ విచారణకు అనుమతివ్వడంతో కేటీఆర్ ను విచారించిన తర్వాత ఛార్జిషీట్ దాఖలు చేసే అవకాశముంది. ఫార్ములా ఈ కారు రేసులో త్వరలోనే ప్రాసిక్యూషన్ చేయనున్నారు. గవర్నర్ అనుమతి ఇవ్వలేదంటూ పలు మార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. అంటే తప్పిదాన్ని రాజ్ భవన్ పై నెట్టే ప్రయత్నం చేశారు. ఒకరకంగా బీజేపీని కార్నర్ చేసేందుకు ప్రయత్నించారు. గవర్నర్ నుంచి అనుమతి రావడంతో ఏసీబీ ఛార్జిషీట్ దాఖలు చేసి న్యాయస్థానంలో విచారణ చేపట్టాల్సి ఉంది. న్యాయస్థానంలో ఈ కేసును పెట్టి కోర్టు ఆదేశాల మేరకు నడుచుకోవాల్సి ఉంటుంది.తాను జైలుకు వెళ్లడానికి సిద్ధమని కేటీఆర్ ఎప్పటి నుంచో ప్రకటిస్తున్నారు. కానీ జైలుకు పంపితే రాజకీయ కక్ష సాధింపు చర్యగా బీఆర్ఎస్ ప్రజల్లోకి వెళ్లి సానుభూతి పొందే అవకాశముంది. ఈ నేపథ్యంలో గవర్నర్ ఆమోదంతో రేవంత్ ప్రభుత్వం ఒకింత ఇరకాటంలో పడినట్లయిందన్న కామెంట్స్ వినపడుతున్నాయి

=====================

## రామారెడ్డి పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

కామారెడ్డి నవంబర్ 22,

రామారెడ్డి పోలీసు స్టేషన్ ముందు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులపై దాడికి యత్నించిన గ్రామస్తులు ప్రయత్నించారు. ఓ కేసు విషయంలో మద్దికుంట గ్రామానికి చెందిన యువకుడిని అరెస్టు చేయడానికి ఆంధ్ర పోలీసులు వచ్చారు. యువకుడిని అరెస్టు చేయకుండా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఆంధ్ర పోలీసులపై ప్రతిఘటించారు. దాంతో ఆంధ్ర పోలీసులు రామారెడ్డి పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది.

============================

## ఆలయ హుండీలో పాత నోట్లు

సంగారెడ్డి నవంబర్ 22,

కేతకి సంగమేశ్వర ఆలయ హుండీలో రద్దైన పాత కరెన్సీ ప్రత్యక్షం అయ్యాయి. ఆలయ హుండీ లెక్కింపు చేస్తుండగా పాత నోట్లు బయటపడ్డాయి. 3 వెయ్యి రూపాయల నోట్లు, 23 ఐదు వందల రూపాయల నోట్లను ఆలయ సిబ్బంది గుర్తించారు. 85 రోజుల హుండీ ఆదాయం ఆదాయం 33 లక్షల 66 వేల రూపాయలు వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

===============

## డీసీఎం ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ కు స్వల్ప గాయాలు

నల్గొండ నవంబర్ 22,

నల్లగొండ జిల్లా పరిధిలోని నార్కెట్పల్లి ఫ్లైఓవర్ పై హైదరాబాద్ - విజయవాడ జాతి రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఫ్లైఓవర్ మీద బ్రేక్ డౌన్ తో నిలిచిపోయిన డీసీఎం వాహనాన్ని వెనకనుంచి సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ కు స్వల్ప గాయాలు అయ్యాయి. వెంటనే క్షతగాత్రుని సమీపంలోని కామినేని హాస్పిటల్ కి తరలించారు. హైదరాబాద్ నుంచి ప్రయాణికులతో విజయవాడ వెళుతుండగా ఆర్టీసీ బస్సుకు ప్రమాదం జరిగింది. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి హైవేపై ప్రమాదానికి కారణమైన డీసీఎం.. అలాగే ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సును పక్కకు తొలగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మాచర్ల శ్రీనివాసులకు భద్రత

తిరుపతి నవంబర్ 22,

పరకామణి కేసులో రిట్ పిటీషనర్ అభ్యర్థన మేరకు మాచర్ల శ్రీనివాసులకు అలిపిరి పోలీసులు భద్రత కల్పించారు. ఇంటి వద్ద గంట గంటకు రక్షక్, బ్లూకోట్ పోలీసుల నిఘా ఏర్పాటు చేసారు. శ్రీనివాసులు ఇంటికి ఉన్న సి సి కెమెరాలు కమాండ్ కంట్రోల్ కు అనుసంధానం చేసారు. అలిపిరి పోలీసుల బృందం శ్రీనివాసులు ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పింది. ఫోన్ చేయగానే 24/7 స్పందిస్తాం....రక్షణ కల్పిస్తామంటూ అలిపిరి సీఐ రామకిషోర్ భరోసా ఇచ్చారు..

# ఇక తెలంగాణలో ఒడిశా ఫార్ములా

హైదరాబాద్, నవంబర్ 22,

బీహార్ ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ దక్షిణాదిలో ఉన్న తెలంగాణ రాష్ట్రంపై ఫోకస్ పెంచనుంది. దక్షిణాది రాష్ట్రాల్లో బలహీనంగా ఉండటంతో బీజేపీ తెలంగాణను తమ విజయానికి గేట్ వే గా మార్చుకోవాలని పార్టీ కేంద్ర నాయకత్వం నిర్ణయించినట్లు సమాచారం. అందుకోసమే ఇకపై కేంద్ర మంత్రులు తరచూ తెలంగాణలో పర్యటిస్తూ పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. రానున్న కాలంలో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు కూడా మంజూరయ్యే అవకాశాలున్నాయని బీజేపీ సీనియర్ నేత ఒకరు చెప్పడం విశేషం. అంటే ఇక దక్షిణాదిలో కర్ణాటక తర్వాత తెలంగాణను తమ అడ్డాగా చేసుకోవాలని పార్టీ నాయకత్వం భావిస్తుంది. మరో మూడేళ్ల సమయం ఎన్నికలకు ఉండటంతో ఇక నాయకుల పర్యటనలతో తెలంగాణను హోరెత్తించనున్నారు. మొన్నటి పార్లమెంటు ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎనిమిది స్థానాలు రావడంతో ఇక్కడ అధికారంలోకి రావడానికి ఎక్కువ అవకాశాలున్నాయని పార్టీ నాయకత్వం భావిస్తుంది. ఎప్పటి నుంచో తెలంగాణపై బీజేపీ నాయకత్వం నజర్ పెట్టినా మొన్నటి ఎన్నికల్లో కొంత సానుకూల వాతావరణం కనిపించింది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ అత్యధిక అసెంబ్లీ స్థానాలను గతంలో ఎన్నడూ లేని విధంగా కైవసం చేసుకుంది. అయితే ఇక్కడ ఒడిశా ఫార్ములాను బీజేపీ ప్రయోగించే అవకాశాలు లేకపోలేదు. ఒడిశాలోనూ తొలుత అక్కడ కాంగ్రెస్ ను బలహీనపర్చింది. తర్వాత నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతాదళ్ ను ఓడించి ఒడిశా రాష్ట్రాన్ని కైవసం చేసుకుంది. అయితే ఇక్కడ ఆ ఫార్ములా రివర్స్ లో చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే రెండుసార్లు అధికారాన్ని పొందిన ప్రాంతీయ పార్టీ బీఆర్ఎస్ ను తొలుత బలహీనం చేసిన తర్వాత ఇప్పుడు అధికారంలో ఉన్న జాతీయ పార్టీ కాంగ్రెస్ నుంచి అధికారాన్ని వేరు చేయాలన్న నిర్ణయానికి వచ్చింది. దేశంలో కర్ణాటక, తెలంగాణ వంటి పెద్ద రాష్ట్రాలే కాంగ్రెస్ చేతిలో ఉన్నాయి. వాటిని కూడా తమ చేతికి అందుకోవాలన్న ప్రయత్నంలో భాగంగా కర్ణాటకలో ఈసారి తమదే అధికారం అని నమ్ముతున్న బీజేపీ కేంద్ర నాయకత్వం, తెలంగాణలో మాత్రం పార్టీ నాయకత్వంతో పాటు క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి అవసరమైన అన్ని రకాల వ్యూహాలను సిద్ధం చేస్తుంది. ఒంటరిగానే తెలంగాణలో ఒంటిచేత్తో అధికారంలోకి రావడానికి ప్రయత్నాలు ఇప్పటికే ప్రారంభించిందని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

## మరో తుఫాన్.. తెలుగు రాష్ట్రాల్లో అతి భారీ వర్షాలు!

ఉపరితల ఆవర్తన ప్రభావంతో రేపు ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి దక్షిణ బంగాళాఖాతంలోని మధ్య ప్రాంతాల్లో వాయుగుండంగా బలపడే అవకాశముందని వెల్లడించింది.ఆతదుపరి 48 గంటల్లో పశ్చిమవాయువ్య దిశగా ప్రయాణిస్తూ నైరుతి బంగాళాఖాతంలో మరింత బలపడేందుకు అవకాశం ఉందని. ఈనెల 27-29 వరకు (గురు, శుక్ర, శని వారాల్లో) కోస్తా,రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.వరికోతల నేపథ్యంలో రైతులు ముందుగానే వ్యవసాయ పనుల్లో తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. పండిన ధాన్యాన్ని జాగ్రత్త పరుచుకోవాలంది. ప్రజలు సమాచారం,అత్యవసర సహాయం కోసం ఏపీఎస్‌డీఎంఏ లోని కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 112,1070, 18004250101 సంప్రదించాలని విజ్ఞప్తి చేసింది. అటు ఇవాళ ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది.అటు తెలంగాణలో కూడా ఈ నెల 23 నుంచి 25 వరకు వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇవాళ, రేపు పొడి వాతావరణం నెలకొంటుందని, రాబోయే 2 రోజుల్లో పలు చోట్ల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 -3 డిగ్రీలు తక్కువగా ఉంటాయని వెల్లడించింది.

# మూడు దశల్లో పంచాయితీ ఎన్నికలు

హైదరాబాద్, నవంబర్ 22,

తెలంగాణలో పంచాయతీ రాజ్ సంస్థల ఎన్నికలు డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో మూడు దశలుగా జరిగే అవకాశం ఉంది. నోటిఫికేషన్ ఈ నెల 26 లేదా 27న ప్రకటించనున్నారు. పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు ఫ్రీజ్ కావడంతో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. బీసీ రిజర్వేషన్ల వివాదం కారణం ఇప్పటి వరకూ ఆలస్యం అవుతూ వస్తున్నాయి. మొదటి దశ (డిసెంబర్ 11)లో 4,000కు పైగా గ్రామ పంచాయతీలు, 100 ఓటులు కవర్ అవుతాయి. రెండవ దశ (డిసెంబర్ 14)లో మరో 4,000 పంచాయతీలు, మూడవ దశ (డిసెంబర్ 17)లో మిగిలిన 4,769 పంచాయతీల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. మొత్తంగా 12,769 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు 1.67 కోట్ల మంది ఓటర్లు అర్హులు, 1 లక్షకు పైగా అభ్యర్థులు పోటీ పడవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు 2020 అక్టోబర్‌లో జరగాల్సినప్పటికీ, ఆ రిజర్వేషన్ వివాదాలతో ఆలస్యమయ్యాయి. ఆర్టికల్ 243ఇ ప్రకారం ప్రతి 5 సంవత్సరాలకు ఎన్నికలు జరపాల్సినప్పటికీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి మాత్రమే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం పట్టుదల చూపింది. అయితే హైకోర్టు జూన్ 2025లో "సెప్టెంబర్ 30 వరకు పూర్తి చేయాలి" అని ఆదేశించింది. అయితే, ఆ కమిషన్ నివేదికలు, 42% ఆ కోటా వివాదాలు, సెప్టెంబర్ 2025లో ప్రకటించిన పాత షెడ్యూల్ పై హైకోర్టు స్టే ఇచ్చింది. తాజా క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి "గ్రామ పంచాయతీలు మాత్రమే డిసెంబర్‌లో జరుగుతాయి, ఓటులు/జిఖలు కోర్టు తీర్పు తర్వాత" నిర్వహించాలని నిర్ణయించారు. పంచాయతీలకు రావాల్సిన మూడువేలకోట్ల నిధులు ఆగిపోకుండా పాత రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహించాలని అనుకుంటున్నారు. ప్రజాపాలన వారోత్సవాలు తొమ్మిదో తేదీతో పూర్తవుతాయి. ఆ తర్వాత పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరిగేలా షెడ్యూల్ ఖరారు చేయనున్నారు.

మార్చిలోను పూర్తికాకపోతే 4 వేల కోట్ల నష్టం

: తెలంగాణ ప్రభుత్వం రాజకీయ కారణాలతో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోతుండటంతో ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయాయి. ఇప్పటికే గ్రామాల్లో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు ఆలస్యం కావడం వల్ల రాష్ట్ర పంచాయతీ రాజ్ సంస్థలకు రూ.3,000 కోట్లకు పైగా కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు 'ల్యాప్స్' అయ్యే ప్రమాదంలో పడ్డాయి. 2021-26 కాలానికి 15వ ఫైనాన్స్ కమిషన్ కేటాయించిన చేసిన రూ.7,201 కోట్లలో భాగంగా, 2024-25కి రూ.1,514 కోట్లు ఇప్పటికే 'ఫ్రీజ్' అయ్యాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. ప్రజలు ఎన్నుకున్న పాలకవర్గాలు ఉన్న పంచాయతీలకే నిధులు జమ చేస్తారు.

ప్రస్తుతం పంచాయతీల కాలపరిమితి ముగిసి ఏడాదిన్నర దాటిపోయింది. స్పెషలాఫీసర్ల పాలనలోనే ఉన్నాయి. నిధుల సమస్య ఉండటంతో గ్రామీణ అభివృద్ధి ప్రణాళికలు, శానిటేషన్, రోడ్లు, ఇతర పనులన్నీ పెండింగ్‌లో పడ్డాయి. బీసీ రిజర్వేషన్ల సుదీర్ఘంలో స్థానిక ఎన్నికలు చిక్కుకోవడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడుతోంది. చివరికి పాత రిజర్వేషన్లతోనే డిసెంబర్ లో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఏ కారణం చేతనైనా.. ఎన్నికలు నిర్వహించలేకపోతే.. రూ. మూడు వేల కోట్లు ల్యాప్స్ అయిపోతాయి. ఫైనాన్స్ కమిషన్ నిధులు 'ఎలక్టెడ్ బాడీలు' ఉండాలని కండిషన్. దీంతో, రూ.1,000 కోట్లు ఫ్రీజ్ అయ్యాయి. ఫిబ్రవరి 2025లో మరో రూ.1,500 కోట్లు 'హోల్డ్' అయ్యాయి. ఆగస్టు 2025లో మరో రూ.3,000 కోట్లు 'రిస్క్'లో పడ్డాయి. పంచాయతీ సెక్రటరీలు తమ జేబులోంచి బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేస్తూ, స్ట్రీట్ లైట్లు రిపేర్ చేస్తున్నారు. మునుపటి సర్పంచెలకు రూ.700 కోట్లు పెండింగ్ బిల్లులు, సెక్రటరీలకు రూ.383 కోట్లు ? మొత్తం రూ.1,083 కోట్లు పెండింగ్ ఉన్నాయి. రాష్ట్రంలో 12,769 పంచాయతీలు 'స్పెషల్ ఆఫీసర్ల' పాలనలో ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో సుప్రీంకోర్టు ఆదేశాలతో 28 శాతానికి రిజర్వేషన్లు పరిమితం చేసి ఎన్నికలు నిర్వహించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత, 42 శాతం బీసీ కోటా ప్రకటించింది. జీవోలు, ఆర్డినెన్స్ విడుదల చేశారు. కానీ అవేమీ న్యాయపరిశీలనలో నిలబడటం లేదు. మార్చి 2026కల్లా ఎన్నికలు జరగకపోతే, 2025-26కి అలాట్ చేసిన రూ.3,000 కోట్లు ల్యాప్స్ అవుతాయని క్యాబినెట్ తాజాగా ఆందోళన వ్యక్తం చేసింది.

పాత రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించి.. ఎంపీటీసీ, జెడ్పీటీసీలు, మున్సిపాలిటీలు 'పోస్ట్‌పోన్' చేస్తామని చెబుతున్నారు. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో గెలుపు ఊపులో ఎన్నికలు నిర్వహించి ఉంటే కాంగ్రెస్ పార్టీకి కూడా రాజకీయంగా లాభం కలిగి ఉండేది. కానీ బీసీ రిజర్వేషన్ల అంశం తేలిన తర్వాతే ఎన్నికలు నిర్వహిస్తామని పట్టుదలకు పోవడం వల్ల ఎన్నికలు ఆలస్యమవుతూ వస్తున్నాయి. గత ఏడాది నుంచి వచ్చే నెలే ఎన్నికలు అనే ప్రకటనలు కామన్ అయ్యాయి. డిసెంబర్ లో అయినా పూర్తి స్థాయిలో ఎన్నికలు నిర్వహించలేకపోతే.. పంచాయతీలు తీవ్ర ఆర్థిక కష్టాల్లో ఇరుక్కుపోతాయి. అంటే ప్రజలు ఇబ్బంది పడతారు. ఆ ప్రభావం ప్రభుత్వంపై పడుతుంది.

# ఎట్టకేలకు రోడ్డుకు మోక్షం

హైదరాబాద్, నవంబర్ 22, (న్యూస్ పల్స్)

తాండూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న గుంతల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. రహదారులు, భవనాల శాఖ అధికారులు ఈ రోడ్డు మరమ్మతులు, పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. మొత్తం 40 కిలోమీటర్ల పొడవునా పనుల కోసం రూ.48.80 కోట్లు కేటాయించారు. పట్టణంలోని రెండు కిలోమీటర్ల మేర వరద నిలిచే ప్రాంతంలో సిమెంటు రోడ్డును (రూ.5 కోట్లు) నిర్మిస్తున్నారు. మిగిలిన మార్గానికి రూ.43.80 కోట్లతో ప్యాచ్ వర్కులు, పూర్తిస్థాయి తారు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పనులన్నీ రెండు నెలల్లో పూర్తి చేస్తామని తాండూరు ఇన్‌ఛార్జి డీఈఈ శ్రవణ్ కుమార్ తెలిపారు.వికారాబాద్ జిల్లాలోని తాండూరు పట్టణం నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న గుంతలు, గోతులతో వాహనదారులు పడుతున్న కష్టాలకు ఎట్టకేలకు ఉపశమనం లభించింది. రహదారులు, భవనాల శాఖ (ర.భ.శాఖ) అధికారులు ఈ కీలకమైన మార్గానికి మరమ్మతులు, పునర్నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించారు. ముఖ్యంగా.. తాండూరు పట్టణ పరిధిలోని మొదటి రెండు కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా పాడైపోయి, తారు లేచిపోయి.. కేవలం కంకర మాత్రమే మిగిలి ఉండేది. ఈ ప్రాంతంలో గత మూడేళ్లుగా వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు రోడ్డుపైకి చేరడంతో.. రోడ్డు పూర్తిగా గోతులమయంగా మారిపోయింది.దీంతో వందల కొద్దీ వాహనదారులు, వ్యాపారులు, ఉద్యోగులు మరియు విద్యార్థులు ప్రయాణించే ఈ మార్గంలో రాకపోకలు నరకప్రాయంగా మారాయి. అర గంటలో వెళ్లాల్సిన ప్రదేశానికి గంట సమయం పట్టేదని వాహనదారులు వాపోతున్నారు. ఈ తీవ్ర సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ర.భ.శాఖ అధికారులు ఒక ప్రణాళికను రూపొందించారు. తాండూరు ప్రారంభంలో.. వరద నీరు నిలిచే అవకాశం ఉన్న రెండు కిలోమీటర్ల మార్గాన్ని అత్యంత పటిష్టమైన సిమెంటు కాంక్రీటు రోడ్డుగా (సీసీ రోడ్డు) మార్చుతున్నారుఈ పనులకు అంచనా వ్యయం రూ.5 కోట్లుగా నిర్ధారించారు. ఇక పట్టణాన్ని దాటిన తర్వాత హైదరాబాద్ వైపు మిగిలిన 38 కిలోమీటర్ల ప్రధాన రహదారిపై ఏర్పడిన గోతులు, గుంతలను పూడ్చేందుకు.. అలాగే పూర్తిస్థాయిలో తారు రోడ్డును పునర్నిర్మించేందుకు రూ.43.80 కోట్లు కేటాయించారు. ఈ నిధులు మొత్తం రహదారి నాణ్యతను మెరుగుపరచడానికి ఉపయోగపడతాయి. మొత్తంగా ఈ 40 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ, పునరుద్ధరణ కోసం ప్రభుత్వం దాదాపు రూ.48.80 కోట్లు ఖర్చు చేయనుంది. దీంతో హైదరాబాద్ వెళ్లే వారికి ప్రయాణ సమయం భారీగా తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.ఈ పనుల పురోగతిపై తాండూరు ఇన్‌ఛార్జి డీఈఈ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. రోడ్డు మరమ్మతులను వేగవంతం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం చేపట్టిన సిమెంటు రోడ్డు నిర్మాణం పూర్తైన వెంటనే.. హైదరాబాద్ రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చే ప్యాచ్ వర్కులను 20 రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ముఖ్యంగా.. తక్షణమే రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయడమే తమ మొదటి ప్రాధాన్యత అని అన్నారు.ఆ తర్వాత.. రహదారిని పూర్తిస్థాయిలో, నాణ్యతా ప్రమాణాలతో మెరుగుపరచడానికి రెండు నెలల సమయం పడుతుందని డీఈఈ వివరించారు. ఈ మొత్తం పునర్నిర్మాణం పూర్తయితే.. తాండూరు నుంచి హైదరాబాద్‌కు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. ఈ రోడ్డు అభివృద్ధి తాండూరు వాసులకు రాజధానితో మెరుగైన అనుసంధానాన్ని కల్పించి.. స్థానిక వ్యాపారాలకు, రవాణాకు మరింత ఊతం ఇస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## నడి రోడ్డుపై పుట్టినరోజు వేడుకలు

### తణుకులో ఆకతాయిల ఆగడాలు

తణుకు నవంబర్ 22,

తణుకు పట్టణంలో ఆకతాయిలు హద్దులు మీరుతున్నారు. . రద్దీగా ఉండే సమయంలో నడిరోడ్డుపై పుట్టినరోజు వేడుకలు జరుపుతున్నారు. నిన్న మొన్నటి వరకు జాతీయ రహదారిపై ఇలాంటి పుట్టినరోజులు చేసుకుంటూ వాహనదారులను ఇబ్బందులు పెడుతూ ఉండేవారు. ఇప్పుడు ఈ సంస్కృతి సాక్షాత్తు తణుకు పట్టణంలో రద్దీగా ఉండే వెంకటేశ్వర థియేటర్ సెంటర్ ప్రాంతంలో నడిరోడ్డు పైకి చేరింది. శుక్రవారం రాత్రి 8:30 గంటల సమయంలో వెంకటేశ్వర థియేటర్ సెంటర్ వద్ద పుట్టినరోజు వేడుకలు పేరుతో ఆకతాయిలు బాణసంచా కాల్చడంతో వాహనదారులు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బాణాసంచా వలువురు వాహదారులు, పాదచారులపైకి దూసుకు రావడంతో స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు చూస్తూ ఊరుకుంటే ఇలాంటి సంస్కృతి మరింత పెచ్చు మీరుతోందని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు.

# కారు నడిపేదెట్టా...

హైదరాబాద్, నవంబర్ 22,

తెలంగాణలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ కు పట్టు నిలుపుకోవడం ఒక సవాల్ గా మారనుంది. గతంలో మాదిరి అంత సులువు కాదు. ఎందుకంటే రేవంత్ రెడ్డి వ్యూహాలకు ధీటుగా వెళ్లాలంటే కేటీఆర్ నాయకత్వం సరిపోదన్నది పార్టీలో వినిపిస్తున్న టాక్. కేసీఆర్ ఇప్పటికీ ఫాం హౌస్ కే పరిమితమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి ఆయన వస్తారని కూడా ఆశించడం లేదు. అనారోగ్య కారణాలతో పాటు కేసీఆర్ స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి కూడా దూరంగా ఉండే అవకాశాలే ఉన్నాయి. అయితే లోకల్ ఎన్నికలను కూడా బావాబామ్మర్దులే ఎదుర్కొనాల్సి ఉంటుంది. పార్టీ క్యాడర్ తో పాటు అభ్యర్థుల ఎంపిక కూడా వీరే దగ్గరుండి చూసుకుంటారు. కానీ బీఆర్ఎస్ నేతల్లో మొన్నటి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాల తర్వాత కొంత నిరాశ ఏర్పడింది. కేసీఆర్ నాయకత్వం నాడు రెండు సార్లు అధికారంలోకి తెస్తే.. కేటీఆర్ నాయకత్వంలో పార్లమెంటు ఎన్నికలు, ఉప ఎన్నికల్లో ఓటమి చవి చూడాల్సి వచ్చిందన్న భావన కలుగుతుంది. గెలుపు పై ధీమా పెద్దగా లభించడం లేదు. హరీశ్ రావు, కేటీఆర్ లు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు కూడా పెద్దగా జనంలోకి వెళ్లడం లేదు. అంతే కాకుండా క్షేత్రస్థాయిలో క్యాడర్ ను కూడా సిద్ధం చేయడంలో వీరిద్దరు విఫలమవుతున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. కేసీఆర్ నామమాత్రంగానే మారిపోవడంతో పార్టీకి భవిష్యత్ ఉంటుందా? లేదా? అన్న భయం కూడా కార్యకర్తల్లో నెలకొని ఉంది.మరొకవైపు కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత హరీశ్ రావును టార్గెట్ చేస్తుండటం కూడా రాజకీయంగా ఇబ్బందికరంగా మారనుంది. కవిత జిల్లాల పర్యటనలతో పాటు సూటిగా ప్రశ్నలు సంధిస్తున్నారు. బీఆర్ఎస్ లో నాయకత్వంపై ఆమె ఘాటైన విమర్శలు చేస్తున్నారు. ఇప్పుడు అధికార పార్టీ విమర్శలకు సమాధానం చెప్పేకంటే కవిత వే?స్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పుకోవాల్సిన దుస్థితిని బీఆర్ఎస్ నాయకత్వం ఎదుర్కొంటుంది. ఈ నేపథ్యంలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపు కారు పార్టీకి అంత సులువు కాదని అంటున్నారు. స్థానిక నాయకత్వం కొంత యాక్టివ్ గా ఉన్నప్పటికీ రేవంత్ రెడ్డి వ్యూహాల ముందు కేటీఆర్, హరీశ్ రావులు తేలిపోతారేమోనన్న బెంగ పట్టుకుంది.

========================

# బీఆర్ఎస్ ఎందుకు కుప్పకూలింది?.

హైదరాబాద్, నవంబర్ 22,

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ ఎదుర్కొన్న ఓటమి? కేవలం పరాజయం కాదు. గత ఒక దశాబ్దంగా హైదరాబాద్‌లో పర్పుల్ రంగులో మెరుస్తూ వచ్చిన బీఆర్ఎస్‌కు ఇది పెద్ద రాజకీయ హెచ్చరిక. పార్టీ అంచనాలు, క్యాడర్ ఆశలు? ఏదీ నెరవేరలేదు. బీఆర్ఎస్ ఎందుకు గెల్చుకోలేక పోయింది? ఎక్కడ తప్పు జరిగింది?జూబ్లీహిల్స్ ఫలితం బీఆర్ఎస్‌కు పెద్ద జోల్ట్. పార్టీ పాకేజీ కూడా లేకుండా, ప్రణాళిక దూరంగా ఉండగా, కాంగ్రెస్ మాత్రం వ్యూహాత్మకంగా ముందుకు సాగింది. కానీ ఈ ఓటమి ఒక్క కారణంతో రాలేదు. అందులో దాగి ఉన్న ఎన్నో లోతైన రాజకీయ పొరపాట్లు? నాయకత్వానికి అసలు తలనొప్పిగా మారాయి.ప్రచారం మొత్తంలో కేసీఆర్ ఒక్క సభ కూడా చేయలేదు. క్యాడర్‌కు ఇది పెద్ద మైనస్. హరీష్ రావు దూరంగా ఉండాల్సి రావడం కూడా పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసింది. పార్టీ పదేళ్లపాటు అధికారంలో ఉండి ఇంత తేలికగా వ్యవహరించిందన్న విమర్శలు వచ్చాయి.ప్రచారం సమయంలో ఎక్కడికక్కడ గ్రూపులు, వేర్వేరు నేతలు వేరు వేరు కార్యక్రమాల్లో ... బీఆర్ఎస్ నేతల్లో ప్రచారం సమయంలో కనిపించాల్సిన జోష్ కనిపించలేదు. అంతర్గత అసమ్మతి బాగా బయటపడింది. కొంతమంది నాయకులు కాంగ్రెస్ అభ్యర్థికి సహకరించారని వచ్చిన ఆరోపణలు క్యాడర్‌ను మరింత నిరుత్సాహపరిచాయి.ఇది ఓటర్ల మైండ్‌సెట్‌లో నేరుగా ప్రభావం చూపింది.జూబ్లీహిల్స్‌లో ముస్లిం ఓటర్లు కీలకం... ఇది తెలియని విషయం ఏం కాదు. అయితే ప్రచారం చూస్తే ఆ వర్గానికి అనుగుణంగా ప్రత్యేక కార్యక్రమాలు, ప్రతినిధులు, గ్రౌండ్ యాక్టివిటీ ఏది కనబడలేదు. ఫలితం? ఆ వర్గం మొత్తం కాంగ్రెస్ వైపు మొగ్గు చూపింది.ఉపఎన్నికల్లో డోర్–టు–డోర్ ప్రచారం అత్యంత కీలకం. కానీ బీఆర్ఎస్‌కు అనేక ప్రాంతాల్లో బూత్ స్థాయి నాయకులు కనిపించలేదు. ప్రచారం ఈజీగా, నిర్లిప్తంగా సాగింది. కొన్ని కాలనీల్లో ప్రచారం కనిపించలేదన్న వాస్తవం? ఓటర్లను పార్టీ దూరం చేసింది.నియోజకవర్గ అభివృద్ధి గురించి చెప్పాల్సిన సమయంలో? బీఆర్ఎస్ పూర్తిగా హైడ్రా కూల్చివేతల ప్రాపగాండాపైనే నడిచింది. ఇది నేరుగా ప్రజలకు ఎలాంటి సమస్య కలిగించిందన్న అంశం మాత్రం బలంగా కన్విన్స్ చేయలేదు.కేటీఆర్ ప్రసంగాలు కూడా డెవలప్మెంట్ కంటే రేవంత్ రెడ్డి పై అటాక్ మోడ్‌లోనే ఎక్కువగా కనిపించాయి.గోపీనాథ్ మరణం మిస్టరీలా కాంగ్రెస్ ప్రాజెక్ట్ చేయడంలో విజయవంతమైంది. సునీతపై దాడి చివరి రోజులలో మరింత పెరిగింది. ఈ కాంట్రవర్సీలను కౌంటర్ చేయడంలో



బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైంది. మహిళా ఓటర్లను ఇది బాగా ప్రభావితం చేసింది.కేటీఆర్ చివరి రెండు రోజుల వరకూ ప్రచారంలో యాక్టివ్‌గా కనిపించలేదు. ప్రచారం ఉన్నప్పుడు కూడా ఆయనలో కనిపించాల్సిన ఆత్మవిశ్వాసం, ధైర్యం?అవి పాక్షికంగా మాత్రమే కనిపించాయి. పార్టీని ఒంటరిగా మోసిన ఆయనపై ఈ ఓటమి ప్రభావం అత్యధికంగా పడే అవకాశం ఉంది. ఎన్నికల్లో డబ్బు పంపిణీ కీలక పాత్ర పోషిస్తుందని అందరికీ తెలిసిందే. కానీ జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ పంచిందా? పంచలేదా?... ఈ అనుమానం ప్రజల్లో బలంగా వినిపించింది. ఈ గందరగోళం? సానుభూతి ఓటు కూడా కాంగ్రెస్ వైపు వెళ్లేలా చేసింది.మొత్తం మీద ? ఇది ఒక్క ఉపఎన్నిక కాదు, బీఆర్ఎస్‌కు రెడ్ అలర్ట్. ఈ చిన్న ఎన్నిక? పెద్ద రాజకీయ సంకేతాలను ఇచ్చింది. పార్టీ బలం ఎక్కడ ఉంది? బలహీనత ఎక్కడ బయల్పడింది? ఏ నాయకులపై ప్రజలు నమ్మకం కోల్పోయారు? ఈ ప్రశ్నలకు సమాధానం అన్వేషించకపోతే? బీఆర్ఎస్‌కు రాబోయే రోజులు మరింత క్లిష్టమయ్యే అవకాశముంది. జూబ్లీహిల్స్ పరాజయం? బీఆర్ఎస్‌కు సైలెంట్‌గా అనిపించినా? రాజకీయంగా పెద్ద ప్రమాద సంకేతమని విశ్లేషకులు చెబుతున్నారు. పార్టీ వ్యూహం, నాయకత్వం, ప్రచార పద్ధతిపై సమగ్ర సమీక్ష అవసరం ఉందనే అభిప్రాయం బలపడుతోంది.

# ఇన్నర్ రింగ్ రోడ్డుకు నిధులు మంజూరు

హైదరాబాద్, నవంబర్ 22,

తెలంగాణ అభివృద్ధికి కీలకమైన రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగం పనులు వేగవంతం కానున్నాయి. కేంద్రం అనుమతితో డిసెంబర్‌లో ఉత్తర భాగం కోసం టెండర్లు పిలవనున్నారు. సంగారెడ్డి నుంచి రాయగిరి వరకు 161.5 కి.మీ. ఈ రహదారిని ముందుగా నాలుగు లేన్లు అనుకున్నారు. కానీ ఇప్పుడు 6 లేన్లుగా విస్తరించనున్నారు. దీని అంచనా వ్యయం రూ.15,627 కోట్లకు చేరింది. త్వరలోనే ఈ రహదారి నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయంటున్నారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించనున్న రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) పనులకు సంబంధించి కీలకమైన అప్‌డేట్ వచ్చింది. ఆర్ఆర్ఆర్ పనులును ఉత్తర, దక్షిణ అంటూ రెండు భాగాలుగా విభజించిన సంగతి తెలిసిందే. వీటిల్లో ముందుగా ఉత్తర భాగం పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనుల్లో వేగం పెంచేందుకు నిర్ణయం తీసుకుంది. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులకు కేంద్రం నుంచి అనుమతి రావడంతో.. టెండర్లను ఆహ్వానించేందుకు ఎన్‌హెచ్ఏఐ ఇంజినీర్లు రెడీ అవుతున్నారు. డిసెంబర్, 2025లో ఈ టెండర్లు పిలవనున్నారు.ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం.. సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ గ్రామం నుంచి యాదాద్రి జిల్లాలో ఉన్న రాయగిరి వరకు ఉంది. అయితే తాజాగా తెలంగాణ ప్రభుత్వం ఆర్ఆర్ఆర్ రహదారి నిర్మాణాన్ని 4 లేన్ల నుంచి ఆరు లేన్లకు మారుస్తూ నిర్ణయం తీసుకోవడమే కాక ఆమోద ముద్ర కూడా వేసింది. దీంతో ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం అంచనా వ్యయం భారీగా పెరిగింది. దీని ప్రకారం.. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో నిర్మించబోయే 161.5 కిలో మీటర్ల ఆరు లేన్ల రోడ్డు నిర్మాణం ఖర్చు ఇప్పుడు రూ.15,627 కోట్లకు చేరింది. డిసెంబర్‌లో టెండర్లు ఆహ్వానించేందుకు అధికారులు రెడీ అవుతున్నారు. అయితే గతంలో ఈపీసీ పద్ధతిలో టెండర్లు పిలవగా.. ఇప్పుడు హ్యామ్ మోడల్‌లో పనులు చేయనున్నారు.ఆర్ఆర్ఆర్ మొత్తం పొడవు 343.5 కిలోమీటర్లు. దీని కోసం రూ.36 వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. అలానే ఈ రహదారి నిర్మాణాన్ని 2 భాగాలుగా విభజించారు. ఉత్తర భాగం 161.5 కిమీ కాగా దక్షిణ భాగం 182 కిలోమీటర్లుగా నిర్ణయించారు. ముందుగా ఉత్తర భాగం పనులు పూర్తి చేయాలని నిర్ణయించడమే కాక.. డీపీఆర్ కూడా సిద్ధం చేశారు. అయితే ముందుగా 4 లేన్లతో ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం చేపట్టాలని భావించారు. ఇందుకు మొత్తం రూ.7,104.06 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేయడమే కాక గతేడాది అనగా 2024 డిసెంబర్లోనే టెండర్లు పిలిచారు.అయితే నగరంలో పెరుగుతున్న వాహన రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్ఆర్ఆర్ రోడ్డును ఆరు లేన్లుగా మార్చుతూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో నిర్మాణ వ్యయం కూడా భారీగా పెరిగింది. పెరిగిన అంచనాల ప్రకారం ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం రోడ్డు నిర్మాణానికి రూ.15,627 ఖర్చు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం తెలిపాయి.

# తగ్గిన భూముల ధరలు...

## కొనేందుకు 'నో' చెబుతున్న రియల్టర్లు..

నిజామాబాద్, నవంబర్ 22

కామారెడ్డి జిల్లాలో 'భూమ్' దందా ఒక్కసారిగా విలవిలా పడింది. ఏడాది క్రితం అత్యధిక ధరలతో అమ్ముడుపోయిన భూముల అమాంతంగా పడిపోవడంతో రియల్ వ్యాపారులు ఆర్థికంగా చతికిలబడ్డారు. మధ్యవర్తితంగా కొనుగోలు చేసిన భూములు అమ్ముడుపోకపోవడంతో తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఏడాది క్రితం కోట్ల లోపలికిన భూముల ధర ప్రస్తుతం 40 శాతానికి తగ్గిపోవడంతో అనుకోవాలంటే అసలుకే నష్టం వస్తుందన్న ఆందోళన కలుగుతోంది.వ్యవసాయ భూములే కాకుండా ప్లాట్ల ధరలు కూడా తగ్గుముఖం పట్టడంతో రియల్ వ్యాపారులు తమ దందాను మూసుకునే పరిస్థితి ఏర్పడింది. మరి కొందరు వ్యాపారులైతే వడ్డీలు కట్టలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో జోరుగా సాగిన భూమ్ దందాతో ఆర్థికంగా బాగా స్థిరపడ్డ వ్యాపారులు తాజా పరిస్థితులతో కూడబెట్టుకున్న సొమ్మును వదులు కునే దుస్థితి ఏర్పడింది.టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు భూముల ధరలు అమాంతంగా ఆకాశానంటాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూముల ధరలపై తీవ్ర ప్రభావం పడింది. ధరలు తగ్గుముఖం పట్టడంతో భూములు ప్లాట్లు అమ్ముకునేవారు ముందుకు రాకపోవడంతో రియల్ వ్యాపారానికి బ్రేక్ పడింది.కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు బాన్సువాడ ఎల్లారెడ్డి పిట్లం బీర్కూర్ మదనూర్ జుక్కల్ ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఎకరం భూమి కోటి రూపాయలకు పైగా ధర పలుకుతుంది. ప్లాట్ల ధరలైతే గజానికి పదివేల నుండి 25 వేల రూపాయల వరకు ధర పలుకుతుంది. రోడ్ సైడ్ ప్లాట్ లకు ధర ఊహించే విధంగా పెంచేస్తున్నారు. పట్టణాలు మండల కేంద్రాలు దినదినాభివృద్ధి చెందడంతో స్థలం ధరలు కూడా అడ్డగోలుగా పెరుగుతూ వస్తున్నాయి.ఆర్థికంగా పరిపుష్టి ఉంటే తప్ప



వ్యవసాయ భూములు, ప్లాట్లు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. మరికొన్ని చోట్ల గతంలో ఉన్న ధరలు ప్రస్తుతం కనిపించడం లేదు. ఒక్కసారిగా భూముల ధరలు పడిపోవడంతో అక్కడి వాసులు జాగల నమ్ముకోవాలంటేనే వెనుకడుగు వేస్తున్నారు. పట్టణాల వైశాల్యం పెరుగుతుం డడం సమీప గ్రామాలను పట్టణంలో చేర్చడంతో జాగా ధర లక్షల నుండి కోట్లలోకి పెరిగి పోయింది. జిల్లాలో ఎల్లారెడ్డి బాన్సువాడ మున్సిపాలిటీగా మారడంతో భూముల ధరలపై ప్రభావం పడింది.ఫలితంగా భూముల అమ్మకాలు కొనుగోలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. పదిమంది కలిసి రియల్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టేవారు. భూములను ప్లాట్లను కొనుగోలు చేసేటప్పుడు నామమాత్రంగా అడ్వాన్సులు చెల్లించి అట్టి వాటిని అధిక ధరలకు అమ్ముకొని సొమ్ము చేసుకునేవారు. వచ్చిన లాభాన్ని పదిమంది సమానంగా పంచుకునే పరిస్థితి ఉండేది. దీంతో రియల్ వ్యాపారం కొంతకాలం వరకు దండిగా నడిచింది. భూముల ధరలు ఆకాశాన్ని అంటడంతో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న కొనుగోలు చేసేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో మిన్నుకుండు పోవాల్సి వస్తుంది.రియల్ దందాకు అడ్డు కట్టబడడంతో వ్యాపారాన్ని మానుకొని పరిస్థితి నెలకొందని పలువురు రియల్ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. పలుచోట్ల కొనుగోలు చేసిన భూములు ప్లాట్లు కూడా అమ్ముడుపోకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు తడిసీమొపై రియల్ వ్యాపారులు ముఖం చాటిసి పరిస్థితి కూడా నెలకొంది. మరికొందరైతే ఈ దందాలో ఇరుక్కుపోయి అరసత్వంగా వచ్చిన భూములు జాగాలను కూడా అమ్ముకొని అప్పులు కట్టే పరిస్థితి కూడా దాపరించింది.రియల్ వ్యాపారం కుదరవడంతో రిజిస్ట్రేషన్లు సైతం తగు ముఖం పట్టాయి. భూముల కొనుగోలు అమ్మకాలు లేకపోవడంతో రియల్ వ్యాపారులతో సందడిగా కనిపించే రిజిస్ట్రేషన్ ఆఫీసులు వేలవేల బోతున్నాయి. రియల్ వ్యాపారం జోరుగా సాగే రోజుల్లో కార్యాలయాలు కిక్కిరిసి కనిపించేవి. రిజిస్ట్రేషన్‌ల కోసం క్రయవిక్రియ దారులు కార్యాలయాల ముందు పడిగాపులు కాచి స్థితి ఉండేది. ప్రస్తుతం భూము లు ధరల ప్రభావం పడడంతో సామాన్యులు కొనుగోలు చేసేందుకు జంకుతుండడంతో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు బిజీ తగ్గింది.జరుగుతున్న క్రయవిక్రయాలకు కొన్ని మాత్రవే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఇంతకుముందు 50 కి పైగా రిజిస్ట్రేషన్లు జరిగేవని, పది రిజిస్ట్రేషన్లు జరగాలంటేనే కష్టంగా ఉన్నట్లు వాపోతున్నారు. డాక్యుమెంటరీ ఫీజు, రిజిస్ట్రేషన్ ఫీజు తో కలిపి భారీగానే సొమ్ము సమకూరేది. అత్యధికంగా రెవిన్యూ అందించే శాఖ కార్యకలాపాలు తగ్గుముఖం పట్టడంతో ప్రభుత్వానికి, భారీగానే గండి పడుతుంది.

# లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధుల పై రివ్యూ మీటింగ్:

కడప, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 22:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అమరావతి ఆదేశానుసారంగా డాక్టర్ సి.యామిని, చైర్మన్-కం-జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప మరియు ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి చాంబర్ నందు "లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు పై రివ్యూ మీటింగ్" నిర్వహించడం జరిగినది.

ఈ సందర్భంగా మాట్లాడుతూ "లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు, చట్టపరమైన సలహాలు, జైలు విజిట్లు, కేసుల వివరాలు మరియు పరిష్కారము మొదలగు అంశాలను చర్చించారు, తగు సూచనలు ఇవ్వడం జరిగినది.

ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్.హరిబాబు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లు శ్రీమతి ఎమ్.శాంత, ఎం.వినయ్ కుమార్, శ్రీమతి ఎం.చంద్రకాంతమ్మ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్లు పి.మనోహర్, శ్రీమతి ఎం సౌజన్య, ఎన్. నీలకంఠేశ్వర రెడ్డి, షేక్ అక్బర్ అలీ, ఎస్.రవితేజ, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేయాలి: అంబాల అనిల్ కుమార్

హనుమకొండ, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 22:


వి సి కె పార్టీ యూత్ విభాగం అంబాల అనిల్ కుమార్ హనుమకొండ జిల్లాలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో గ శ్ర హనుమకొండ జిల్లా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలసి ప్రభుత్వ జూనియర్ కాలేజ్ విద్యార్థులు తినడానికి మధ్యాహ్న భోజనం లేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థులు పడుతున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోవడం జరిగింది: విద్యార్థుల సమస్యలు విన్న ఎమ్మెల్యే రాబోయే రోజుల్లో విద్యార్థుల సమస్యలు తీరుస్తామని ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. తప్పకుండా విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ జూనియర్ కాలేజ్ విద్యార్థుల సమస్యలను విని స్పందించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కి వి సి కె పార్టీ యూత్ విభాగం తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబాల అనిల్ కుమార్ తో పాటు పాటు విద్యార్థి నాయకులు కనకం రిషి, మహమ్మద్, అప్రోచ్ గణేష్, రాకేష్, రామ్ చరణ్,తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.



# హిట్ అండ్ రన్ కేసు లలో పరిహారము చెల్లింపు అంశాలపై డిస్టిక్ లెవెల్ అధికారుల మానిటరింగ్ మీటింగ్":

కడప, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 22:

డాక్టర్ సి.యామిని, చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప సూచనల



మేరకు సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ కడప కోర్టు కాంపౌండ్ లో గల న్యాయ సేవా సదన్ నందు "హిట్ అండ్ రన్ కేసుల లో పరిహారము చెల్లింపు మొదలగు అంశాలపై డిస్టిక్ లెవెల్ అధికారుల మానిటరింగ్ మీటింగ్" వర్చువల్ పద్ధతిలో నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెట్టండని కేసుల వివరాలు మరియు కాంపెన్సేషన్ మొదల అంశాలపై చర్చించడం జరిగినది, తగు సూచనలు ఇవ్వడం జరిగినది.ఈ కార్యక్రమంలో కడప మరియు రాయచోటి సబ్ డివిజనల్ పోలీస్ అధికారులు, కడప మరియు రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

# లబోతారంలో 'దారం'కు ఘన సన్మానం

కరీంనగర్, నవంబర్, 22(భారతశక్తి ప్రతినిధి):సృష్టిలో స్నేహానికి మించింది లేదని, తమ ఆప్తమిత్రుడు దారం జగన్నాథ రెడ్డికి జర్నలిస్టు సమాజానికి సేవ చేసే అవకాశం రావడం తాము గర్వించే అంశమని కరీంనగర్ రూరల్ మండలం ఎలబోతారం గ్రామంలోని శ్రీ కృష్ణ దేవాలయం కమిటి ఛైర్మన్ కరివేద వేణుమాధవ రెడ్డి అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం ఎలాబోతారం గ్రామంలోనీ మిత్రమండలి ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా (బిఎంఎస్ ) జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన దారం జగన్నాథరెడ్డిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసి చల్ల లింగారెడ్డి, గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షులు ఒలం సుధాకర్ రెడ్డి, బిజెపి జిల్లా నాయకులు వేల్పుల శ్రీనివాస్, గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షులు బొద్దుల వెంకటేశం, చొప్పదండి మండల పంచాయితి రాజ్ ఎఇ పైడి సతీష్, గ్రామ శక్తి కేంద్రం ఇంచార్జి మల్లెత్తుల దేవేందర్, బీజేపీ జిల్లా నాయకులు పున్నం కిరణ్ , బద్ధం శ్యామ్ సుందర్ రెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గాండ్ల గోపాల్, 78 బూత్ అధ్యక్షుడు ఆడెపు శ్రీకాంత్, కరీంనగర్



మండల సోషల్ మీడియా ఇంజార్జి చల్ల సాయికృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు పైడి మల్లేశం ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. భవిష్యత్తులో జగన్నాథరెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# సంగారెడ్డి చేరుకున్న అయ్యప్ప స్వాములు

## సాహితీ రాము స్వామి బృందానికి స్వాగతం పలికిన భక్తులు

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 22:సంగారెడ్డి పట్టణంలోని అయ్యప్ప స్వాములు 46 రోజుల దీక్షా పథంలో సాగిన పాదయాత్రను పూర్తి చేసుకున్న 29 మంది అయ్యప్ప స్వాములు పట్టణానికి చేరుకున్నారు.. సాహితి రాము గురుస్వామి ఆధ్వర్యంలో ఈ బృందం 18వ సారి మాల ధరించగా, మూడవసారి పాదయాత్ర చేపట్టడం విశేషం.పోతిరెడ్డిపల్లి హనుమాన్ మందిర్ నుండి పాత బస్టాండ్ హనుమాన్ మందిరం వరకు భక్తి ఊరేగింపుగా వచ్చిన సందర్భంగా పట్టణం అంతా భక్తి శోభతో కదిలింది. డోలు, హారతులతో స్వాములను భక్తులు స్వాగతం పలికారు.అయ్యప్ప స్వామి దయ, కృప వల్లనే ఈ పాదయాత్ర విజయవంతమైంది. ప్రతి అడుగుకూ అయ్యప్ప ఆశీర్వాదం తోడైంది, అని గురుస్వామి సాహితి రామ తెలిపారు.స్వాములు పట్టణానికి చేరుకోవడంతో వారి బంధువులు,




మిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై స్వాముల ఆశీస్సులు తీసుకుని ఆనందం వ్యక్తం చేశారు.

# 'మన శ్వాస తెలుగు భాష..... మన మాతృభాషను మనం కాపాడుదాం

"తెలుగు ధనమే మనకు ధనమని

తెలుగు భాష చరిత్ర ఘనమని

మాతృభాషను ప్రేమించుమని

పరభాషలను గౌరవించుమని".... ఎందరో పెద్దలు, ఎన్నో సందర్భాల్లో మనకు తెలియపరిచారు. అయిన కూడా మనకు పరభాషపట్ల వ్యామోహం తగ్గడం లేదు. మాతృభాష అయిన తెలుగు తో పాటు ఎన్ని భాషాలైన నేర్చుకోవచ్చు.కానీ నేడు తెలుగు సరిగా రాయడం,చదవడం రాకుండా లేదా నేర్చుకోకుండా పరభాషకై పరుగుల పెట్టడం బాగాలేదు. విశ్వవ్యాప్తంగా మన మాతృభాష అయిన తెలుగు కు మంచి గుర్తింపు ఉంది. చరిత్రను పరిశీలిస్తే మన భాష సౌందర్యం ను ప్రాచీన,ఆధునిక కవులు ఎంతగానో వర్ణించారు. శ్రీకృష్ణదేవరాయల సూక్తి అయిన "దేశభాషలందు తెలుగులెస్స" నుండి డాక్టర్ సినారె మాటలైన "ఆత్మలను పలికించేదే అసలైన భాష,ఆ విలువ కరువైపోతే అది కంఠ శోష" అన్నంత వరకు ఎప్పుడు చూసినా మాతృభాష మాధుర్యం గురించి ప్రస్తావనాలు చాలానే ఉన్నాయి. మాతృభాష అనేది సహజంగా అలవడుతుంది. అప్రయత్నంగా, సహజంగా వచ్చేది మాతృబాష. ఏ బాషను శిశువు అసంకల్పితంగామాట్లాడతాడో, ఆ బాషనే మాతృబాష అంటారు.

తెలుగు కవి గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఆగస్టు 29ని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటారు.ఈ రోజున ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో తెలుగు భాష అభ్యున్నతే లక్ష్యంగా వివిధ రకాల కార్య క్రమాలను నిర్వహిస్తారు. భారతదేశంలో అత్యధికంగా మాట్లాడే నాల్గవ భాష తెలుగు. 2011 జనాభా లెక్కల ప్రకారం దాదాపు 8.11 కోట్ల మంది తెలుగు మాతృభాషగా ఉన్నారు.తెలుగును "ది ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని పిలుచుటకు కారణం 16వ శతాబ్దపు ఇటాలియన్ యాత్రికుడు నికోల్ డి కాంటి ఇటాలియన్ భాష వలె తెలుగు భాష కూడా అచ్చులతో ముగుస్తుందని నిరూపించడం వల్ల ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ గా పిలువబడుతుంది. ఇంటర్నేషనల్ ఆల్ఫాబెట్ అసోసియేషన్ 2012లో తెలుగు భాష యొక్క లిపిని ప్రపంచంలోనే 2వ ఉత్తమమైనదిగా ఎంచుకుంది.

మనిషి జీవితంలో మొదట నేర్చుకునే భాష మాతృభాష. తల్లి ఒళ్ళో చిన్నారి మాట్లాడే భాషే మాతృభాష.మాతృభాష సహజంగా వినడం వల్ల,అప్రయత్నంగా వస్తుంది. అమ్మ మాటే మాతృభాష.అవసరాల కోసం ఇతర భాషలను నేర్చుకోవడంలో తప్పులేదు. నేర్చుకోవాలి కూడా.అయితే వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా చూసుకోవాలి. మాతృభాషను పరిరక్షించుకోవాలి. ఈ కర్తవ్యాన్ని గుర్తుచేసేందుకే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారు.ప్రపంచంలో చిన్న, పెద్ద భాషలన్నిటినీ రక్షించుకోవాలని, భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మనం జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలమని యునెస్కో చెబుతోంది. కానీ నేడు ఎక్కడ చూసినా పరబాష పట్ల ఉన్న ఆశక్తి మాతృభాషపై ఉండడం లేదు.తల్లిదండ్రులు, చుట్టూ ఉన్న సమాజం కూడా మాతృభాష పట్ల అశ్రద్ధ చేయడం వల్ల మాతృభాషలు అంతరించి పోనున్నాయి. బహుభాషలు నేర్చుకోవడం వల్ల ప్రాపంచిక విషయాల పట్ల సులభంగా అవగాహన కలిగి, విశాల దృష్టిని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తుందని సాహిత్యాభిలాషులు, విజ్ఞాన వేత్తలు ఎన్నో మార్లు ప్రకటించారు.అయితే మాతృభాషను కాపాడుకుంటూనే దాని ద్వారానే తక్కిన భాషల్ని నేర్చుకోవడం, అనంత విజ్ఞానాన్ని పొందడం సరైన మార్గం అని యునెస్కో వెల్లడించింది.

తెలుగు భాషను కాపాడుకోవడం మనందరి కర్తవ్యం'దేశ భాషలందు తెలుగు లెస్స' అని అన్నారు శ్రీకృష్ణదేవరాయలు. తెలుగు భాషలోని మాధుర్యం, గొప్పతనం ఇక ఏ భాషలోనూ లేదని చాలా మంది కవులు చెప్పారు. నేటి ప్రపంచంలో రకరకాలైన పనుల కోసం ఒక దేశం నుండి మరొక దేశానికి వెళ్లడం సాధారణమైపోయింది. అందు వల్ల ఇంగ్లిష్ అంతర్జాతీయ భాషగా ఆమోదం పొంది అందరికి తప్పనిసరి అయినవి.ప్రస్తుత జీవన విధానములో ఆంగ్లము నేర్చుకోవడం అవసరమే కానీ అదే జీవితంగా ఉండకూడదు.

మన భాషా సాహిత్య సౌందర్యాన్ని అవగాహన చేసుకోవడం, మన భాషను, సంస్కృతినీ కాపాడుకోవడం, భావి తరాలవారికి దీన్ని అందించడం మన బాధ్యతగా ఎంచుకొని మన తర్వాత తరాలకు అందించడానికి ప్రతిఒక్కరు కృషిచేయాలి. అందుకుగాను ప్రథమంగా కావలసింది మాతృభాషాభిమానం. తెలుగు భాష పట్ల పూర్తి అంకిత భావం ఉండి, బాషాభిమానం పెంపొందించుకొని, దాని మూలాలను తరతరాల కు అందించే ఉమ్మడి ఆస్తిగా భావించి అభివృద్ధి పరచాలి. మన మాతృభాష అభిమానాన్ని ఆచరణలో చూపాలి లేనిచో దేశ భాషలందు తెలుగు లెస్ (తక్కువ) అయిపోతుంది. కాబట్టి తెలుగు వారందరు తమ మాతృభాష అయిన తెలుగు పట్ల శ్రద్ధ వహించ వలసిన అవసరం ఎంతైనా ఉంది. మన తెలుగు కవులెందరో తెలుగు భాష గొప్పతనమును తమ కవిత్వము ద్వారా చూపించారు. విదేశీయులు కూడా మన తెలుగు భాషను "ఇటాలియన్ ఆఫ్ ధ ఈస్ట్" గా వర్ణించారంటే అంతటి గొప్ప భాష మనది.

మన మాతృభాష మరికొన్నాళ్లు బ్రతకాలంటే ప్రభుత్వం నుండి పూర్తి మద్దతు అవసరం.

సామాన్యుడికి తెలిసిన తెలుగుభాషలో ప్రభుత్వ వ్యవహారాలు అన్నీ జరిగేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలి. ప్రభుత్వఉత్తర్వులు, చట్టాలు తెలుగులోనే ఉండాలి. అప్పుడు మాత్రమే తెలుగు నిజమైన అధికార భాష అవుతుంది.మనం మన భాషలో తెలుసుకోగలిగితే సులభంగా అర్థం అవుతుంది.కేవలం ఇంగ్లీషులో మాత్రమే ఉన్న పుస్తకాలను తెలుగులోకి అనువదించి ప్రజలకు అందుబాటులోకి తేవాలి. దినపత్రికల వారు ప్రత్యేక శ్రద్ధ పెట్టడం వల్ల సులభంగా మాతృభాషను కాపాడుకోగలుగుతాము.నేడు ఏ పత్రిక తిరిగేసిన ఇంగ్లీష్ పదాలను తెలుగులో రాస్తున్నారు.ఈ విధానాన్ని మార్చి,వీలైనంత వరకు తెలుగు పదాలకు ప్రాముఖ్యతనిస్తే భాషను కాపాడిన వారవుతారు.

"తెలుగెక్కడుందిరా తెలుగోడా

నీ తెలుగు తెల్లారే తెలుగోడా" అనే మాటను అబద్ధం చేస్తూ తెలుగు భాష కొరకు

మనవంతుగా కృషిచేద్దాం,

మన తెలుగును కాపాడుకుందాం...

గడప రఘుపతిరావు

రాష్ట్రఉత్తమఉపాధ్యాయ అవార్డు గ్రహీత.

9963499282

raghupatiraog@gmail.com

# భూములను అక్రమంగా రిజిస్ట్రేసన్ చేసుకున్నారు చావే శరణ్యం

వికారాబాద్ భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 22:౹

వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల అంతారం రైతులు మాడిగేషన్ పేరుతో భూములు కజెషనా వ్యక్తులపై చర్య తీసుకోవాలని తెలంగాణ డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసారు.కమంగా తమ భూములు కాజేసిన రియల్ ఎస్టేట్ బ్రోకర్ల చెర నుండి తమను కాపాడాలని,.మా భూములు మాకు ఇప్పించాలంటూ భూములు మాకు రిజిస్ట్రేషన్ చేయకపోతే చావే శరణ్యమంటున్నన్నారు.తమ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చట్ట రిత్యా చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్ చేశారు.మార్టిగేజ్ పేరుతో 2024 నవంబర్ లో రైతుల నుండి భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న బ్రోకర్లు,మార్టిగేజ్ చేసిన డబ్బులు ఇవ్వమంటే మొహం చాటేసారని రైతులు తెలిపారు.ఈ క్రమంలో తాము చేసింది మార్టిగేజ్ కాదని... తమను మాయ మాటలతో మోసం చేసిన చెల్లని చెక్కులు ఇచ్చి సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు ఆలస్యంగా తెలుసుకున్నామని రైతులు వాపోయారు.రంగారెడ్డి జిల్లాకు చెందిన , నిఖిల్ రెడ్డి రామ్ నాయక్ మనోజ్ అనే వ్యక్తులు మార్టిగేజ్ చేసుకొని డబ్బులు ఇస్తామని మోసం చేసి దేవి రెడ్డి రత్నమ్మ పేరిట సేల్ డీడ్ చేశారని కుల్కచర్ల తహశీల్దార్ కు,పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు చేసిన ఆరు నెలలకు అసలు నిందులను కాకుండా మధ్యవర్తులను పోలీసులు రిమాండ్ చేశారంటూ రైతుల ఆరోపణ చేశారని....తమ పై రాజకీయ ఒత్తిడి ఉందని పోలీసులు చేతులెత్తేస్తున్నారని షాద్నగర్ పట్టణం చెందిన మహిపాల్ రెడ్డి తెలంగాణ డిజిపి మాకు తెలుసు వాళ్ళు ఉన్నారని మీరు ఏమి చేయగలరని బెదిరిస్తున్నారు అదే విషయం డిజి గారికి దృష్టిలో వేయాలని మాకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయడానికి వచ్చామురైతులు .అసలు నిందితులను పట్టుకొని తమ భూమి తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలని కోరుతున్నారు.

# చింతల్ బజార్ లో ఎమ్మెల్యే శ్రీగణేష్ పర్యటన

సికింద్రాబాద్. భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 22:౹

కంటోన్మెంట్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కాలనీల పర్యటనలో ఎమ్మెల్యే శ్రీగణేష్ నేడు బొల్లారం (వార్డు 8) లోని చింతల్ బజార్ వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ,స్నేహ కాలనీలలో కాలనీ వాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు .ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని డ్రైనేజీ, అంతర్గత రహదారులు, పార్కులను అభివృద్ధి చేయవలసిన ఆవశ్యకతను ఈ సందర్భంగా కాలనీలవాసులు ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే శ్రీ గణేష్ కాలనీలలో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను స్వయంగా పరిశీలించారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ, అంతర్గత రహదారులను ఎన్నో ఏళ్ల నుంచి పట్టించుకోకపోవడంతో పెరిగిన జనాభాకు అనుగుణంగా వాటిని అభివృద్ధి చేయకపోవడంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, వాటిని మార్చవలసిన అవసరం ఉందని చెప్పారు. స్నేహ కాలనీలోని పార్కును నియోజకవర్గంలో మోడల్ పార్కుగా అభివృద్ధి చేస్తానని,పార్కులో వాకింగ్ ట్రాక్, బాస్కెట్ బాల్ కోర్ట్, యోగా సెంటర్ ఏర్పాటు చేస్తానని, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసమే కాలనీల పర్యటన చేపట్టానని కాలనీలలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని, సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గానికి అభివృద్ధి కోసం ఎన్ని నిధులైన ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని, ఆ నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. తమ అవసరాలను గుర్తించి త్వరితగతిన వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామినివ్వడంతో కాలనీల వాసులు ఎమ్మెల్యే శ్రీగణేష్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# గండికోట పర్యాటక అభివృద్ధికి మాస్టర్ ప్లాన్: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

## -సాస్కి పథకం ద్వారా అమలు కానున్న ప్రాజెక్టుపై సమీక్ష




కడప, నవంబర్ 22 (భారత శక్తి): సాస్కి పథకం ద్వారా గండికోట పర్యాటక కేంద్రానికి ప్రపంచ స్థాయిలో కీర్తిని ప్రతిబింబించేలా మాస్టర్ ప్లాన్ రూపొందించి అభివృద్ధి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.

శనివారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ గాలులో గండికోట పర్యాటక అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, జిల్లా పర్యాటక శాఖ, ఏపిటిడిసి అధికారులు, కాంట్రాక్టు ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గండికోట ప్రాంతాన్ని పర్యాటక హబ్ గా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రాల్లో క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్ కోసం ప్రత్యేక సహకారం అందించే పథకం ద్వారా.. గండికోట పర్యాటక కేంద్రంలో సుసంపన్నమైన కోట మరియు గార్జ్ అనుభవాన్ని పర్యాటకుల సొంతం చేసే దిశగా.. జిల్లా యంత్రాంగం పర్యాటక శాఖ ద్వారా అభివృద్ధి పనులకు నాంది పలికిందన్నారు.

జనవరి నెలలో గండికోట ఉత్సవాల నిర్వహణకు మునుపే పూర్తికావాల్సిన ఎంట్రన్స్, వెలివేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎపిటిడిసి ఇంజనీర్లు, ప్రాజెక్ట్ కన్సల్టెంట్ లను ఆదేశించారు. ఈ సందర్భంగా గండికోట పర్యాటక కేంద్రం అభివృద్ధి పథకంలో భగంగా చేపట్టే అన్ని రకాల పనులకు సంబంధించి మ్యాపులను, డిజైన్లను పరిశీలించి పలు సూచనలు, సలహాలను.అందించారు. పనుల నాణ్యతతో ఎలాంటి రాజీ లేకుండా.. అన్ని రకాల పర్యటన ప్రాజెక్టులను చేపట్టాలని ఆదేశించారు. అత్యంత ప్రధాన్యతో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులపై ప్రతివారం పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఏపీ టూరిజం కార్పోరేషన్ తో ఏపీలో అమలు చేస్తున్న టూరిజం పాలసీలో భాగంగా పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా కల్పిస్తున్నామన్నారు. గండికోట ప్రాంతాన్ని సాస్కి పథకం ద్వారా రూ.79 కోట్లతో అభివృద్ధి చేసి అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే పర్యాటకులు బస చేసేలా స్టార్ హోటళ్లు, ఇతర ఆకర్షణీయమైన నిర్మాణాలు చేపట్టడం జరుగుతోందన్నారు. టూరిస్టులను ఆకర్షించేలా గండికోట వద్ద వ్యూపాయింట్ తో పాటు, చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించేలా శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. గార్జ్ పరిసరాల్లో ఎకో ఫ్రెండ్లీ టెంట్ సిటీ, బోటింగ్ తో పాటు కోట వద్ద లైటింగ్ తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టు సందర్శించిన వారికి మంచి అనుభూతి కలిగేలా రోప్ వే, గ్లాస్ బాటమ్ వాక్ వే, లైట్ అండ్ సౌండ్ షోలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఏడాది చివరి కల్లా టెంట్ సిటీని కూడా ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గ్రాండ్ కాన్యన్ ను ఆకాశం నుంచి వీక్షించేందుకు హెలిరైడ్స్ సదుపాయం కూడా కల్పించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు కారావాన్ టూరిజం సర్వీసులు కూడా అందుబాటులోకి రానున్నాయన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, ఏపిటిడిసి నుండి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం రాజు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పెంచలయ్య, కన్సల్టెంట్లు సాజిత్ షేక్, సుమన్ దాస్, విజయ్ కుమార్ బండి, కాంట్రాక్ట్ ప్రతినిధి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భయం, అత్యాశే సైబర్ నేరగాళ్ల పెట్టుబడి సైబర్ నేరాల విషయంలో అప్రమత్తత అవసరం

## హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్,

## చార్మినార్ ప్రాంగణంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం



ప్రజల భయం, అత్యాశే సైబర్ నేరగాళ్లకు పెట్టుబడిగా మారుతోందని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్, అన్నారు. సైబర్ నేరాల విషయంలో ప్రతి ఒక్కరికి అప్రమత్తత అవసరమని ఆయన సూచించారు. హైదరాబాద్ చార్మినార్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన 'జాగృత్ హైదరాబాద్-సురక్షిత్ హైదరాబాద్' సైబర్ నేరాల అవగాహన కార్యక్రమానికి నగర సీపీ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోలీస్ అధికారులతో కలిసి చార్మినార్ పరిసరాల్లో సైబర్ క్రైం నివారణ కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. అనంతరం చార్మినార్ నుంచి మదీనా వరకు తలపెట్టిన సైబర్ క్రైం అవగాహణ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారితో సైబర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ అవగాహన కార్యక్రమంలో సీపీ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ మాట్లాడుతూ.. హైదరాబాద్ను సైబర్ నేరరహితంగా మార్చాలనే ఉద్దేశంతో ప్రతి మంగళ, శనివారాల్లో 'జాగృత్ హైదరాబాద్-సురక్షిత్ హైదరాబాద్' సైబర్ నేరాల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారంలో ఈ రెండు రోజులు ప్రతి ఇంటికి పోలీస్ అధికారులు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారని ఆయన వివరించారు. అవగాహన లేమితోనే అనేక మంది సైబర్ నేరాల బాధితులవుతున్నారని అన్నారు. ఏ రకమైన సైబర్ మోసం అయినా, వాటికి అడ్డుకట్ట వేయాలంటే ప్రజలకు స్వీయ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సైబర్ నేరాల నివారణకు ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నామని, స్వచ్ఛందంగా వలంటీర్లుగా ముందుకు వచ్చే వారు సైబర్ సింబాలుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంట్లో ఒక సైబర్ సింబా తయారై తన కుటుంబాన్ని, సమాజాన్ని సైబర్ మోసాల నుంచి రక్షించాలని పిలుపునిచ్చారు.ప్రైవేట్ ఫోటోలు, వ్యక్తిగత వివరాలను సోషల్ మీడియాలో అప్లోడ్ చేయవద్దని, అలా చేస్తే ట్రాప్ చేసి మోసం చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. పిల్లలు సోషల్ మీడియాకు అడిక్ట్ అవుతున్నారని, ముఖ్యంగా ఆడపిల్లలు అజ్ఞాత వ్యక్తులతో చాటింగ్ చేసి వ్యక్తిగత వివరాలు సమర్పించుకొని బాధితులు అవుతున్నారని చెప్పారు. ఆడ పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని, వారికి ఫోన్లు ఇచ్చే ముందు జాగ్రత్తలు చెప్పాలని సూచించారు. సీనియర్ సిటిజన్లను లక్ష్యంగా చేసుకుంటున్న 'డిజిటల్ అరెస్ట్' మోసాల పట్ల వారి పిల్లలు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా హెల్ప్ లైన్ నంబర్ 1930 కి చేసి సమాచారం ఇవ్వాలని అన్నారు. అలాగే, జాతీయ సైబర్ పోర్టల్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాల్లో గోల్డెన్ అవర్ చాలా కీలకమని, మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న డబ్బును తిరిగి రాబట్టవచ్చని స్పష్టం చేశారు. అనుమానాస్పద కాల్స్, లింక్స్, యాప్ లను నమ్మవద్దని, ఓటీపీలు, పాస్వర్డ్లు, బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. ఈ కార్యక్రమములో అడిషినల్ సిపి క్రైం అండ్ సిట్ శ్రీ.యం.శ్రీనివాస్ ఐపిఎస్, సౌత్ జోన్ అడిషినల్ డిసిపి శ్రీ.యం. మాజిద్, సౌత్ జోన్ ఏసీపీలు పి.చంద్రశేఖర్, సీహెచ్.చంద్రశేఖర్, జి.శ్యామ్ సుందర్, ఎంఏ జావీద్, తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# గజ్వేల్ లో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ

## పాల్గొన్న మంత్రి వివేక్

సిద్దిపేట నవంబర్ 22 (భారత శక్తి):

జిల్లా ఇంచార్జ్ మంత్రి జి.వివేక్ వెంకట స్వామి, గజ్వేల్ ఐఓసి లో మహిళలకు ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ చేసారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, ఎం ఎల్ సి యాదవ రెడ్డి, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, ఆర్డీవో చంద్రకళ, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, నియోజక వర్గంలో పలు మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రచోదన చేసి తెలంగాణ గేయాలపన తరవాత జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి జయదేవ్ ఆర్య ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమం విశిష్టత మహిళ శక్తి ద్వారా మహిళలు చేస్తున్న కార్యక్రమాలు గూర్చి వివరించారు.



గజ్వేల్ నియోజకవర్గంలో 54000 చీరలు పంపిణీ చేయనున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ తెలంగాణ గీతాలాపన సమయంలో చాలా మంది మహిళలు గేయాన్ని ఆలపించడం జరిగిందని రాష్ట్ర గీతానికున్న ప్రాముఖ్యతనీ తెలియజేస్తుంది.

రాష్ట్ర ముఖ్యమంత్రి మహిళా అభ్యున్నతికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ మహిళలను అన్ని రంగాల్లో బలోపేతం చేయడానికి మహిళా శక్తి పెంచడానికి వారే స్వంతంగా ఆదాయం సంపాదించడం కోసం కుటుంబానికి పోషించడం కోసం అనేక పథకాలు చేపట్టారు.

స్కూల్ యూనిఫాం, 28 కోట్ల వడ్డీలేని రుణాలు, బ్యాంక్ లింకేజీ కార్యక్రమంలో 600 కోట్ల రూపాయలు బ్యాంక్ లింకేజీ కూడా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. ఉచిత బస్సు కోసం 8 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఈ పథకాన్ని చాలా మంది మహిళలు ఉపయోగించుకుంటున్నారు.రేషన్ సన్నబియ్యం పంపిణీ 12వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తుంది.మా ప్రభుత్వం వచ్చినా తరవాత మహిళలకు ఇష్టమైన రంగులతో చీరలను మన రాష్ట్రంలో సిరిసిల్ల, కరీంనగర్ లో తయారు చేసిన చీరలను పంపిణీ చేస్తుంది.నా యొక్క సతీమణి సైతం నాకో చీర కావాలని అడిగింది అంటే అర్థం చేసుకోండి మహిళకు మంచి నాణ్యత కలిగిన చీరలను అందజేస్తుందని తెలుసుకోవాలి.

# పరారీ లో వున్న ఇద్దరు ఆన్ లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల అరెస్ట్

## రూ. 10,56,000-00 నగదు, 3సెల్ ఫోన్ లు, 1 బ్యాగ్ స్వాధీనం

## బెంగుళూరు లో పీజీ హాస్టల్ నడుపుతూ బెట్టింగ్ లకు పాల్పడుతున్న వైనం



బద్వేలు నవంబర్ 22 (భారత శక్తి)

కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణం యందు క్రికెట్ బెట్టింగ్ ముఠా కార్యకలాపాల గురించి డి.ఎస్.పి భావన ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడమైనది. ఈ క్రమములో భాగంగా బెంగుళూరు కేంద్రముగా ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తు, ఆన్లైన్ ట్రేడింగ్ కొరకు తమకు కరెంట్ అకౌంట్లు కావాలని తెలిసిన వారిని నమ్మించి, వారి ద్వారా వివిధ బ్యాంక్ లలో కరెంట్ అకౌంట్లు ఓపెన్ చేయించి, వారి బ్యాంకు ఎకౌంటు బుక్స్ తీసుకొని తద్వారా బెట్టింగ్ నిర్వహిస్తూ వుండి 5-11-2025 వ తేదీన అరెస్ట్ కాబడిన ముఠాలోని 6 మంది సభ్యులు ఇచ్చిన నేర ఒప్పుదల మేరకు ముఠాలో కీలక సభ్యులైన ప్రొద్దుటూర్ మండలం లింగాపురం గ్రామానికి చెందిన ధనికల వీర శంకరయ్య ఏ వీర శంకర్ కాసినాయన మండలానికి చెందిన ప్రస్తుతం బెంగలూరు నందు ఉన్న అర్ల చంద్ర యాదవ్ అను వారిపై నిఘా ఉంచడమైనది. సదరు నిఘాలో భాగంగా శుక్రవారం ముఠాలో కీలక సభ్యులైన ధనికల వీర శంకరయ్య ఏ వీర శంకర్ మరియు అర్ల చంద్ర యాదవ్ లను సదాశివయ్య, ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్, ప్రొద్దుటూరు టౌన్ నందు అరెస్ట్ చేసి వారి వద్ద నుండి ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్ ద్వారా ఆర్జించిన రూ. 10,56,000-00 నగదు, 3 సెల్ ఫోన్ లు, 1 బ్యాగ్ స్వాధీనం చేసుకోవడమైనది. విచారణలో బెంగుళూరునందు, పి నువ్వు అకౌంటు జీ నడుపుతున్నధనికల వీర శంకరయ్య ఏ వీర శంకర్ మరియు అర్ల చంద్ర యాదవ్ లు తీనీఎజీశ్రీఎనీనీఎ365.ఇనీఎ.తిని అను వెబ్ సీట్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ, సదరు వెబ్ సైట్ ద్వారా బెట్టింగ్ లావా దేవీలకొరకు బ్యాంక్ అకౌంట్లు అవసరం అయినందున తాము నిర్వహిస్తున్న అక్రమ బెట్టింగ్ వ్యవహారాన్ని ఈ కేసు నందు ఇంతకు ముందు అరెస్ట్ కాబడిన తమ అనుచరుల ద్వారా బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేయించుకొని వారికి కమిషన్లు ఇస్తూ వారి ద్వారా విస్తృతముగా ఆన్లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తేలినది. ప్రస్తుతానికి బ్యాంకుల ద్వారా తెలిసిన సమాచారం మేరకు పై బెట్టింగ్ కు సంబంధించిన అనుమానాస్పద లావా దేవిలు జరిపిన అన్నీ అకౌంట్లను ఫ్రీజ్ చేయమని ఆయా బ్యాంకులను కోరడమైనది.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మైదుకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కృష్ణమూర్తి

మైదుకూరు (బ్రహ్మంగారిమఠం)

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అధికారులలో మైదుకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం కృష్ణమూర్తి మైదుకూరు మండల రెవెన్యూ అధికారి నరేంద్ర మండల వ్యవసాయ అధికారి బాలగంగాధర్ రెడ్డి లు ఉన్నారు. వరి పంట పండించే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండనిశనివారం నాడు మైదుకూరు మండలంలోని శివపురం రైతు సేవ కేంద్రాన్ని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంగా కేటాయించి స్థానిక మైదుకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఏర్పాట్లను పరిశీలించారు. ఇందులో భాగంగా ఏడిఏ కృష్ణమూర్తి గారు మాట్లాడుతూ మైదుకూరు మండలంలో నాలుగు గ్రామాలలో సుమారు 1000 మంది రైతులు మూడువేల ఎకరాలలో వరి పంటను సాగు చేస్తున్నారు ముఖ్యంగా శివపురం, అన్నలూరు మరియు ఎస్. మైదుకూరు గంజి కుంట గ్రామాలలో వరి పంటను సాగు చేస్తున్నారు. అందులో భాగంగా జిల్లా కలెక్టర్ గారి ఆదేశాలు మేరకు వరి పంట పండించే రైతులు కొరకై వరి ధాన్యం సేకరణకు శివపురం రైతు సేవా కేంద్రం ను కొనుగోలు కేంద్రంగా కేటాయించి తద్వారా వరి పండించే రైతుల ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేయుటకు తగిన ఏర్పాట్లను చేయడం జరిగింది. ఇందులో భాగంగా వరి ధాన్యం గ్రేడ్ ఏ రకం క్వింటాల్ కు 2389 రూపాయలు మరియు సాధారణ రకం క్వింటాల్ 2369 రూపాయలు గాను ప్రభుత్వం నిర్ణయించడం జరిగింది అదేవిధంగా తేమ శాతం 17 శాతానికి మించరాదని మరియు చెత్త,రాళ్ళు మరియు తాలు ఒక శాతానికి మించరాదని చెడిపోయిన మరియు రంగు మారిన విత్తనాలు ఐదు శాతానికి మించరాదని పరిపక్వానికి రాని మరియు వంకర తిరిగిన గింజలు మూడు శాతానికి మించకూడదని ఆయన రైతులను ఉద్దేశించి తెలిపారు

# ఈ నెల 29న దీక్షా దివాస్ ఘనంగా నిర్వహించాలి

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ నవంబర్ 22 (భారత శక్తి)

తెలంగాణ చరిత్రలో గొప్ప ఘట్టానికి గుర్తుగా దీక్షా దివాస్ నాయకులకు దిశానిర్దేశం చేసిన కేటీఆర్.భారత రాష్ట్ర సమితి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నెల 29న దీక్షా దివాస్, ను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. దశాబ్దంన్నర క్రితం పార్టీ అధినేత కెసిఆర్ తెలంగాణ వచ్చుడో..కెసిఆర్ సచ్చుడో' అనే గొప్ప త్యాగ నిరతితో దీక్షను చేపట్టి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారు. తెలంగాణ చరిత్రలో ఘనమైన ఈ ఘట్టాన్ని పురస్కరించుకొని దీక్షా దివాస్ను పెద్దఎత్తున నిర్వహించాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి ఆయన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జిల్లా అధ్యక్షులు మరియు పార్టీ జనరల్ బాడీ సభ్యులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, దీక్షా దివాస్ నిర్వహణకు సంబంధించిన మార్గదర్శనం చేశారు.దీక్షా దివాస్ నిర్వహణకు ముందుగా, ఈ నెల 26వ తేదీన అన్ని జిల్లాల పార్టీ కేంద్రాల్లో ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశాలు నిర్వహించుకోవాలని కేటీఆర్ సూచించారు. ఈ సమావేశాలకు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు సహా ఇతర కీలక నాయకులందరినీ ఆహ్వానించాలని ఆయన ఆదేశించారు. ఈ సన్నాహక సమావేశాల ముఖ్య ఉద్దేశం, నవంబర్ 29న పార్టీ ఘనంగా నిర్వహించే దీక్షా దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించడమేనని కేటీఆర్ స్పష్టం చేశారు.నవంబర్ 29న జరిగే దీక్షా దివాస్ కార్యక్రమాన్ని అన్ని జిల్లా కేంద్రాల్లోని పార్టీ కార్యాలయాల్లోనే నిర్వహించాలి. ఈ సందర్భంగా ఒక రోజు ముందుగా, అంటే 28వ తేదీ సాయంత్రంలోగా జిల్లా కేంద్రాలు, పట్టణాలను బ్యానర్లు, ఫ్లెక్సీలతో అలంకరణ పూర్తి చేయాలి. పార్టీ కార్యాలయం ప్రాంగణాన్ని కూడా సుందరంగా అలంకరించాలి. జిల్లాలోని ముఖ్య నాయకులందరికీ ప్రత్యేకంగా సమాచారం అందించి, కనీసం 1000 మంది కీలక పార్టీ నేతలతో ఈ సమావేశాన్ని నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోవాలి. మొదటగా తెలంగాణ తల్లికి, అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించిన తర్వాత, కార్యక్రమం ప్రారంభానికి గుర్తుగా కెసిఆర్ గారి భారీ కటౌట్కు పాలాభిషేకం చేయాలి.దీక్షా దివాస్ సందర్భంగా జరిగిన అనేక కీలక సంఘటనలు, వార్తలు, పరిణామాల సమాహారంతో కూడిన ఫోటో ప్రదర్శనను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. ఈ ఫోటోలను పార్టీ కేంద్ర కార్యాలయం జిల్లాకు పంపిస్తుంది. వీటితో పాటు, స్థానిక జిల్లాల్లో దీక్షా దివాస్ సందర్భంగా జరిగిన సంఘటనల ఫోటోలు, వార్తా కవరేజ్ క్లిప్పింగ్లతో మరొక ఉప విభాగాన్ని కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. కేవలం రాజకీయ ఉపన్యాసాలు కాకుండా, ఆనాటి ఉద్యమ స్మృతులను, ముఖ్యంగా దీక్షా దివాస్ వివరాలను అందించేలా మాట్లాడే వక్తలను ఆహ్వానించాలని, వారి సమయాన్ని ఇప్పుడే నిర్ధారించుకోవాలని కేటీఆర్ సూచించారు.

# అమెజాన్‌లో రికార్డు స్థాయిలో లేఆఫ్స్..

## 40 శాతం టెకీల కోత..!




**న్యూఢిల్లీ:** ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ గత నెలలో భారీగా లేఆఫ్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. దాదాపు 14,000 మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ లేఆఫ్స్ ప్రభావం సంస్థలోని దాదాపు అన్ని విభాగాలపై పడింది. క్లౌడ్ సర్వీసెస్, డివైజెస్, రిటెయిల్, అడ్వర్టైజింగ్, గ్రాసరీస్ విభాగాల్లోని ఉద్యోగులు ప్రభావితమయ్యారు. అయితే, ఈ లేఆఫ్స్‌కు సంబంధించిన కీలక వివరాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఆ కోతల్లో అత్యధికంగా నష్టపోయింది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లేనని తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

అమెరికాలోని న్యూయార్క్, కాలిఫోర్నియా, న్యూజెర్సీ, వాషింగ్టన్ రాష్ట్రాల్లోని వర్కర్ అడ్జస్ట్‌మెంట్ అండ్ రీట్రైనింగ్ నోటిఫికేషన్ ఫైలింగ్స్ ప్రకారం.. ఆ రాష్ట్రాల్లో తొలగించిన 4,700 ఉద్యోగాల్లో దాదాపు 40 శాతం (1,800) ఇంజనీరింగ్ రోల్స్‌కు చెందినవే. ముఖ్యంగా మిడ్-లెవల్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజనీర్లు ఎక్కువగా ప్రభావితమయ్యారు. ఉద్యోగుల తొలగింపుకు ఏఐ కారణం కాదని సంస్థ తెలిపింది. మరోవైపు వచ్చే ఏడాది జనవరిలో మరో రౌండ్ లేఆఫ్స్ ఉండే అవకాశం ఉందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. దీంతో ఉద్యోగుల్లో లేఆఫ్స్ గుబులు మొదలైంది. ఏ క్షణాన ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

# జీతాలను ఎందుకు దాచాలి వ్యాపారవేత్త పోస్ట్ వైరల్



**న్యూఢిల్లీ:** జీతాలను ఎందుకు గోప్యంగా ఉంచాలని కంటెంట్ క్రియేటర్, వ్యాపారవేత్త అంకుర్ వారికూ ఎక్స్ వేదికగా చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. ఈ గోప్యత వల్ల పనిప్రదేశంలో గందరగోళం, అభద్రత పెరుగుతుందని రాసుకొచ్చారు. బయటకు వెల్లడించడం వల్ల క్రమశిక్షణ ఉంటుందని అభిప్రాయపడ్డారు.

"పర్సనల్ ఫైనాన్స్‌లో నాకంటూ ఒక గుర్తింపు ఉండటానికి గల కారణం.. డబ్బును ఎప్పుడూ వ్యక్తిగతంగా పరిగణించకపోవడమే. వ్యాపారంలో నా ఆదాయం, పెట్టుబడులు, జీతం, నా పొరపాట్లు ఇలా అన్నింటిని నేను వెల్లడిస్తుంటాను. ఇదంతా ఎవరినో ఆకట్టుకోవడానికి కాదు. మీరు దాచడం మానేసినప్పుడు స్పష్టత ఎలా ఉంటుందో చూపించేందుకు. డబ్బు ప్రైవేటు అంశమని మనం భావిస్తుంటాం. ఈ గోప్యత వల్ల లబ్ధి పొందే సంస్థలే అలాంటి షరతులు పెడుతుంటాయి. జీతాల విషయమే తీసుకోండి.. ప్రతి ఒక్కరికీ తెలిసిన జీతాల అంశాన్ని దాచేందుకు కంపెనీలు భారీగా ఖర్చు చేస్తుంటాయి. ఎందుకంటే వారి జీతాల నిర్ణయాలు పక్షపాతంతో ఉంటాయి.

కానీ అలాంటి గేమ్ ఆడేందుకు నేను ఇష్టపడను. నా స్టార్టప్‌లో ప్రతి ఒక్కరి జీతం అందరికీ తెలుసు. దాని వల్ల క్రమశిక్షణ మెరుగవుతుంది. ఎందుకు అంతే జీతం ఇస్తున్నారనే దానిపై నియామకాల సమయంలో స్పష్టత ఇస్తాం. పారదర్శకత అనేది సంస్థల వైఖరి మాత్రమే.. నైతికత కాదు" అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. గతంలో వారికూ తన డ్రైవర్ జీతం గురించి బహిరంగంగా వెల్లడించారు. అతడి జీతం ఎలా పెరిగిందో వివరించారు. రానున్న ఐదారేళ్లలో రూ.లక్ష జీతం అందుకోవాలని తాను కోరుకుంటున్నట్లు కూడా చెప్పారు.

# బైజూస్ రవీంద్రన్‌కు షాక్..

### 1 బిలియన్ డాలర్ల చెల్లింపునకు యూఎస్ కోర్టు ఆదేశం




**న్యూఢిల్లీ:** అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఎడ్‌టెక్ సంస్థ బైజూస్‌కు గట్టి షాక్ తగిలింది. బైజూస్ ఆల్ఫా, అమెరికాకు చెందిన రుణదాత గ్లాస్‌ట్రస్ట్ కంపెనీ ఎల్‌ఎల్‌సీ దాఖలు చేసిన పిటిషన్‌పై అమెరికా కోర్టు డిఫాల్ట్ జడ్జిమెంట్ (వాదనలకు ఆస్కారం లేకుండా) వెలువరించింది. పిటిషనర్లకు 1 బిలియన్ డాలర్లను వ్యక్తిగతంగా చెల్లించాలని బైజూస్ రవీంద్రన్‌ను ఆదేశించింది. ఈ మేరకు నవంబర్ 20న తీర్పు వెలువరించింది. తమ తీర్పును రవీంద్రన్ ఉల్లంఘించడం, పట్టించుకోకపోవడంతో ఈ ఆదేశాలు ఇస్తునట్లు డెలావేర్ దివాలా పరిష్కార కోర్టు తన తీర్పులో పేర్కొంది.

బైజూస్ పేరిట సేవలందిస్తున్న సమయంలోనే బైజూస్ ఆల్ఫాను 2021లో నెలకొల్పారు. అంతర్జాతీయ రుణదాతల నుంచి నిధుల సమీకరించే ఉద్దేశంతో ఈ కంపెనీని ఏర్పాటు చేశారు. దీనిద్వారా బైజూస్ ఆల్ఫా 1 బిలియన్ టర్మ్‌లోన్-బిని బైజూస్ పొందింది. అయితే, బైజూస్ ఆల్ఫా టర్మ్‌లోన్ నిబంధనలను ఉల్లంఘించిందని, మొత్తం అప్పులో 533 మిలియన్ డాలర్లు అమెరికా నుంచి చట్టవిరుద్ధంగా తరలించినట్లు రుణదాతలు ఆరోపించారు. ఈ క్రమంలోనే గ్లాస్‌ట్రస్ట్ డెలావేర్ కోర్టును ఆశ్రయించింది. దీంతో బైజూస్ ఆల్ఫాను స్వాధీనం చేసుకునేందుకు గ్లాస్ ట్రస్ట్‌కు కోర్టు అనుమతించింది. బైజూస్ ఆల్ఫా, గ్లాస్ ట్రస్ట్ 533 మిలియన్ డాలర్లకు సంబంధించిన నిధుల లావాదేవీల కోసం మరోసారి కోర్టును ఆశ్రయించాయి. దీంతో సంబంధిత వివరాలు ఇవ్వాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

డిస్కవరీ ఆదేశాల గురించి తెలిసి కూడా రవీంద్రన్ చూసీచూడనట్లు వ్యవహరించారని కోర్టు పేర్కొంది. ఈ విషయంలో కోర్టు ఆదేశాలను కూడా పట్టించుకోలేదని తెలిపింది. ఉద్దేశపూర్వకంగానే రవీంద్రన్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన కోర్టు.. డిఫాల్ట్ ఆదేశాలు జారీ చేసింది. బైజూస్ ఆల్ఫాకు సంబంధించి 533 మిలియన్ డాలర్లు, క్యామ్‌షాఫ్ట్ హెడ్జ్ ఫండ్ ఇంట్రెస్ట్‌కు సంబంధించిన 540.6 మిలియన్ డాలర్ల నిధులను వెంటనే చెల్లించాలని బైజూస్‌ను ఆదేశించింది. ఆల్ఫా ఫండ్లను ఎలా ఖర్చు చేసిందీ వెల్లడించి పూర్తి అకౌంట్ వివరాలు సమర్పించాలని పేర్కొంది. ఈ ఆదేశాలను బైజూస్ రవీంద్రన్ తోసిపుచ్చారు. అప్పీల్‌కు వెళతామని పేర్కొన్నారు. కోర్టులో వాదనలు వినిపించేందుకు తమకు అవకాశం ఇవ్వలేదని బైజూస్ తరపు లాయర్లు తెలిపారు.

# యాషెస్‌లో ఓ అరుదైన టెస్టు..




### చరిత్రను తిరగరాసిన హెడ్, స్టార్క్..!

**పెర్త్:** యాషెస్ సిరీస్‌లో కనీవినీ ఎరుగని అద్భుతం ఆవిష్కృతమైంది. పేసర్ల వికెట్ల వేటతో ఉత్కంఠ రేపిన పెర్త్ టెస్టు ఆశ్చర్యంగా రెండోరోజే ముగిసింది. తొలి రోజే 19 వికెట్లు పడడం ఒక రికార్డు అయితే.. ఆతిథ్య ఆసీస్ గెలుపొందడం మరో రికార్డు. మొత్తానికి యాషెస్ వందేళ్ల చరిత్రలోనే అరుదైన మ్యాచ్‌గా పెర్త్ టెస్టు పుస్తకాల్లోకెక్కింది. పేసర్లు వికెట్ల పండుగ చేసుకున్న చోట ఒకేఒక్కడు ఇంగ్లండ్ నుంచి విజయాన్ని లాక్కున్నాడు. తన అసాధారణ విధ్వంసంతో ఓపెనర్ ట్రావిస్ హెడ్, బంతితో చెమటలు పట్టించిన మిచెల్ స్టార్క్ చరిత్రను తిరగరాశారు. టెస్టు ఫార్మాట్లోని అతిపెద్ద సిరీస్‌లలో ఒకటైన యాషెస్ ఆరంభం 'నభూతో న భవిష్యత్' అనే చెప్పాలి. ఆసీస్ గడ్డపై సిరీస్ విజయంపై గంపెడు ఆశలతో విమానమెక్కి వచ్చిన బెన్ స్టోక్స్ బృందానికి పెద్ద షాక్ తగిలింది. తొలి రోజే 19 వికెట్లు పడడంతో మ్యాచ్ ఫలితం రెండు మూడు రోజుల్లోనే తేలిపోనుందనే అంచనాకు వచ్చారంతా. ఇంగ్లండ్ ఆటగాళ్లు, కంగారూ టీమ్‌లోని స్టార్లు అపసోపాలు పడ్డచోట ట్రావిస్ హెడ్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఇంగ్లీష్ బౌలింగ్ దళాన్ని కకావికలం చేసిన ఈ చిచ్చరపిడుగు 69 బంతుల్లోనే శతకంతో ఆసీస్ విజయంలో కీలకమయ్యాడు. అంతే.. రెండు రోజుల్లోనే మ్యాచ్ ముగిసి.. ఆతిథ్య ఆస్ట్రేలియా 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రికార్డుల విషయానికొస్తే..

ఐదోరోజులు రసవత్తర పోరాటం చూడాలనుకున్న అభిమానులకు పెర్త్ టెస్టు రెండో రోజే మ్యాచ్ ముగిసింది. ఇలా రెండురోజుల్లోనే ఫలితం తేలడం ఈ సిరీస్ వందేళ్ల చరిత్రలో ఇదే తొలిసారి. ఇదివరకూ 1921లో ట్రెంట్‌బ్రిడ్జ్‌లో మ్యాచ్ సైతం రెండు రోజుల్లోనే ముగిసింది. బంతుల పరంగానూ పెర్త్ టెస్టు రికార్డు పట్టేసింది. ఈ మ్యాచ్‌లో 847 బంతుల్లోనే మ్యాచ్ పూర్తైంది. యాషెస్ చరిత్రలో ఇంత తక్కువ బంతులు వేయడం ఇది మూడోసారి మాత్రమే. 1888లో ఇంగ్లండ్ గడ్డపై 788 బంతుల్లోనే మ్యాచ్ ముగియగా.. 1894-95 సిడ్నీలో 911 బంతుల్లోనే విజేత ఎవరో తేలిపోయింది.

### ఫాస్టెస్ట్ సెంచరీ

సుడిగాలి ఇన్నింగ్స్‌తో విరుచుకుపడిన ఆసీస్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేశాడు. టెస్టు క్రికెట్లో వేగవంతమైన వంద కొట్టిన రెండో కంగారూ ఓపెనర్‌గా చరిత్ర లిఖించాడు. 69 బంతుల్లోనే శతక గర్జన చేసిన ఈ లెఫ్ట్ హ్యాండర్ వెటరన్ డేవిడ్ వార్నర్ రికార్డు సమం చేశాడు. వార్నర్ 2012లో భారత్‌పై ఇన్నేసి బంతుల్లోనే సెంచరీ సాధించాడు. ఈ ఫార్మాట్‌లో వేగవంతమైన సెంచరీ బ్రెండన్ మెక్‌కల్లమ్ పేరిట ఉంది. ఈ చిచ్చరపిడుగు 2015లో ఆస్ట్రేలియాపై కేవలం 54 బంతుల్లోనే వంద కొట్టేశాడు.

పేస్, బౌన్సీ ట్రాక్ మీద బ్యాటర్ల తడబడడంతో ఓటమిపాలైన ఇంగ్లండ్ జట్టు మరో చెత్త రికార్డు మూటగట్టుకుంది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఆ జట్టు ఆటగాళ్లు 405 బంతులే ఎదుర్కొన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో 32.5 ఓవర్లు.. రెండో ఇన్నింగ్స్‌లో 34.4 ఓవర్లకే ఆ జట్టు కుప్పకూలింది. ఇంత తక్కువ బంతులకే ఇంగ్లండ్ ఆలౌటవ్వడం ఇది మూడోసారి. అంతేకాదు పెర్త్‌లో ఇంగ్లండ్‌కు వరుస ఓటముల పరంపర కొనసాగుతోంది.

పెర్త్ టెస్టులో ఆస్ట్రేలియా రన్ రేటు కూడా అమోఘమనే చెప్పాలి. నాలుగో ఇన్నింగ్స్‌లో ఆ జట్టు ఓవర్‌కు 7.23 చొప్పున పరుగులు సాధించింది. రెండొందలకు పైగా ఛేదనలో 7కుపైగా రన్‌రేటు అనేది అత్యధికం. ఆసీస్ 28.2 ఓవర్లలోనే 205 పరుగులను ఉఫ్‌మనిపించింది. అంతేకాదు నాలుగో ఇన్నింగ్స్‌లో 200 ప్లస్ లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించడం ఇది నాలుగోసారి. పెర్త్ టెస్టు కంటే ముందు ఛేదనలో రన్‌రేట్ రికార్డు ఇంగ్లండ్ పేరిట ఉంది. 2022లో ఆ జట్టు న్యూజిలాండ్‌పై 299 పరుగుల లక్ష్యాన్ని .98 రన్‌రేటుతో ఛేదించింది.

### సూపర్ స్టార్క్..

యాషెస్ సిరీస్ ఓపెనర్‌లో ఆస్ట్రేలియా పైచేయి సాధించడంలో మిచెల్ స్టార్క్ కీలకమయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో నిప్పులు చెరిగిన ఈపేసర్ ఏడు వికెట్లతో ఇంగ్లండ్ నడ్డివిరిచాడు. 7/58తో కెరీర్లోనే అత్యుత్తమ గణాంకాలు నమోదు చేసిన మిస్పైల్ స్టార్క్.. రెండో ఇన్నింగ్స్‌లో 3/55తో బెన్ స్టోక్స్ బృందాన్ని వణికించాడు. రెండింటా కలిపి.. ఒక మ్యాచ్‌లో10/113తో రికార్డు నెలకొల్పాడీ లెఫ్ట్ ఆర్మ్ పేసర్.

యాషెస్‌లో దివంగత షేన్ వార్న్ తర్వాత ఈ ఫీట్ సాధించిన రెండో ఆసీస్ బౌలర్‌గా నిలిచాడు. వార్న్ 2005లో ఓవల్ మైదానంలో పది వికెట్లతో మెరిశాడు. తొలిసారి ఈ మైలురాయికి చేరువైంది మాత్రం క్రెగ్ మెక్‌డెర్మాట్. 1991లో అతడు 11/157తో రాణించాడు.

# సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ..

# మహ్మద్ షమీ, ఆకాశ్ దీప్‌లకు చోటు




**న్యూఢిల్లీ:** సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీకి బెంగాల్ జట్టును ప్రకటించింది. ఫాస్ట్ బౌలర్లు మహమ్మద్ షమీ, ఆకాశ్ దీప్‌లను జట్టులో చోటు దక్కింది. రంజీ తొలి దశలో నాలుగు మ్యాచుల్లో షమీ 20 వికెట్లు పడగొట్టాడు. పాదం గాయం నుంచి కోలుకున్న తర్వాత.. షమీ ఈ సీజన్‌లో బెంగాల్ ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు ఆడాడు. ఉత్తరాఖండ్, గుజరాత్‌లపై బెంగాల్ వరుసగా గెలిచిన తొలి రెండు మ్యాచ్‌ల్లో 15 వికెట్లు పడగొట్టాడు. ఆకాశ్ దీప్‌తో పాటు షమీ కూడా బెంగాల్ జట్టుకు ఎంపికయ్యాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బెంగాల్ జట్టుకు అభిమన్యు ఈశ్వరన్ నాయకత్వం వహిస్తాడు. షమీ చాలాకాలంగా జాతీయ జట్టుకు దూరంగా ఉన్నాడు. సెలక్టర్లు అతన్ని తప్పించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

ఆస్ట్రేలియాతో జరిగిన పరిమిత ఓవర్ల సిరీస్, ఆ తర్వాత దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్ సిరీస్‌లకు షమీని జట్టులోకి తీసుకోలేదు. అయితే, దేశీయ క్రికెట్‌లో రాణించి జాతీయ జట్టులోకి రావాలని షమీ భావిస్తున్నాడు. 'రంజీ ట్రోఫీ సందర్భంగా షమీ మాట్లాడుతూ.. ఫిట్‌గా ఉండడం నా మోటివేషన్. భారత జట్టుకు అందుబాటులో ఉండడమే తప్పు.. సెలెక్టర్లకు ఫిట్‌నెస్ అప్‌డేట్స్ ఇవ్వడం తన పనికాదు' అంటూ వ్యాఖ్యానించాడు. బెంగాల్ జట్టులో రైజింగ్ ఆసియా కప్‌లో ఇండియా-ఏ తరఫున ఆడిన వికెట్ కీపర్ కం బ్యాట్స్‌మన్ అభిషేక్ పోరెల్ సైతం చోటు దక్కించుకున్నాడు. రెండవ వికెట్ కీపర్‌గా షకీర్ హబీబ్ గాంధీ సైతం ఉన్నాడు. ఈ టీ20 టోర్నమెంట్‌లో భాగంగా ఈ నెల 26న హైదరాబాద్‌లో బరోడాతో తమ మొదటి మ్యాచ్ ఆడనున్నారు. ఈ గ్రూప్‌లో పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, సర్వీసెస్, పుదుచ్చేరి, హర్యానా ఉన్నాయి.

**సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీకి బెంగాల్ జట్టు :** అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), సుదీప్ ఘరామి, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), షకీర్ హబీబ్ గాంధీ (వికెట్ కీపర్), యువరాజ్ కేస్వానీ, ప్రియాంషు శ్రీవాస్తవ, షాబాజ్ అహ్మద్, ప్రదీప్త ప్రమాణిక్, రితిక్ ఛటర్జీ, కరణ్ లాల్, సక్షమ్ చౌదరి, మహ్మద్ షమీ, ఆకాశ్ దీప్, సయాన్ ఘోష్, కనిష్క్ సేథ్, యుధాజిత్ గుహ, శ్రేయాన్ చక్రవర్తి.

# ఫిబ్రవరి 7 నుంచి టీ20 ప్రపంచకప్..




### కొలంబోలో భారత్-పాక్ హైవోల్టేజ్ మ్యాచ్ ఈ రోజునే..!

**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది ఐసీసీ టీ20 ప్రపంచకప్ జరగనున్నది. ఈ మెగా టోర్నీ కోసం సన్నహాలు మొదలయ్యాయి. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వబోతున్నాయి. నివేదికల ప్రకారం.. టీ20 ప్రపంచకప్ ఫిబ్రవరి 7న ప్రారంభం కానుండగా.. మార్చి 8న ఫైనల్ జరుగుతుందని అంచనా. ఫిబ్రవరి 15న కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో చిరకాల ప్రత్యర్థులు భారత్-పాకిస్తాన్ మధ్య హైవోల్టేజ్ మ్యాచ్ జరుగుతుందని భావిస్తున్నారు. ఫైనల్ అహ్మదాబాద్ లేకపోతే కొలంబోలో జరిగే ఛాన్స్ ఉంది. భారత్ డిఫెండింగ్ ఛాంపియన్‌గా స్వదేశంలో జరిగే ప్రపంచ కప్‌లోకి ప్రవేశిస్తుంది. గత ఏడాది జూన్‌లో బార్బడోస్‌లో జరిగిన చివరి టీ20 ప్రపంచ కప్ టైటిల్‌ను భారత్ గెలిచింది. పాకిస్తాన్ ఫైనల్‌కు చేరుకుంటే టైటిల్ మ్యాచ్ శ్రీలంకలో జరుగుతుంది.

ఐసీసీ, బీసీసీఐ, పీసీబీ మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం.. భారత్-పాకిస్తాన్ మధ్య జరిగే అన్ని మ్యాచులు 2027 వరకు తటస్థ వేదికల్లో జరుగుతాయి. ఇదిలా ఉండగా.. మెగా టోర్నీ కోసం ఇప్పటికే ఐసీసీ షెడ్యూల్‌ను ఖరారు చేసే పనిలో నిమగ్నమైంది. టోర్నీలో దాదాపు 20 జట్లు పాల్గొనున్నాయి. భారత్, శ్రీలంక ఆతిథ్యం ఇవ్వనున్న 2026 టీ20 ప్రపంచ కప్ కోసం వేదికలను ఐసీసీ షార్ట్‌లిస్ట్ చేసింది. ఇందులో భారత్‌లో ఐదు, శ్రీలంకలో మూడు వేదికలు ఉన్నాయి. ఇందులోనే ప్రపంచకప్ మ్యాచులు జరుగుతాయి. బీసీసీఐ అహ్మదాబాద్, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై, ముంబయిలను జాబితాలో చేర్చించింది. శ్రీలంక కొలంబోలోని ఆర్ ప్రేమదాస, సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ క్రికెట్ గ్రౌండ్, క్యాండీలోని పల్లెకెలె అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాల్లో మ్యాచులు నిర్వహించే అవకాశం ఉంది. ఈ వేదికలను ఐసీసీ త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

# 149 సంవత్సరాల టెస్ట్ చరిత్రలో తొలిసారిగా..

### మూడు ఇన్నింగ్స్‌లో జీరో స్కోర్‌కే వికెట్..!



**న్యూఢిల్లీ:** యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ మధ్య పెర్త్‌లో జరుగుతున్నది. ఈ టెస్టులో శనివారం రెండోరోజు మూడు ఇన్నింగ్స్ జరుగుతున్నది. టాస్ గెలిచి మొదట బ్యాంటింగ్ చేసిన తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 132 పరుగులకే కుప్పకూలింది. ఆ తర్వాత ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. రెండో ఇన్నింగ్స్‌లో 164 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తొలి టెస్టులో రెండోరోజు పలు రికార్డులు నమోదయ్యాయి. 149 సంవత్సరాల టెస్ట్ క్రికెట్ చరిత్రలో తొలిసారిగా మూడు ఇన్నింగ్స్‌లో సున్నా స్కోర్‌కే తొలి వికెట్ పడింది. ఇంగ్లండ్-ఆస్ట్రేలియా రెండూ తమ మొదటి ఇన్నింగ్స్‌లో సున్నా వద్ద మొదటి వికెట్‌ను కోల్పోయాయి. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లోనూ సున్నా స్కోర్ వద్దే తొలి వికెట్‌ను కోల్పోయింది. మార్చి 1877లో టెస్ట్ క్రికెట్ ప్రారంభమైనప్పటి నుంచి 148 సంవత్సరాల 8 నెలల్లో ఇలా జరగడం ఇదే మొదటిసారి.

పెర్త్ టెస్ట్‌లో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో జాక్ క్రాలీ రూపంలో తొలి దెబ్బను ఎదుర్కొంది. ఖాతా తెరవకుండానే అవుట్ అయ్యాడు. ఆ సమయంలో ఇంగ్లండ్ స్కోర్ సున్నా. ఆ తర్వాత, ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో జేక్ సైతం ఖాతా తెరకుండానే ఔటయ్యాడు. ఆ సమయంలోనూ ఆస్ట్రేలియా స్కోర్ సైతం సున్నానే. ఆ తర్వాత, ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో రెండో రోజు జాక్ క్రౌలీ మళ్లీ ఖాతా తెరవకుండానే ఔటయ్యాడు. ఆ తర్వాత ఇంగ్లండ్ స్కోరు సున్నా. టెస్ట్ మ్యాచ్‌లో ఇలా జరుగడం తొలిసారి. యాషెస్ టెస్ట్‌లో రెండు ఇన్నింగ్స్‌లలో ఖాతా తెరవకుండానే ఔటైన నాల్గో ఇంగ్లీష్ బ్యాట్స్‌మన్ క్రౌలీ. ట్రెవర్ బేలిస్, డెన్నిస్ అమిస్, మైఖేల్ అథర్టన్ ఈ ఘనతను సాధించారు. ఓపెనింగ్ లేకుండానే ఔటైన ఇంగ్లీష్ బ్యాట్స్‌మెన్ . ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌ను 32.5 ఓవర్లలో 172 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌ను 45.2 ఓవర్లలో 132 పరుగులకు కుప్పకూలింది. రెండు ఇన్నింగ్స్‌లో మొత్తం 78.1 ఓవర్లు. యాషెస్ టెస్ట్‌లో ఇరు జట్లు ఆడిన రెండో అతి తక్కువ తొలి ఇన్నింగ్స్ ఇది. 1902లో మెల్‌బోర్న్‌లో జరిగిన యాషెస్ టెస్ట్‌లో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌ను 32.1 ఓవర్లకు, ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌ను 15.4 ఓవర్ల మాత్రమే ఆడారు. రెండు ఇన్నింగ్స్‌లలో మొత్తం 47.5 ఓవర్లు ఆడాయి.

యాషెస్ చరిత్రలో ఇంగ్లండ్ కెప్టెన్లు ఆస్ట్రేలియా గడ్డపై చిరస్మరణీయ ప్రదర్శన చేశారు. ఈ జాబితాలో బెన్ స్టోక్స్ సైతం అద్భుతంగా బౌలింగ్ చేశాడు. పెర్త్ టెస్ట్ ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు పడగొట్టి కంగారుల పతనంలో కీలక పాత్ర పోషించాడు. 23 పరుగలకు ఐదు వికెట్ల తీశాడు. దాదాపు శతాబ్దం నాటి రికార్డును బద్దలుకొట్టాడు. ఈ జాబితాలో గబ్బీ అలెన్ (1936), జానీ డగ్లస్ (1912), ఫ్రెడ్డీ బ్రౌన్ (1951), బాబ్ విల్లిస్ (1982) తా జాబితాలో ముందున్నారు. యాషెస్‌లో తొలి ఇన్నింగ్స్‌లో రెండు జట్లు 200 కంటే తక్కువ పరుగులకే ఆలౌట్ కావడం చాలా అరుదు. చివరిసారిగా ఇది 1990-91 బ్రిస్బేన్ (గబ్బా) టెస్ట్‌లో ఇలాగే జరిగింది. ఆ సమయంలో ఇంగ్లండ్ 194 పరుగులకు, ఆస్ట్రేలియా 152 పరుగులకు ఆలౌట్ అయ్యాయి. తాజాగా పెర్త్ టెస్ట్‌లోనూ బ్యాట్స్‌మెన్ పరుగులు తీసేందుకు ఇబ్బందిపడ్డారు. బౌలర్ల ఆధిపత్యం కొనసాగింది. 132 పరుగుల స్కోరు 21వ శతాబ్దంలో ఆస్ట్రేలియా స్వదేశీ యాషెస్ టెస్ట్ చరిత్రలో రెండో అత్యల్ప మొదటి ఇన్నింగ్స్ స్కోరు. 2010-11 బాక్సింగ్ డే టెస్ట్ (మెల్‌బోర్న్)లో అత్యల్ప స్కోరు నమోదైంది. ఆ సమయంలో ఆస్ట్రేలియా కేవలం 98 పరుగులకే ఆలౌట్ అయింది.





# మహిళలు బలహీనులు కాదు.. బలవంతులు

నటి రష్మిక మందన్నా కామెంట్స్

టాకీస్: ప్రస్తుతం ఫుల్ ఫామ్‌లో దూసుకెళ్తున్న హీరోయిన్ రష్మిక మందన్నా, భాష ఏదైనా పట్టించుకోకుండా వరుస సినిమా ప్రాజెక్టులతో బిజీగా గడుపుతోంది. అదే వేగంతో విజయాలు కూడా అందిపుచ్చుకుంటూ స్టార్ హీరో రేంజ్ ఫ్యాన్‌బేస్‌ను సంపాదించుకుంది. తాజాగా విడుదలైన 'గర్ల్‌ఫ్రెండ్' సినిమాతో మరో హిట్ తన ఖాతాలో వేసుకున్న రష్మిక, సినిమాలకే కాకుండా సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉండి అభిమానులతో కంటిన్యూ టచ్‌లో ఉంటుంది. ఇటీవల ఆమె స్త్రీశక్తి గురించి ఓ ఆసక్తికరమైన పోస్ట్‌ను షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించింది. అమ్మాయిలంతా ఏకమై నిలిస్తే ఆ శక్తిని ఎవరూ ఆపలేరని ఆమె స్పష్టంగా తెలిపింది. మహిళల మధ్య ఉండే భావోద్వేగ అనుబంధం వేరే స్థాయిలో ఉంటుందని, మంచి స్నేహితురాలితో దగ్గరైతే జరగబోయే విషయాలు ముందే అర్థమైపోతాయనే ఫీలింగ్ కలుగుతుందని చెప్పింది. స్త్రీలు ఒకరికొకరు మద్దతు ఇస్తే జీవితం మరింత సులభమవుతుందని, వారు బలహీనులు కాదు, ఎంతో ప్రేమతో, బలంతో ఉండే వ్యక్తులని రష్మిక పేర్కొంది. ఎల్లప్పుడూ తనతో ఉండే స్నేహితురాళ్లకు కృతజ్ఞతలు చెబుతూ, ప్రతి ఒక్కరి జీవితంలో కూడా ఇలాంటి మంచి ఫ్రెండ్స్ ఉండాలని కోరుకుంటున్నానని ఆమె చెప్పింది.

# వారణాసిలో మ్యూజిక్ అదుర్స్

## ఆరు పాటలుంటాయని హింట్ ఇచ్చిన కీరవాణి

**టాకీస్:** ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ట్రెండింగ్‌లో ఉన్న సినిమా 'వారణాసి'. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా తెరకెక్కుతోన్న ఈ యాక్షన్ అడ్వెంచర్ మూవీకి సంబంధించిన ప్రతి వార్త క్షణాల్లో వైరల్ అవుతోంది. ప్రజలు కూడా ఈ మూవీపై క్యూరియసిటీతో ఉన్నారు. తాజాగా చిత్ర సంగీత దర్శకుడు కీరవాణి ఈ సినిమాపై మ్యూజికల్ అప్‌డేట్ ఇచ్చారు. గోవా వేదికగా జరుగుతోన్న ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి) వేడుకలకు హాజరైన కీరవాణి.. 'వారణాసి'లో సంగీతం ఎవరూ ఊహించని స్థాయిలో ఉంటుందన్నారు. 'అభిమానులు ఈ చిత్రంలో అద్భుతమైన సంగీతాన్ని వింటారు. అంతకు మించి ఇప్పుడే ఈ ప్రాజెక్ట్ గురించి ఏం చెప్పలేను. 'వారణాసి'లో మొత్తం ఆరు పాటలు ఉంటాయి. మనం చేసే పని ఏదైనా కానీ.. దానిపై మనకు స్పష్టత, మనపై మనకు నమ్మకం ఉంటే ఏవిషయమూ గందరగోళంగా అనిపించదు. ఒత్తిడిగా కూడా ఉండదు. నాకు ఈ ప్రాజెక్ట్ విషయంలో ఎటువంటి గందరగోళం లేదని చెప్పారు. ఇప్పటికే ఈ సినిమాలో 'రణ కుంభ' ఆడియో సాంగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ యూట్యూబ్‌లో ట్రెండ్ సృష్టిస్తోంది. రాజమౌళి తెరకెక్కించే సినిమాలకు ఆయన సోదరుడు కీరవాణి సంగీతం అందిస్తారు. గతంలో వీరిద్దరి కాంబోలో వచ్చిన 'స్టూడెంట్ నెం. 1', 'యమదొంగ', 'మగధీర', 'ఈగ', 'బాహుబలి'లోని పాటలు నేటికీ సోషల్‌మీడియా రీల్స్‌లో వైరల్ అవుతూనే ఉన్నాయి.


ఇక వీరి కాంబోలో వచ్చిన 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాటను ఆస్కార్ వరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 'వారణాసి'కి సంబంధించిన ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో పలు భాషలకు చెందిన అగ్రతారలు నటిస్తున్న నేపథ్యంలో దీని బ్జడెట్‌పై వార్తలు వెలువడుతున్నాయి. వీరికి భారీ పారితోషికం ఇవ్వనున్నారని టాక్ వినిపిస్తోంది. ఇక ఈ చిత్రబ్జడెట్ ఏకంగా రూ.1100 కోట్లని ప్రచారం జరుగుతోంది. 2027 వేసవిలో ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# ప్రభాస్ ఫౌజీపై ప్రీక్వెల్ ఊహాగానాలు...

**టాకీస్:** ఇప్పటి వరకు రెబల్ స్టార్ 'ప్రభాస్' సీక్వెల్ మూవీస్ మాత్రమే చేశారు. రెండు భాగాలుగా వచ్చిన 'బాహుబలి' భారీ విజయాన్ని సాధించగా.. నెక్ట్స్ కల్కి 2, సలార్ 2 రెడీ అవుతున్నాయి. ఈ లిస్ట్‌లో రాజాసాబ్ కూడా ఉంది. అయితే ఇవన్నీ సీక్వెల్స్ మాత్రమే. ఇప్పుడు ఓ సినిమాకు ప్రీక్వెల్ ప్రయత్నాలు జరుగుతున్నట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తున్న సినిమాల్లో 'ఫౌజీ' కూడా ఒకటి. సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాకు హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే ఏడాది ఆగష్టులో ఈ సినిమా రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నారు. ఇమాన్వీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ వారు భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. అయితే ఫౌజీ చిత్రానికి ప్రీక్వెల్ చేసే ప్లానింగ్‌లో ఉన్నారట రాఘవపూడి. ఇప్పటి వరకు వచ్చిన ఫౌజీ అవుట్ పుట్ పట్ల ప్రభాస్ చాలా హ్యాపీగా ఉన్నారట. హను వర్క్‌కు ఫిదా అవుతున్నాడట డార్లింగ్.




అందుకే ఆయనతో మరో సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా ఓ టాక్ ఉంది. ఇప్పుడు దాదాపుగా ప్రీక్వెల్ ఫిక్స్ అయినట్టేనని తెలుస్తోంది. అయితే ఫౌజీ రిజల్ట్‌ను బట్టి ఈ ప్రాజెక్ట్ ఉంటుందా?, ఉండదా? అనేది డిసైడ్ కానుంది.



# నాగచైతన్య ఎన్‌సి 24 మూవీ ఫస్ట్‌లుక్ పోస్టర్

**మహేశ్‌బాబు చేతుల మీదుగా నేడు విడుదల**

టాకీస్: అక్కినేని నాగ చైతన్య విరూపాక్ష డైరెక్టర్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో నటిస్తోన్న చిత్రం ఎన్‌సి24. ఈ మూవీలో మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. మైథలాజికల్ థ్రిల్లర్ జోనర్‌లో వస్తోన్న ఈ మూవీ నుంచి ఇటీవలే బీటీఎస్ వీడియోను షేర్ చేస్తూ.. ఈ మూవీ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నవంబర్ 23న లాంచ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు స్టన్నింగ్ లుక్‌తో క్రేజీ వార్తను షేర్ చేశారు మేకర్స్.ఎన్‌సీ 24 ఫస్ట్ లుక్‌ను టాలీవుడ్ స్టార్ యాక్టర్ మహేశ్ బాబు లాంచ్ చేయనున్నాడు. నవంబర్ 23న ఆదివారం నాగచైతన్య బర్త్ డే సందర్భంగా ఉదయం 10:08 గంటలకు ఎన్‌సీ 24 టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను లాంచ్ చేయనున్నాడని తెలియజేస్తూ స్పెషల్ లుక్ ఒకటి విడుదల చేశారు. వారణాసి పోస్టర్‌లో చైతూను మహేశ్‌బాబుతో కలిసి డిజైన్ చేసిన పోస్టర్ షేర్ చేయగా నెట్టింట వైరల్ అవుతోంది.

# ఆస్కార్ ఎంట్రీ పొందిన హోమ్‌బౌండ్

**టాకీస్:** ఆస్కార్ 2026' కు భారత్ తరపున అధికారిక ఎంట్రీ పొందిన చిత్రం 'హోమ్‌బౌండ్'. 'ది బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్' విభాగంలో సెలెక్ట్ అయిన ఈ సినిమాలో ఇషాన్ ఖట్టర్ , విశాల్ జెత్వా, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రధారులు. సెప్టెంబరులో థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ప్రస్తుతం ఓటీటీ 'నెట్‌ఫ్లిక్స్' లో స్ట్రీమింగ్ అవుతోంది. 23 చిత్రాలను వెనక్కినెట్టి అకాడమీ అవార్డుకు ఎంట్రీ పొందిన 'హోమ్‌బౌండ్'లో ఏముందన్నది చర్చిస్తున్నారు. అది ఉత్తరాదిలోని ఓ గ్రామం. చందన్ కుమార్ (విశాల్ జెత్వా), మహ్మద్ షోయబ్ (ఇషాన్ ఖట్టర్) మంచి స్నేహితులు. వేర్వేరు సామాజిక వర్గాలు, మతాలకు చెందిన వారు సమాజంలో అవమానాలకు గురవుతుంటారు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించి, తమకంటూ గుర్తింపు పొందేందుకు ప్రయత్నాలు మొదలుపెడతారు. పోలీసు కావడమే ఇద్దరి లక్ష్యం. అలా కానిస్టేబుల్ పరీక్ష రాసినా.. ఫలితాల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో షోయబ్ ఓ కంపెనీలో ఆఫీస్ బాయ్‌గా చేరతాడు. చందన్ డిగ్రీ చదివేందుకు.. తాను ఇష్టపడిన సుధా భారతి (జాన్వీ కపూర్) చదివే




కాలేజీలో జాయిన్ అవుతాడు. ఆ తర్వాత ఊహించని రీతిలో చందన్, షోయబ్ మధ్య మనస్పర్థలొస్తాయి. దానికి కారణమేంటన్నదే కథ. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన సినిమా ఇది. స్నేహం, వివక్ష, ప్రభుత్వ ఉద్యోగానికి ఉండే పోటీ, కొవిడ్ కష్టాలు.. ఇలా పలు పార్శ్వాలతో కూడిన ఈ కథను ఎవరే కోణంలో చూస్తే అదే ప్రధానాంశంగా అనిపిస్తుంది. నెమ్మదిగా సాగినా ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతుంది. స్నేహితులైన చందన్, షోయబ్‌ల లక్ష్యమేంటన్నది ప్రారంభంలోనే అర్థమవుతుంది. ప్రభుత్వ ఉద్యోగానికి ఉండే తీవ్ర పోటీ, పరీక్ష రాసినా ఫలితం తేలకపోతే అభ్యర్థులు పడే మనోవేదన ఒకవేళ పరీక్షలన్నింటిలో పాస్ అయినా పోస్టింగ్ ఆలస్యం కావడం, చివరకు సర్కారు కొలువుపై ఆశలు వదులుకుని ఏదో ఒక పనిలో చేరడం.. ఇలా మన చుట్టూ జరిగిన, జరుగుతున్న వాటిని కళ్లకు కడుతూ కథలోకి లీనమయ్యేలా చేశారు దర్శకుడు. చందన్ పాత్ర కోణంలో కుల వివక్ష, షోయబ్ పాత్ర వైపు నుంచి మతపరమైన ఇబ్బందులే ప్రధానాంశాలు. స్నేహితుల మధ్య గొడవ జరిగినప్పటి నుంచి స్టోరీ ఎమోషనల్‌గా సాగుతుంది. ఇషాన్, విశాల్ ఒకరికొకరు పోటీ పడి నటించారు.

# తేజస్ దుర్ఘటన.. పైలట్‌కు వాయుసేన నివాళులు

దుబాయ్, నవంబర్ 22 : దుబాయ్ ఎయిర్‌షోలో భారత వాయుసేనకు చెందిన తేజస్ యుద్ధ విమానం కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో వింగ్ కమాండర్ నమాంశ్ స్యాల్ ప్రాణాలు కోల్పోయారు. ఆయన భౌతిక కాయానికి భారత రాయబార కార్యాలయ సిబ్బంది, యూఏఈ అధికారులు తదితరులు నివాళులు అర్పించారు. దీనికి సంబంధించిన దృశ్యాలను 'ఎక్స్'లో పోస్ట్ చేసిన వాయుసేన.. ఆయన్ను అంకితభావం కలిగిన పైలట్‌గా పేర్కొంది. అసాధారణ నైపుణ్యాలు, నిబద్ధతతో దేశానికి సేవలు అందించినట్లు గుర్తుచేసుకుంది. ''వింగ్ కమాండర్ నమాంశ్ స్యాల్ మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నాం. ఆయన అంకితభావం కలిగిన యుద్ధ పైలట్. పూర్తి ప్రొఫెషనల్. అచంచలమైన నిబద్ధత, అసాధారణ నైపుణ్యాలు, రాజీపడని కర్తవ్య భావనతో దేశానికి సేవలు అందించారు. గొప్ప వ్యక్తిత్వం ఆయనకు గౌరవాన్ని తెచ్చిపెట్టింది. ఈ దుఃఖ సమయంలో స్యాల్ కుటుంబానికి సంఘీభావం తెలియజేస్తున్నాం. ఆయన ధైర్యసాహసాలు, దేశానికి అందించిన సేవలను



గౌరవిస్తున్నాం'' అని వాయుసేన పేర్కొంది. పైలట్ నమాంశ్ స్వస్థలం హిమాచల్ ప్రదేశ్‌లోని నగ్రోటా భగవాన్ పట్టణం. ఆయన భార్య అఫ్సానా సైతం భారత వాయుసేనలో పైలట్‌గా పనిచేస్తున్నారు. వారికి ఒక కుమార్తె ఉంది. ఈ ప్రమాదంపై ఐఏఎఫ్ ఇప్పటికే విచారణకు ఆదేశించింది. స్వదేశీ పరిజ్ఞానంతో భారత్ రూపొందించిన తేజస్ కూలిపోవడం ఇది రెండోసారి. గత ఏడాది మార్చి 12న రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో 'భారత్ శక్తి' విన్యాసాలు జరిగే సమయంలో తొలిసారిగా ఈ జెట్ కూలింది.

## శబరిమలకు భక్తుల రద్దీ..
### తొలి వారంలో 5.75 లక్షల మంది దర్శనం

మండల మకరవిలక్కు వార్షిక తీర్థయాత్ర నేపథ్యంలో కేరళలోని శబరిమల అయ్యప్ప క్షేత్రానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. తొలి వారంలో 5.75 లక్షల మంది స్వామిని దర్శించుకున్నట్లు అధికారులు ప్రకటించారు. శనివారం ఒక్కరోజే సాయంత్రం 7 గంటల సమయానికి 72 వేలమందికిపైగా భక్తులు సన్నిధానానికి చేరుకున్నట్లు వెల్లడించారు. ''భక్తజన ప్రవాహం కొనసాగుతోంది. అడపాదడపా వర్షం కురుస్తున్నప్పటికీ.. తీర్థయాత్రపై ఎలాంటి ప్రభావం లేదు. సజావుగా స్వామి దర్శనం లభించేలా అన్ని ఏర్పాట్లు చేశాం. క్యూ షెల్టర్ వద్ద పెద్దగా



వేచి చూడాల్సిన అవసరం లేకుండా.. పవిత్రమైన 18 మెట్లు ఎక్కారు'' అని అధికారులు తెలిపారు. మరోవైపు.. ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) అధికారులతో మంత్రి వీఎన్ వాసవన్ సమావేశమయ్యారు. రద్దీ నిర్వహణ, ఏర్పాట్లను సమీక్షించారు. యాత్ర ప్రారంభంలో శబరిమలకు పెద్దఎత్తున భక్తులు పోటెత్తిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రద్దీ నిర్వహణను మెరుగుపరచాలని కేరళ హైకోర్టు ఇటీవల ఆదేశించింది. తొలుత స్పాట్ బుకింగ్‌లను రోజుకు ఐదువేలకు పరిమితం చేసింది. భక్తుల రాక ఆధారంగా ఈ సంఖ్యలో సర్దుబాటుకు శుక్రవారం అనుమతించింది.

## గంగా జలాలు సేకరిస్తూ.. 24 ఏళ్లుగా నిల్వ చేస్తూ!

ఉత్తరకాశీ: స్టాంపుల సేకరణ, నాణేల కలెక్షన్.. కొంతమందికి ఇలా ఒక్కో హాబీ ఉంటుంది. ఉత్తరాఖండ్‌కు చెందిన హోటల్ నిర్వాహకుడు అరవింద్ కుడియాల్..గంగాజలం సేకరించడాన్ని తన అభిరుచిగా మలచుకున్నారు. గత 24 ఏళ్లుగా ప్లాస్టిక్ డబ్బాల్లో ఆ పవిత్ర జలాలను నిల్వచేస్తున్నారు. ప్రతి దానిపై తేదీ తదితర వివరాలు నమోదు చేసి, ఉత్తరకాశీలోని తన హోటల్ రిసెప్షన్‌లో ఉంచారు. గంగమ్మ పట్ల విశ్వాసం, భక్తి అనేవి తన తండ్రి దివంగత దర్శన్‌లాల్ కుడియాల్ నుంచి వచ్చాయని తెలిపారు. 2002 నుంచి ఈ ఏడాది వరకు ఏటా అక్షయ తృతీయ సందర్భంగా గంగోత్రి వెళ్లి గంగా నదీ జలాలను సేకరించినట్లు చెప్పారు. మతపరమైన ఆచారాల కోసం ఎవరైనా ఈ నీళ్లను అడిగితే అందజేస్తుంటానని తెలిపారు. మానస సరోవరం, లద్దాఖ్‌లోని పాంగాంగ్ సరస్సు, గంగా సాగర్, అమృత్‌సర్, బద్రీనాథ్, పంచ జ్యోతిర్లింగాలు, రామేశ్వరంలోని బావుల నీళ్లు కూడా ఉన్నట్లు వెల్లడించారు. ఒక గుటక గంగా జలంతోనే తన రోజు ప్రారంభమవుతుందని, నీటి నాణ్యత 2002లో ఉన్నట్లే ఇప్పటికీ ఉందన్నారు.



## G20: ప్రమాదపుటంచుల్లో జీ20! మేక్రాన్

దక్షిణాఫ్రికా జోహన్నస్‌బర్గ్ వేదికగా జరుగుతోన్న జీ20 సదస్సులో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయల్ మేక్రాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ సంక్షోభాలను పరిష్కరించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ కూటమి ఉనికి ప్రమాదంలో ఉందన్నారు. జీ20 సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూరంగా ఉండటాన్ని మేక్రాన్ ప్రస్తావించారు. ప్రధాన సంక్షోభాలను పరిష్కరించేందుకు కలిసికట్టుగా పోరాడటంలో కూటమి ఇబ్బంది పడుతోందన్నారు. ఉక్రెయిన్‌ప్రజల సార్వభౌమత్వాన్ని గౌరవించకుండా అక్కడ శాంతి సాధ్యం కాదని మేక్రాన్ పేర్కొన్నారు. మానవతా చట్టం,




ప్రాదేశిక సమగ్రత విషయంలో ఏకాభిప్రాయాన్ని తెచ్చేందుకు జీ20 పోరాడుతోందన్నారు. కొన్ని ప్రాధామ్యాలపై సమష్టిగా కృషి చేయకుంటే జీ20 ప్రమాదంలో పడుతుందని ప్రపంచ నేతలు గుర్తించాలన్నారు. గతంలోనూ ఇటువంటి వ్యాఖ్యలు చేసిన మేక్రాన్.. 'నాటో' కూటమి బ్రెయిన్ డెడ్ అయ్యిందంటూ ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రకు ముందు ఆయన పేర్కొన్న విషయం తెలిసిందే.

**అమెరికా హెచ్చరించినా.. ఉమ్మడి ప్రకటన**

దక్షిణాఫ్రికాలో ప్రారంభమైన జీ20 సదస్సు ఓ ఉమ్మడి ప్రకటనను ఆమోదించింది. దీన్ని వ్యతిరేకిస్తూ అమెరికా హెచ్చరికలు చేసినా.. సభ్యదేశాలు ముందుకే వెళ్లాయి. సాధారణంగా సదస్సు చివరలో ఈ తీర్మానానికి ఆమోదం తెలుపుతుండగా.. ఈసారి మాత్రం ప్రారంభ సమావేశంలోనే ఇందుకు ఆమోద ముద్ర పడింది. అయితే, అమెరికా ఈ సదస్సుల్లో పాల్గొన్నా, పాల్గొనకపోయినా జీ20 మాత్రం కొనసాగుతుందని దక్షిణాఫ్రికా అంతర్జాతీయ వ్యవహారాలశాఖ మంత్రి రొనాల్డ్ లమోలా పేర్కొన్నారు.

## త్వరలో.. కర్ణాటక ప్రభుత్వంలో కల్లోలం




**: కేంద్ర మంత్రి కుమారస్వామి**


కర్ణాటక రాజకీయాల్లో మరికొన్ని రోజుల్లో కీలక పరిణామాలు చోటు చేసుకోనున్నాయని కేంద్ర మంత్రి కుమారస్వామి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీలో కల్లోలం జరగనుందని జోస్యం చెప్పారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య అధికార పోరు కొనసాగుతున్న వేళ కేంద్రమంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ''రాజకీయాల్లో ఎవరు, ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో తెలియని పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది. రాష్ట్ర రాజకీయాల్లో ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటాయి. కాంగ్రెస్ పార్టీ అంతర్గతంగా తీవ్ర గందర గోళంలో ఉంది. మరికొన్ని నెలల్లో అనూహ్య పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులకు దారితీయవచ్చు'' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. బెంగళూరులో జేడీఎస్ రజతోత్సవ వేడుకల్లో కుమారస్వామి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనపై విరుచుకుపడ్డారు. ఆర్థిక దుర్వినియోగం, అవినీతి, రాజకీయ మోసానికి పాల్పడుతుందని విమర్శించారు. ప్రభుత్వం నిత్యవసర ధరలు, పన్నుల పెంపుతో ప్రజలు విసిగిపోయారని, జేడీఎస్‌కు ఓ అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు మెరుగైన పాలన అందించకపోతే జీవితంలో తన ముఖాన్ని చూపించనని కుమారస్వామి పేర్కొన్నారు. కర్ణాటక ప్రభుత్వ రుణాలు రూ.7.5లక్షల కోట్లు దాటాయని, అందులో సిద్ధరామయ్య ఒక్కరే రూ.5 నుంచి 5.5లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. అన్ని రుణాలు ఎందుకు తీసుకున్నారో ప్రజలకు ఆయన సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

## మీరు ఓట్లేయకపోతే.. నేనూ నిధులు ఇవ్వను: అజిత్ పవార్

ఓటర్లను ఉద్దేశించి మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఎన్నికల్లో తమ పార్టీ (NCP) అభ్యర్థులను తిరస్కరిస్తే.. నిధుల కేటాయింపు విషయంలో తానూ అదే పనిచేస్తానని వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బారామతిలో నిర్వహించిన ప్రచారంలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. ''స్థానికంగా ఎన్సీపీకి చెందిన 18 మంది అభ్యర్థులను గెలిపిస్తే.. ఈ ప్రాంత అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూస్తాను. హామీలను నెరవేర్చే విషయానికి కట్టుబడి ఉన్నాను. మీ దగ్గర ఓట్లు ఉన్నాయి. నా దగ్గర నిధులు ఉన్నాయి. మీరు తిరస్కరిస్తే.. నేను కూడా తిరస్కరిస్తా'' అని అజిత్ పవార్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి కూడా ఆయనే కావడం గమనార్హం. అజిత్ పవార్ వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఆయన ఓటర్లపై బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ ఆరోపించాయి. ''నిధులు అనేవి సామాన్య ప్రజలు కట్టిన పన్నుల నుంచి విడుదల చేస్తుంటారు. అజిత్ పవార్ ఇంటి నుంచి ఇవ్వరు. ఆయన ఓటర్లను బెదిరిస్తుంటే.. ఎన్నికల సంఘం ఏం చేస్తోంది?'' అని శివసేన (యూబీటీ) నేత అంబాదాస్ ధన్వే ప్రశ్నించారు.




## నమో భారత్ రైలులో పుట్టినరోజు వేడుకలు.. ప్రీ-వెడ్డింగ్ షూట్‌లు



ఢిల్లీ: నమో భారత్ రైళ్లు ప్రైవేటు వేడుకలకు వేదికలుగా మారనున్నాయి. పుట్టినరోజులు, పెళ్లికి ముందు చేసే ఫొటోషూట్‌లు, ఇతర ప్రైవేట్ కార్యక్రమాలకు రైలు బోగీలను అద్దెకు తీసుకునేందుకు 'నేషనల్ క్యాపిటల్ రీజియన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్' కీలక నిర్ణయం తీసుకుంది. వ్యక్తులు, ఈవెంట్ ఆర్గనైజర్లు, ఫొటోగ్రఫీ సంస్థలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు. ఈ విధానంలో భాగంగా స్టేషన్లలో నిలిపి ఉంచిన లేదా కదులుతున్న నమో భారత్ రైలు బోగీలను అద్దెకు తీసుకోవచ్చు. దుహాయ్ డిపో వద్ద ఒక నమూనా బోగీని అలంకరించి ఎప్పుడూ అందుబాటులో ఉంచుతారు. వీటి బుకింగ్‌కు గంటకు రూ.5,000గా నిర్ణయించారు. వేడుకకు అవసరమైన డెకరేషన్ సామాగ్రి సెట్ చేసుకునేందుకు 30 నిమిషాల సమయం అదనంగా ఇస్తారు. ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల మధ్య మాత్రమే అనుమతి ఉంటుంది. సాధారణ రైలు కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం కలిగించకూడదు. ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా చూసుకోవాలి. ఈ వేడుకలు NCRTC ఉద్యోగులు, భద్రతా సిబ్బంది పర్యవేక్షణలోనే జరుగుతాయి. దిల్లీ-మేరఠ్ కారిడార్‌లోని ఆనంద్ విహార్, గాజియాబాద్, మేరఠ్ సౌత్ స్టేషన్లలో ఈ సౌకర్యం చాలా మందిని ఆకర్షిస్తుందని ఆశిస్తున్నారు. సినిమా షూట్‌లు, డాక్యుమెంటరీలు, ప్రకటనలు ఇంకా ఇతర విజువల్ ప్రాజెక్ట్‌ల కోసం నమో భారత్ రైళ్లు, స్టేషన్లను అద్దెకు తీసుకునేందుకు NCRTC మరో విధానాన్ని రూపొందించింది.

## సీఎం మార్పు వార్తలు..
## వారిని కలిసేందుకే జైలుకెళ్లిన డీకే: కేంద్రమంత్రి

బెంగళూరు: కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై జోరుగా ఊహాగానాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పై తీవ్ర ఆరోపణలు చేశారు. డీకే, సిద్ధరామయ్య ఇద్దరూ తమ బలాలను నిరూపించుకోవడానికి ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడంలో మునిగిపోయారని అన్నారు. అందులో భాగంగానే డీకే శుక్రవారం బెంగళూరు సెంట్రల్ జైలుకు వెళ్లి.. అక్కడున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వినయ్ కులకర్ణి, వీరేంద్ర పప్పీని కలిశారన్నారు. సీఎం పీఠం దక్కాలంటే ఎమ్మెల్యేల మద్దతు ఉండాలి కాబట్టి.. ఇన్ని రోజులు వారిని కలవని ఉపముఖ్యమంత్రి ఇప్పుడు జైలుకెళ్లి మరీ పలకరించారని



జోషి అన్నారు. ''ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను రాజీనామా చేయాలని అడిగినప్పుడల్లా ఆయన ఎమ్మెల్యేలలో ఎంత మద్దతుందని శివకుమార్‌ను అడుగుతున్నారు. సీఎం పదవికి ఓటు వేసే సందర్భంలో ఎమ్మెల్యేల మద్దతు ఉపయోగపడుతుంది. అందుకే డీకే ఎక్కువమంది ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాలలో బిజీగా ఉన్నారు'' అని ప్రహ్లాద్ జోషి అన్నారు. ఆయన మాటలపై శివకుమార్ మద్దతుదారు, కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్.సి. బాలకృష్ణ స్పందిస్తూ..డీకేకు తన సొంత బలం, సామర్థ్యాలు ఉన్నాయన్నారు. తనకున్న మద్దతును దిల్లీలో ప్రదర్శించడం లేదా గొడవలు సృష్టించడం వంటి అవసరం శివకుమార్‌కు లేదని.. ముఖ్యమంత్రి విషయంలో పార్టీ హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని ఎమ్మెల్యే బాలకృష్ణ పేర్కొన్నారు. సీఎం పదవి కోసం ఆయన ఏ ఎమ్మెల్యేనూ మద్దతు అడగలేదన్నారు. కాగా ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి శుక్రవారం బెంగళూరులో వచ్చిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే రాష్ట్ర రాజధానిలోనే ఉన్నారు. నేడు ఆయన సిద్ధరామయ్య, శివకుమార్‌లతో భేటీ కానున్నట్లు తెలుస్తోంది.

## సత్యసాయి సిద్ధాంతానికి టెక్నాలజీ జోడింపు...

# 2047 నాటికి భారత్ నంబర్ వన్: చంద్రబాబు




అమరావతి, నవంబర్ 22 (భారత శక్తి): 2047 నాటికి భారత్‌ను ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా నిలపడమే లక్ష్యమని, శ్రీ సత్యసాయి అందించిన మానవతా విలువలకు ఆధునిక సాంకేతికతను జోడించి ఈ లక్ష్యాన్ని సాధిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పట్టభద్రులైన విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విలువల ఆధారిత విద్య, వ్యక్తిత్వ నిర్మాణమే కేంద్రంగా పనిచేస్తున్న సత్యసాయి విద్యాసంస్థ స్నాతకోత్సవంలో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నానని చంద్రబాబు అన్నారు. “భగవాన్ బాబా అందించిన విశిష్ట విద్యా విధానానికి ఇక్కడి విద్యార్థులే ప్రతిరూపాలు. క్రమశిక్షణ, ప్రేమ, సేవ అనేవే విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ భాషలని బాబా చెప్పారు. ఆయన మన కోసం ‘సాయి సిద్ధాంతాన్ని’ ఇచ్చి వెళ్లారు. ఈ సిద్ధాంతాన్ని ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలి” అని పిలుపునిచ్చారు. సత్యం, కరుణ, నిజాయతీ వంటి విలువలను ఆచరిస్తూ సమాజ సేవ చేయాలని పట్టభద్రులకు సూచించారు. భారతదేశం సాధిస్తున్న ప్రగతిని వివరిస్తూ, 1991 ఆర్థిక సంస్కరణలు, 1990లలో వచ్చిన సాంకేతిక పురోగతి దేశాన్ని మార్చేశాయని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం 10వ స్థానం నుంచి 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని గుర్తుచేశారు. “2047 నాటికి ప్రపంచంలోనే నంబర్ వన్ దేశంగా అవతరిస్తాం. దీనికోసం కృత్రిమ మేధ (AI), డేటా సెంటర్లు, క్వాంటం, ఏరోస్పేస్, సెమీకండక్టర్ వంటి భవిష్యత్ రంగాలపై దృష్టి సారిస్తున్నాం” అని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలను వివరిస్తూ, “దేశంలో ఉన్న అన్ని ఫ్యూచర్ టెక్నాలజీలను ఏపీకి తీసుకొస్తున్నాం. సీఐఐ సదస్సు ద్వారా రూ. 13.25 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాం, దీనివల్ల 16 లక్షల ఉద్యోగాలు రానున్నాయి. గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో రాష్ట్రంలో డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది” అని ప్రకటించారు. “ఒక కుటుంబంఒక పారిశ్రామికవేత్త, ఒక కుటుంబం ఒక ఏఐ టెక్నీషియన్” అనే సిద్ధాంతంతో పనిచేస్తున్నామని, దేశంలో తెలుగు వారిని నంబర్ వన్ గా నిలపాలన్నదే తన ఆకాంక్ష అని స్పష్టం చేశారు. యువతే దేశానికి సంరక్షకులని, ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో విలువలను పాటిస్తూ ముందుకు సాగాలని చంద్రబాబు ఉద్బోధించారు. బాబా స్ఫూర్తితో ఆరోగ్యవంతమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజాన్ని (హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీ) నిర్మించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ వంటి ప్రముఖులు పాల్గొనడం సత్యసాయి బాబా గొప్పతనానికి నిదర్శనమని కొనియాడారు.

## సత్యసాయి యూనివర్సిటీ ప్రత్యేకత అదే!: మంత్రి నారా లోకేశ్

అమరావతి, నవంబర్ 22 (భారత శక్తి): విలువలతో కూడిన విద్యను అందించడమే శ్రీ సత్యసాయి యూనివర్సిటీ ప్రత్యేకత అని, ఇదొక ఆధునిక గురుకులం అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రశంసించారు. రాయలసీమ గడ్డ ధైర్యానికి, త్యాగానికి, ఆధ్యాత్మికతకు ప్రతీక అని ఆయన అభివర్ణించారు. శనివారం శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవ కార్యక్రమం ప్రశాంతి నిలయంలోని పూర్ణచంద్ర ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గౌరవ అతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు.

*** బాబా ప్రేమ, కరుణకు నిలయం ప్రశాంతి నిలయం**

ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నానని లోకేశ్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. “పుట్టపర్తిని సందర్శించే ప్రతి హృదయంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ప్రేమ, కరుణ, ఆధ్యాత్మిక శక్తి ప్రకాశిస్తుంది. ఆయన అందించిన సేవలు దేశంలోని మారుమూల ప్రాంతాలకు సైతం చేరాయి. ఎన్నో గ్రామాలకు తాగునీటి సరఫరా కార్యక్రమాలు, వేలాది మందికి ఉచిత వైద్య సేవలు అందించడమే కాకుండా, లక్షలాది మందికి దైవిక అనుభూతిని పంచారు” అని లోకేశ్ గుర్తుచేశారు.

**రాయలసీమ ధైర్యానికి ప్రతీక**

రాయలసీమ పవిత్ర భూమి అని, ఈ నేల ధైర్యం, నిరాడంబరత, త్యాగానికి ప్రతీకగా నిలుస్తుందని మంత్రి అన్నారు. “ప్రపంచానికి ఆధ్యాత్మిక కిరణంగా నిలిచిన భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ఈ గడ్డపైనే జన్మించారు. ఆయన దార్శనికత, కరుణ ఈ విశ్వవిద్యాలయానికే కాకుండా యావత్ ప్రపంచానికే మార్గనిర్దేశం చేస్తూనే ఉన్నాయి. ఈ పవిత్ర మట్టిలోనే ఆధ్యాత్మికత, నిరాడంబరత, త్యాగం వంటి గుణాలు నిండి ఉన్నాయి” అని వివరించారు. ఈ విశ్వవిద్యాలయం బాబా దార్శనికతకు నిలువుటద్దమని, ఇదొక ఆధునిక గురుకులమని కొనియాడారు. ఇక్కడి విద్యార్థులు కేవలం అర్హతలతో కాకుండా ఉన్నతమైన వ్యక్తిత్వంతో పట్టభద్రులు అవుతున్నారని, కేవలం నైపుణ్యంతో కాకుండా ఒక ప్రయోజనంతో పనిచేసే వృత్తి నిపుణులుగా ఎదుగుతున్నారని ప్రశంసించారు.

*** వికసిత్ భారత్‌కు సత్యసాయి వర్సిటీ వంటి సంస్థలు అవసరం**

భారతదేశం నేడు కీలకమైన మార్పు దిశగా అడుగులు వేస్తోందని, ‘వికసిత్ భారత్’ లక్ష్య సాధనకు కేవలం మేధావులు సరిపోరని, స్థిరమైన, బలమైన, సేవాభావం కలిగిన వారిని తీర్చిదిద్దే విద్యాసంస్థలు అవసరమని లోకేశ్ అభిప్రాయపడ్డారు. శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ అలాంటి సంస్థలలో అగ్రగామిగా ఉందని పేర్కొన్నారు. విలువలతో కూడిన విద్య, బహుళ రంగాలపై అవగాహన, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం, సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు, క్రమశిక్షణతో కూడిన క్యాంపస్ జీవితం ఈ సంస్థ ప్రత్యేకతలని అన్నారు. జాతీయ విద్యా విధానం 2020కి ఈ సంస్థ పూర్తిగా అనుగుణంగా నడుస్తోందని, ఇది కేవలం విద్యా సంస్థ మాత్రమే కాదని, దేశానికి ఒక నైతిక ప్రమాణమని కొనియాడారు.

**యువత రాజకీయాల్లోకి రావాలి**

ఈ సందర్భంగా పట్టభద్రులకు మంత్రి లోకేశ్ ప్రత్యేక సందేశం ఇచ్చారు. “మీరు కేవలం డిగ్రీతో ప్రపంచంలోకి అడుగుపెట్టడం లేదు. బాబా ప్రేమ, దైవానుగ్రహం, రాయలసీమ నిజాయతీ, మీ గురువుల నమ్మకం, భారతదేశ ఆకాంక్షలను మీ భుజాలపై మోసుకెళ్తున్నారు. మీరు ఎక్కడికి వెళ్లినా బాబా ప్రవచించిన ‘లవ్ ఆల్, సర్వ్ ఆల్’, ‘హెల్ప్ ఎవర్, హర్ట్ నెవర్‘ అనే సూక్తులను జీవితంలో భాగం చేసుకోవాలి. మీరు ఎప్పటికీ ఈ పవిత్ర విశ్వవిద్యాలయానికి రాయబారులుగా నిలవాలి” అని పిలుపునిచ్చారు. యువత రాజకీయాల్లోకి వచ్చి బలమైన భారతదేశాన్ని నిర్మించాలని ఆయన కోరారు. అంతకుముందు, స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు ప్రశాంతి నిలయానికి చేరుకున్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సాయి కుల్వంత్ మందిరంలోని భగవాన్ శ్రీ సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన వివిధ కోర్సుల్లో టాపర్లుగా నిలిచిన గ్రాడ్యుయేట్లకు బంగారు పతకాలను ప్రదానం చేశారు.

## జీ20 వేదికగా ప్రధాని మోదీ 4 కీలక ప్రతిపాదనలు

ఢిల్లీ, నవంబర్ 22 (భారత శక్తి): దక్షిణాఫ్రికాలోని జొహాన్నెస్‌బర్గ్‌లో శనివారం ప్రారంభమైన జీ20 దేశాధినేతల శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచానికి సరికొత్త మార్గాన్ని నిర్దేశించారు. ప్రారంభ సెషన్‌లో ప్రసంగించిన ఆయన.. ప్రపంచ అభివృద్ధి ప్రమాణాలను పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. సమ్మిళిత, సుస్థిర వృద్ధి లక్ష్యంగా పలు కీలకమైన, వినూత్నమైన నాలుగు కార్యక్రమాలను ప్రతిపాదించారు. ఆఫ్రికా ఖండం తొలిసారిగా జీ20 సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్న తరుణంలో, అభివృద్ధికి కొత్త నిర్వచనం ఇవ్వడానికి ఇదే సరైన సమయమని ఆయన అభిప్రాయపడ్డారు. ‘సమ్మిళిత, సుస్థిర ఆర్థిక వృద్ధి’ అనే అంశంపై జరిగిన ఈ సెషన్‌లో మోదీ మాట్లాడుతూ, భారతదేశపు ప్రాచీన నాగరికతా విలువలు, ముఖ్యంగా ఏకాత్మ మానవతావాదం ప్రపంచానికి ఒక మార్గాన్ని చూపగలవని అన్నారు. అనంతరం తన ప్రసంగంలోని ముఖ్యాంశాలను ‘ఎక్స్’ వేదికగా పంచుకున్నారు.

**నాలుగు ప్రతిపాదనలు ఇవే...!**

ప్రపంచ అభివృద్ధికి సంబంధించి నాలుగు వినూత్నమైన ప్రతిపాదనలను ఆయన ప్రపంచ దేశాల ముందు ఉంచారు. ప్రపంచ అభివృద్ధి పారామీటర్లను పునఃసమీక్షించి, సమ్మిళిత, సుస్థిర వృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయం ఇదేనని మోదీ పిలుపునిచ్చారు. మొదటి ప్రతిపాదనగా, జీ20 ఆధ్వర్యంలో ‘గ్లోబల్ ట్రెడిషనల్ నాలెడ్జ్ రిపాజిటరీ’ని ఏర్పాటు చేయాలని మోదీ సూచించారు. పర్యావరణ అనుకూల, సాంస్కృతిక జీవన విధానాలను పరిరక్షించే సాంప్రదాయ విజ్ఞానాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని వివరించారు. దీనికి భారతీయ విజ్ఞాన వ్యవస్థ ప్రాతిపదికగా నిలుస్తుందని తెలిపారు. రెండో కీలక ప్రతిపాదనగా, ఆఫ్రికా అభివృద్ధికి ‘జీ20 ఆఫ్రికా స్కిల్స్ మల్టిప్లయర్ ఇనిషియేటివ్’ను ప్రధాని ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా రాబోయే దశాబ్దంలో ఆఫ్రికాలో 10 లక్షల మంది సర్టిఫైడ్ శిక్షకులను తయారు చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రపంచ పురోగతికి ఆఫ్రికా అభివృద్ధి చాలా కీలకమని ఆయన స్పష్టం చేశారు. అలాగే, డ్రగ్స్‌టెర్రర్ సంబంధాలను ఎదుర్కోవడంపై మరో ముఖ్యమైన ప్రతిపాదన చేశారు. ఫెంటానిల్ వంటి ప్రమాదకరమైన సింథటిక్ డ్రగ్స్ వ్యాప్తిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ అక్రమ రవాణాను అడ్డుకోవడానికి, ఉగ్రవాదానికి నిధులు అందకుండా చేయడానికి జీ20 దేశాలన్నీ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. చివరగా, ‘జీ20 గ్లోబల్ హెల్త్‌కేర్ రెస్పాన్స్ టీమ్’ను ఏర్పాటు చేయాలని మోదీ సూచించారు. ఆరోగ్య అత్యవసర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో వేగంగా స్పందించేందుకు జీ20 దేశాల వైద్య నిపుణులతో ఈ బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆయన అభిప్రాయపడ్డారు.

## తెలంగాణ ప్రజలు ఎంత అమాయకంగా కనిపిస్తారో

# అంతటి చైతన్యవంతులు: రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 22 (భారత శక్తి): తెలంగాణ ప్రజలు చూడటానికి ఎంత అమాయకంగా కనిపిస్తారో, అంతటి చైతన్యవంతులని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన ప్రముఖ రచయిత అందెశ్రీ సంతాప సభలో ఆయన ప్రసంగిస్తూ, తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవులు, కళాకారులు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. వారిచ్చిన స్ఫూర్తితోనే తెలంగాణ కల సాకారమైందని ఆయన అన్నారు. అందెశ్రీ ఎన్నడూ బడికి వెళ్ళకపోయినా ‘జయజయహే తెలంగాణ’ వంటి అద్భుతమైన గేయాన్ని రచించారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమం సమయంలో అందెశ్రీ పాట లేని సభ ఒక్కటి కూడా జరగలేదని ఆయన అన్నారు. గతంలో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వారిని విస్మరించే ప్రయత్నం జరిగిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కవి రాసే పెన్నులపై మన్ను కప్పితే, అవి గన్నులై మొలకెత్తుతాయని, మీ గడీలను కూల్చివేస్తాయని ఆయన హెచ్చరించారు. తెలంగాణ గడ్డపై ప్రజలు అహంకారాన్ని, ఆధిపత్యాన్ని ఏ పరిస్థితుల్లోనూ సహించరని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎన్ని వజ్రాలున్నా కోహినూర్ వజ్రం ప్రత్యేకమైన విధంగానే, కవులు ఎంతమంది ఉన్నా అందెశ్రీ ప్రత్యేకమని రేవంత్ రెడ్డి అన్నారు.

## మిస్ యూనివర్స్ 2025పై వివాదం...

# విజేతను ముందే ఫిక్స్ చేశారన్న జడ్జి!

మెక్సికో, నవంబర్ 22 : మిస్ యూనివర్స్ 2025 పోటీలు తీవ్ర వివాదంలో చిక్కుకున్నాయి. మెక్సికోకు చెందిన ఫాతిమా బోష్ విజేతగా నిలిచిన కొద్ది గంటల్లోనే, పోటీల న్యాయనిర్ణేతల్లో ఒకరైన ఒమర్ హర్ఫౌచ్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ పోటీల్లో రిగ్గింగ్ జరిగిందని, విజేతను ముందుగానే నిర్ణయించారని ఆయన ఆరోపించారు. మిస్ యూనివర్స్ యజమాని రౌల్ రోచాకు, విజేత ఫాతిమా తండ్రికి మధ్య ఉన్న వ్యాపార ఒప్పందాల కారణంగానే ఆమెను గెలిపించారని బాంబు పేల్చారు. “మిస్ మెక్సికో ఒక ఫేక్ విన్నర్” అంటూ ఒమర్ హర్ఫౌచ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. పోటీల ఫైనల్‌కు 24 గంటల ముందే తాను ఈ విషయాన్ని ఓ అమెరికన్ ఛానెల్‌కు వెల్లడించానని తెలిపారు. దుబాయ్‌లో జరిగిన సమావేశంలో రౌల్ రోచా, ఆయన కుమారుడు తనను కలిసి, వ్యాపార ప్రయోజనాల కోసం ఫాతిమాకే ఓటు వేయాలని ఒత్తిడి చేశారని ఒమర్ ఆరోపించారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను 2026 మే నెలలో HBO డాక్యుమెంటరీలో బయటపెడతానని ఆయన పేర్కొన్నారు. ఆరోపణలపై మిస్ యూనివర్స్ ఆర్గనైజేషన్ (MUO) అధ్యక్షుడు రౌల్ రోచా స్పందించారు. ఒమర్‌ను తాము న్యాయనిర్ణేతల ప్యానెల్ నుంచి తొలగించామని, ఆయన రాజీనామా చేయలేదని స్పష్టం చేశారు. ఒమర్ ఆరోపణలు సంస్థ చేపట్టిన ‘బియాండ్ ది క్రౌన్’ అనే ఛారిటీ కార్యక్రమానికి నష్టం కలిగిస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. మరోవైపు, రోచాతో అవమానకరంగా సంభాషణ జరగడం వల్లే తాను రాజీనామా చేశానని ఒమర్ తెలిపారు. అంతేకాకుండా, ప్రిలిమినరీ రౌండ్లకు ముందే ఒక రహస్య కమిటీ టాప్ 30 ఫైనలిస్టులను ఎంపిక చేసిందని ఆయన ఆరోపించారు. మిస్ యూనివర్స్ ఆర్గనైజేషన్ ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. ఎలాంటి రహస్య కమిటీ లేదని, ఎంపిక ప్రక్రియ మొత్తం పారదర్శకంగా జరుగుతుందని తెలిపింది. ఒమర్ హర్ఫౌచ్‌ను తమ బ్రాండ్‌తో సంబంధం లేకుండా నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం ఈ ఆరోపణలు, ప్రత్యారోపణలతో మిస్ యూనివర్స్ పోటీల ప్రతిష్ఠపై నీలినీడలు కమ్ముకున్నాయి.

## అరటి, పత్తి, మొక్కజొన్న పంటలపై

# సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

అమరావతి, నవంబర్ 22 (భారత శక్తి): రాష్ట్రంలో అరటి, పత్తి, మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టి సారించారు. ధరల పతనం, కొనుగోళ్లలో జాప్యం వంటి అంశాలపై ఆయన అధికారులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించి, రైతులను ఆదుకునేందుకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా రాయలసీమ అరటి రైతులు, రాష్ట్రవ్యాప్తంగా పత్తి, మొక్కజొన్న రైతులు నష్టపోకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

**రైళ్లలో ముంబైకి రాయలసీమ అరటి**

రాయలసీమలో సుమారు 40 వేల హెక్టార్లలో పండుతున్న అరటికి సరైన ధర లభించకపోవడంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. డిసెంబరు మొదటి వారం నుంచి ధరలు పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్పగా, అప్పటివరకు రైతులను నష్టపోనివ్వకూడదని సీఎం స్పష్టం చేశారు. రాయలసీమ అరటిని ముంబై, కలకత్తా వంటి ప్రధాన మార్కెట్లకు రైల్వే వ్యాగన్ల ద్వారా తరలించేందుకు తక్షణమే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇందుకు ఓ ఏజెన్సీ ముందుకు వచ్చిందని అధికారులు తెలపగా, రవాణాకు పటిష్టమైన ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అరటి ధరలు, కొనుగోళ్లపై వ్యాపారులతో ప్రతిరోజూ సమావేశాలు నిర్వహించి, మార్కెట్‌ను నిరంతరం పర్యవేక్షించాలని ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.

*** మొక్కజొన్న, పత్తి రైతులను ఆదుకునేందుకు చర్యలు**

మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోవాల్సిన దుస్థితి నుంచి మొక్కజొన్న రైతులను గట్టెక్కించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ధరల వ్యత్యాసాన్ని ధరల స్థిరీకరణ నిధి ద్వారా చెల్లించే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు.

## ట్రంప్‌ను కలిసిన న్యూయార్క్ మేయర్ మమ్దానీ... శశిథరూర్ ఆసక్తికర పోస్టు

ఢిల్లీ, నవంబర్ 22 (భారత శక్తి) “ప్రజాస్వామ్యం అంటే ఇలాగే ఉండాలి. ఎన్నికల సమయంలో మీ సిద్ధాంతం, భావజాలం కోసం ఎంతవరకైనా పోరాడవచ్చు. కానీ ప్రజల తీర్పు వెలువడిన తర్వాత దేశ ప్రయోజనాల దృష్ట్యా అధికార, ప్రతిపక్షాలు పరస్పరం సహకరించుకోవాలి” అని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దానీ ఇటీవల సమావేశమయ్యారు. ఎన్నికల సమయంలో వీరిద్దరు ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకున్నారు. ఆ తర్వాత వీరు సామరస్యంగా కలవడం విశేషం. వీరి మధ్య జరిగిన స్నేహపూర్వక సమావేశంపై శశిథరూర్ స్పందించారు. ఈ మేరకు ఆయన ‘ఎక్స్’ వేదికగా ఒక పోస్టు చేశారు. ప్రజాస్వామ్యం ఈ విధంగానే పని చేయాలని, ఇలాంటి స్ఫూర్తిని భారతదేశంలో కూడా చూడాలని ఆకాంక్షించారు. ఈ విషయంలో తనవంతు కృషి చేయడానికి ప్రయత్నిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఇటీవల శశిథరూర్ కేంద్ర ప్రభుత్వానికి, నరేంద్ర మోదీకి అనుకూలంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. మోదీని ప్రశంసిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా ఉన్నాయి. దీనిపై కాంగ్రెస్ పార్టీ ఆయన పట్ల తీవ్ర అసంతృప్తితో ఉంది. శశిథరూర్‌కు బీజేపీ భావజాలం నచ్చితే ఇంకా కాంగ్రెస్ పార్టీలో ఎందుకు కొనసాగుతున్నారని కొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికల తర్వాత అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి పనిచేయాలని శశిథరూర్ అభిప్రాయపడ్డారు.

# డీజీపీ ఎదుట లొంగిపోయిన 37 మంది మావోయిస్టులు

హైదరాబాద్, నవంబర్ 22 (భారత శక్తి): తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యల సాంబయ్య అలియాస్ ఆజాద్, నారాయణ అలియాస్ రమేశ్, సోమ్‌దా అలియాస్ ఎర్ర ఉన్నట్లు డీజీపీ వెల్లడించారు. మిగతా 34 మంది మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని తెలిపారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు, తొమ్మిది మంది ప్రాంతీయ కమిటీ సభ్యులు, 22 మంది దళ సభ్యులు ఉన్నట్లు చెప్పారు. అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు వీరంతా జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకొచ్చినట్లు డీజీపీ వెల్లడించారు. లొంగిపోయిన వారంతా తమ ఆయుధాలను కూడా అప్పగించినట్లు తెలిపారు. 37 మందికి తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేలు అందజేశారు. '' ఆజాద్‌పై రూ.20 లక్షలు, అప్పాస్ నారాయణపై రూ.20 లక్షల రివార్డు ఉంది. వీరితోపాటు లొంగిపోయిన మావోయిస్టులందరిపైనా కలిపి మొత్తం రూ.1.41కోట్ల రివార్డు ఉంది. ఆ మొత్తాన్ని వారికే అందజేస్తాం. తెలంగాణకు చెందిన వారికి ప్రభుత్వం ఇస్తున్న పునరావాస ప్యాకేజీ అందిస్తాం.






మిగతావాళ్లు కూడా తొందరగా లొంగిపోవాలని సూచిస్తున్నాం. తెలంగాణకు చెందిన మరో 59 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారు. వారిలో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, పాక హనుమంతు అలియాస్ గణేశ్, బడె చొక్కారావు అలియాస్ దామోదర్ ఉన్నారు. అంతేకాకుండా రాష్ట్ర కమిటీలో 10 మంది ఉన్నారు. వీళ్లంతా వీలైనంత త్వరగా లొంగిపోవాలని సూచిస్తున్నాం'' అని డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు.

## పైరసీ కింగ్‌పిన్ ఐ-బొమ్మ రవికి
## విదేశాల్లో బృందాలు, ఆస్తులపై ఆరా

హైదరాబాద్, నవంబర్ 22 (భారత శక్తి): సినీ రంగాన్ని, పోలీసులను ఆరేళ్లపాటు ముప్పుతిప్పలు పెట్టిన ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి కేసులో పోలీసుల విచారణ మూడో రోజు ముగిసింది. ఐదు రోజుల కస్టడీలో భాగంగా ఇవాళ.. పైరసీ కింగ్ పిన్ రవికి ఏజెంట్లు, గేమింగ్ యాప్‌ల నిర్వాహకులతో ఉన్న సంబంధాలపై ఆరా తీశారు. ఎవరెవరు సహకరిస్తున్నారు, తెర వెనుక ఇంకెంతమంది ఉన్నారనే విషయాలపై ప్రశ్నించారు. సైబర్ నేరాలకు ఐబొమ్మ సైట్‌ను నేరగాళ్లు వేదికగా మలుచుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సినిమాల సేకరణ, సైట్లలో అప్‌లోడ్‌కి సంబంధించిన వివరాలను పోలీసులు అడిగి తెలుసుకున్నారు. విదేశాల్లో బృందాలు, ఆస్తులు, లింకులపై ఆరా తీశారు.



## భారీ భూ కుంభకోణంపై
## భాజపా ఎందుకు స్పందించటం లేదు: హరీశ్‌రావు

హైదరాబాద్, నవంబర్ 22 (భారత శక్తి): పారిశ్రామిక అవసరాల కోసం 50-60 ఏళ్ల కిందట కేటాయించిన భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. '' భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో.. ఆజామాబాద్ పారిశ్రామిక భూములను క్రమబద్ధీకరించినప్పుడు.. ఎస్ఆర్ఓ రేట్ల కంటే 100% నుంచి 200% అధికంగా వసూలు చేయాలని ఒక చట్టం చేశాం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 30 శాతానికే అప్పగించాలని చూస్తోంది. 7 రోజుల్లో దరఖాస్తులు? 7 రోజుల్లో ఆమోదాలు? 45 రోజుల్లో పూర్తి క్రమబద్ధీకరణ? ఎవరికి లాభం చేకూర్చడానికి ఈ వేగవంతమైన




ప్రక్రియ? రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు తీరని నష్టం చేస్తున్నారు. రూ.5లక్షల కోట్లు రావాల్సిన భూములకు కేవలం రూ.5వేల కోట్లు మాత్రమే ఎలా వస్తాయి? రెండు సంవత్సరాల బడ్జెట్‌కు సరిపడా నిధులు వచ్చే నిర్ణయాన్ని ఏకపక్షంగా ఎలా తీసుకుంటారు. మంత్రిమండలి, అసెంబ్లీలో చర్చించకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారు? రూ.లక్షల కోట్ల విలువైన భూములను ఆగమేఘాల మీద ఎలా అప్పగిస్తారు? రెండు నెలల్లోనే ప్రక్రియ అంతా పూర్తి చేయటం వెనుక కుట్ర ఏమిటి? భూములను బహిరంగ మార్కెట్‌లో వేలం వేస్తే.. రూ.5లక్షల కోట్లు వస్తాయి. ప్రభుత్వ అవసరాలకు కూడా భూమి లేకుండా ఎలా విక్రయిస్తున్నారు. కాలుష్య కారక పరిశ్రమలను మాత్రమే ఓఆర్ఆర్ అవతలకు పంపించాలనేది పాలసీ. కానీ, ఈ ప్రభుత్వం గ్రీన్ ఇండస్ట్రీలను కూడా బయటికి పంపిస్తోంది. 9,290 ఎకరాల భూముల ద్వారా కాంగ్రెస్ నేతలు జేబులు నింపుకొంటున్నారు. పరిశ్రమల కోసం ఇచ్చిన భూములను మల్టీపర్పస్ అవసరాలకు ఎలా అనుమతిస్తారు. భారీ కుంభకోణంపై కేంద్రంలోని భాజపా ఎందుకు స్పందించటం లేదు'' అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికల
## రిజర్వేషన్లపై జీవో

హైదరాబాద్, నవంబర్ 22 (భారత శక్తి): గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వం జీవో విడుదలు చేసింది. సర్పంచి, వార్డు సభ్యుల రిజర్వేషన్ల విధివిధానాలు ఖరారు చేస్తూ జీవో ఇచ్చింది. రిజర్వేషన్లు 50 శాతం మించకుండా మార్గదర్శకాలు జారీ చేసింది. కులగణన ఆధారంగా వార్డు సభ్యుల ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. కులగణన ఆధారంగా బీసీలకు సర్పంచ్ పదవుల్లో రిజర్వేషన్లు ఇస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు సర్పంచ్ పదవుల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. సర్పంచ్ పదవులకు రిజర్వేషన్లను ఆర్డీవోలు ఖరారు చేయనున్నారు. వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఎంపీడీవోలు ఖరారు చేయనున్నారు. రాజకీయ పార్టీల సమక్షంలో లాటరీ ద్వారా మహిళా రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు.

# పుట్టపర్తికి బయలుదేరిన రాష్ట్రపతి

హైదరాబాద్, నవంబర్ 22 (భారత శక్తి): రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బేగంపేట్ విమానాశ్రయం నుంచి పుట్టపర్తికి బయల్దేరారు. ఆమెకు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి వీడ్కోలు పలికారు. పుట్టపర్తిలో రాష్ట్రపతికి ఏపీ సీఎం చంద్రబాబు స్వాగతం పలకనున్నారు. రాష్ట్రపతితో పాటు శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొననున్నారు.





## ఓఆర్ఆర్‌పై దారుణం.. దైవదర్శనానికి వెళ్తూ మృత్యు ఒడికి

శంషాబాద్, నవంబర్ 22 (భారత శక్తి): దైవ దర్శనానికి బయలుదేరిన ఓ వ్యక్తిని మృత్యువు కబళించింది. ఈ హృదయ విదారక ఘటన శంషాబాద్ మున్సిపల్ పరిధి పెద్దగోల్కొండ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌కు చెందిన కామిని భరత్ (26) అవివాహితుడు. తన కారులో ముగ్గురు బంధువులను తీసుకొని కొల్లాపూర్‌నకు దైవ దర్శనానికి ఓఆర్ఆర్ మీదుగా బయలుదేరాడు. పెద్దగోల్కొండ ఎగ్జిట్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రక్కు కారును ఢీకొట్టి వెళ్లిపోయింది. రోడ్డు మధ్యలో ఆగిన కారును పక్కన తీసేందుకు ముగ్గురు నెడుతుండగా భరత్ స్టీరింగ్ తిప్పుతున్నాడు. ఈక్రమంలో మరో ట్రక్కు వేగంగా ఢీకొట్టి వెళ్లింది. తీవ్రంగా గాయపడిన భరత్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ముగ్గురికి తృటిలో ప్రమాదం తప్పింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.




## అనర్హత నోటీసు..
## మరికొంత సమయం కోరనున్న దానం!

హైదరాబాద్, నవంబర్ 22 (భారత శక్తి): పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబును కలిశారు. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అనంతరం ఆయన స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసే అవకాశం ఉంది. స్పీకర్ ఇచ్చిన అనర్హత నోటీసుకు సమాధానం ఇచ్చేందుకు మరికొంత సమయం కోరనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ విషయంపై ఏఐసీసీ పెద్దలతో దానం సంప్రదింపులు చేశారు. ఎమ్మెల్యేగా రాజీనామా, ఇతర అంశాలపై చర్చించినట్లు సమాచారం. తాను రాజీనామా చేస్తే.. తిరిగి తనకే టికెట్ ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరినట్లు తెలుస్తోంది. అనర్హత వేటు వేసేందుకు అవకాశం ఉంటే రాజీనామా చేస్తానని



సన్నిహితులకు దానం చెప్పినట్లు సమాచారం. పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులకు సమాధానాలు ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మరోసారి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 23వ తేదీలోగా సమాధానాలను అఫిడవిట్ రూపంలో స్పీకర్ కార్యాలయంలో అందజేయాలని వాటిలో సూచించారు.

## ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌లో అక్రమాలు జరిగాయి: కవిత

హైదరాబాద్, నవంబర్ 22 , (భారత శక్తి)రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టు అలైన్‌మెంట్‌లో మార్పులు జరిగిన తీరుపై మాజీ ఎంపీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత... కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఫిర్యాదు చేశారు. మెదక్ జిల్లాలో కొందరు ముఖ్య నేతలు, భూస్వాముల భూములను రక్షించేలా ప్రాజెక్టు లో మార్పులు జరిగాయని ఆరోపించారు. గడ్కరీకి పంపిన లేఖలో అలైన్‌మెంట్ పలు సార్లు మార్చడం వల్ల చిన్న, సన్నకారు రైతులు అధికంగా భూములు కోల్పోతుండగా... పెద్ద భూస్వాములు, రాజకీయ నాయకుల భూములు భూసేకరణకు దూరంగా ఉంటున్నాయని కవిత పేర్కొన్నారు. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో 57 మంది రైతుల భూముల్లో 56 ఎకరాలు స్వాధీనం చేసుకుంటున్నప్పటికీ భూస్వాముల భూములు ఏమాత్రం ప్రభావితం కాలేదని ఆమె తెలిపారు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం తొమ్మిదిరేకుల గ్రామంలో 1480 ఎకరాల మొత్తం భూమిలో 1550 మంది చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారని... ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ గ్రామ రైతుల పొలాలను దాదాపుగా మింగేస్తోందని



తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్‌కు ఉత్తర వైపున ఆర్ఆర్ఆర్ దూరం 25 కి.మీలో ఉండగా... దక్షిణ వైపున 40 కి.మీ.కు మించి వెళ్లడం అనుమానాస్పదంగా ఉందని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రాజెక్టు అలైన్‌మెంట్ పై పునఃసర్వే చేయాలని ఆమె ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సాంకేతిక పరమైన నివేదికను పారదర్శకంగా విడుదల చేయాలని, గ్రామాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు జరపాలని కోరారు. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ కు దూరంగా సమంగా ఉండాలన్నారు. రైతులకు నష్టం లేకుండా ఉండాలని ఆమె కోరారు. ఈ ప్రాజెక్టు పారదర్శకంగా, సాంకేతికంగా, న్యాయంగా అమలు కావాలని కోరుతున్నామని తన లేఖలో పేర్కొన్నారు.

## తెలంగాణలోని అన్ని జిల్లాలకు
## డీసీసీ అధ్యక్షుల నియామకం

హైదరాబాద్, నవంబర్ 22 (భారత శక్తి): తెలంగాణలోని అన్ని జిల్లాలకు డీసీసీ అధ్యక్షులను నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటన జారీ చేశారు. రాష్ట్రంలోని 33 జిల్లాలతో పాటు, 3 కార్పొరేషన్లకు అధ్యక్షులను నియమించారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ పరంగా 3 జిల్లాలకు డీసీసీ అధ్యక్షులను ప్రకటించారు. డీసీసీ అధ్యక్షుల నియామకంలో కాంగ్రెస్ అధిష్ఠానం సామాజిక సమీకరణలు పాటించింది.

## తెలంగాణలో భూకుంభకోణం.. సీఎం రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ తీవ్ర ఆరోపణలు

హైదరాబాద్, నవంబర్ 22 (భారత శక్తి) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పారిశ్రామిక భూములను లాక్కుని పెద్ద కుంభకోణా నికి తెరలేపుతున్నారని, తెలంగాణలో ఇండస్ట్రీ భూములను బడా వ్యాపార వేత్తలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఆరోపించారు. శనివారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. పారిశ్రామిక భూములను అప్పనంగా అమ్మి దానితో వచ్చిన కమిషన్లతో ఢిల్లీకి కప్పం కట్టేందుకు ముఖ్యమంత్రి ఈ కుంభకోణానికి పాల్పడుతున్నారని విమర్శించారు. గత పదేళ్ల పాలనలో కేసీఆర్ కూడా ఇందిరా పార్క్, ఎన్టీఆర్ స్టేడియం భూములను లాక్కునే ప్రయత్నం చేస్తే అడ్డుకున్నామని గుర్తుచేశారు. పారిశ్రామిక భూములను ప్రజా ప్రయోజనాల కోసమే కేటాయించాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక భూములను బలవంతంగా తీసుకునే పాలసీని మంత్రివర్గం ఉపసంహరించుకోవాలని సూచించారు. తెలంగాణలో ఒక బీజేపీ ఎంపీకి అధిష్ఠానం నోటీసు ఇచ్చిన అంశం తన దృష్టికి రాలేదని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమిపై ఎక్కడ తప్పు జరిగిందో సమీక్ష చేస్తున్నామని, భవిష్యత్తులో అలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.